: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తిరుపతి
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

18-9-2026
శుక్రవారం
సంపుటి: 32
సంచిక: 229
పేజీలు: 10+4
వెల: 6.50



గురువారం ఢిల్లీలో సెమికాన్ ఇండియా మూడు రోజుల సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సభికులకు అభివాదం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

# భారత్‌పై పెరిగిన అంతర్జాతీయ విశ్వాసం

**7.8%తో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పరిపుష్టం**

**సెమికాన్ ఇండియా-2026 కార్యక్రమంలో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటు చేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో >>2

## 76వ వసంతంలోకి ప్రధాని మోడీ

సుదీర్ఘ పనిగంటలు, అలుపెరుగని ఉత్సాహం 'మోడీ స్పెషల్'

కఠినమైన ఆహారపు అలవాట్లే ఆరోగ్య రహస్యం

ప్రధానిమోడీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

5లో



తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ముత్యపుపందిరిపై ఊరేగుతున్న మలయప్ప స్వామి

# ముత్యపుపందిరిపై మలయప్ప

**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** సప్తగిరుల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు గురువారం రాత్రి మలయప్పస్వామి విశేష అలంకారంలో ముత్యపుపందిరిపై ఊరేగి భక్తులను కటాక్షించారు. శ్రీకృష్ణుని అవతారమే కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడుగా ఏడుకొండల్లో కొలువైన స్వామిచల్లనిదేవుడు. భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. రాత్రి 7గంటలకు వాహన మండపం వద్ద ముత్యపు పందిరిపై వేంచేపుచేశారు. స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ వాహనసేవలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ లంకెల >>2



గురువారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు తిరుమలలో స్వాగతం పలుకుతున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్ నాయుడు





# రెండు సెషన్లలో జెఇఇ మెయిన్స్

## జనవరి 22 నుంచి తొలివిడత పరీక్షలు

**షెడ్యూలు విడుదల చేసిన ఎన్‌టిఎ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్-2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే యేడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టిఎ స్పష్టం చేసింది. జెఇఇ మెయిన్-2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. జనవరి 31ని బఫర్ తేదీగా (అదనపు తేదీగా) కేటాయించారు. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టిఎ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభం కానుంది. జెఇఇ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టిఎ వెల్లడించింది. దీని ప్రకారం, >>2

## ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం

**మోడీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి అన్ స్టాపబుల్**

**వికెఎస్... ఇదే భారత్ అభివృద్ధి మంత్రం**

**అయోధ్య రామమందిర నిర్మాణ కలను మోడీ నిజం చేశారు**

**దేశంలో నదుల అనుసంధానం ప్రధాని మోడీతోనే సాధ్యం**

## దేశ ప్రయోజనాల కోసం



గురువారం వారణాసి-వాద్నగర్ సేవా యాత్రను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# మోడీకి అండగా నిలవాలి

**వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించారు...**

**ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా చాటారు**

**యుపి ప్రభుత్వం అనుమతిస్తే అయోధ్యలో శ్రీవారి ఆలయ నిర్మాణం**

**'వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ష్ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**

**శీ కాశీ విశ్వనాథుని ఆలయంలో చంద్రబాబు ప్రత్యేక పూజలు**

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** "రైట్ టైమ్.. రైట్ లీడర్ నరేంద్ర మోడీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోడీకి అండగా నిలవాలి. ఎన్‌డియే ఐక్యతే దేశానికి బలన్ణ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 25 యేళ్ల పాలనా ప్రస్థానాన్ని, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన 'వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ష్ కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాశీ-వాద్నగర్ సేవా యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే మోడీ నాయకత్వంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందనే విషయాన్ని చెప్పారు. ఇక ఎపికి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువలేమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "కాశీ క్షేత్రం ప్రధాని నరేంద్ర మోడీ కర్మ భూమి. కాశీ పుణ్యక్షేత్రం నుంచి నరేంద్ర మోడీ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలు వారణాసికి నేతను ఎన్నుకోవడమే కాదు... దేశానికి ఓ లీడర్‌ను అందించారు. ప్రధాని నరేంద్ర మోడీ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుస్తున్నారు. వికెఎస్ అనేది అభివృద్ధి మంత్రం... ఈ మంత్రంతో దేశం అభివృద్ధి చెందుతోంది. వి అంటే వాద్నగర్, కె అంటే కాశీ, ఎస్ అంటే సెప్టెంబర్. ప్రజలకు సేవ చేస్తే.. దేశానికి సేవ చేయడమేనని ప్రధాని నరేంద్ర మోడీ నమ్ముతారు.

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జెజెఎం, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి కోసం ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనేది ప్రధానికల. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు... ఈ >>2

# చకచకా పోలవరం!

**2027నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం**

**ఇసిఆర్ఎఫ్ పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల**

**మూడేళ్లలో 36 ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు**

**ప్రాజెక్ట్ వద్ద ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు**

**టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో పాటు ఇంజనీర్లతో కలిసి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో పాల్గొన్న రామానాయుడు**



గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**ఏలూరు, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టు పనులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇసిఆర్ఎఫ్ డ్యామ్‌లో గ్యాప్-1 పనులు 49శాతం, గ్యాప్-2 పనులు 43శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రైట్ కనెక్టివిటీ పనులను ఈ నెలాఖరుకు, లెఫ్ట్ కనెక్టివిటీ పనులను నవంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యం మేరకు 2027 మార్చి నాటికి ఇసిఆర్ఎఫ్ పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. రూ.536 కోట్లతో చేపట్టిన కుడి, ఎడమ గట్ల >>2

# బాలికపై అత్యాచారం నిందితుడికి యావజ్జీవ శిక్ష

**రూ.10 వేలు జరిమానా విధింపు**

**గుంటూరు పోక్సో కోర్టు తీర్పు**

**బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం**

**జిల్లా కలెక్టర్‌కు న్యాయమూర్తి ఆదేశం**

**గుంటూరు(లీగల్), సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** యేడేళ్ల బాలికను అత్యంత పాశవికంగా అత్యాచారం చేసిన నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రెంటచింతల మండలం, తుమ్మకోట గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక 2019 జనవరి 29వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో కంగారు పడ్డ అమ్మమ్మ కేకలు వేసి పిలిచినా పలకలేదు. దాదాపు గంటన్నరపైగా అన్ని ప్రాంతాల్లో వెతికాక, సమీపంలోని రైస్ మిల్లులో చూసేందుకు వెళ్లారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మిరియాల జయరావు బాలికపై అత్యాచారం చేయటాన్ని కుటుంబ సభ్యులు చూసి కేకలు వేశారు. నిందితుడు జయరావు పరారయ్యాడు. అప్పటికే బాలికకు తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గురజాల పోలీసులు నిందితుడు జయరావును అరెస్ట్ >>2

# వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు రాత పరీక్ష తప్పనిసరి

**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**విడుదలైన నోటిఫికేషన్ రద్దు**

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల నియామక ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఇకపై ఈ పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ ద్వారా రాతపరీక్షను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలని ఈనెల 13, 14 తేదీల్లో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఇప్పటికే ఈ పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ విషయంలో ఉద్యోగార్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దాంతో ప్రభుత్వం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల నియామకాన్ని రాత పరీక్ష ద్వారా నిర్వహించాలని నిర్ణయించింది. ఆ దిశలో త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నది.

# ఓటర్ల జాబితా సవరణ త్వరగా పూర్తిచేయండి

**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సిద్ధం కావాలి**

**జిల్లా కలెక్టర్లకు సిఇఒ వివేక్ యాదవ్ ఆదేశం**

**హింసాత్మక కేసుల విచారణ ప్రక్రియను త్వరితగతిన ముగించండి: ఎస్పీలకు సిఇఒ సూచన**

**సచివాలయం, సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026 కార్యక్రమాలను నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని, అదే సమయంలో ఎన్నికలనాటి, ఎన్నికల అనంతరం హింసాత్మక కేసుల విచారణ ప్రక్రియను త్వరితగతిన ముగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం వెలగపూడిలోని సచివాలయం నుంచి అదనపు సిఇఒ ఎస్.ఢిల్లీరావుతో కలసి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో (డిఇఒలు) ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు, అనంతపురం, తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డిఇఒలతో మాట్లాడి, ఆయా జిల్లాల్లో నమోదైన హింసాత్మక కేసుల ప్రస్తుత స్థితిగతులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా కలెక్టర్లు, ఎస్పీలు చొరవ చూపాలని స్పష్టంచేశారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారులు స్పందిస్తూ ఓటర్ల జాబితా సవరణ పనులన్నింటిని నిర్ధేశిత షెడ్యూల్ ప్రకారమే విజయవంతంగా పూర్తి చేస్తామని సిఇఒకు హామీ ఇచ్చారు.

# రోగి భద్రతలో ఎపి నం.1

**• ఆస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాల పాటింపులో 86 స్కోరుతో రాష్ట్రానికి ప్రథమ స్థానం • ప్రపంచ రోగి భద్రత దినోత్సవ కార్యక్రమంలో కేంద్రం వెల్లడి • అధికారులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు**

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రోగి భద్రతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 86 స్కోరు సాధించి జాతీయ స్థాయిలో అత్యధిక సగటు మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్నచర్యలకు ఇదిగుర్తింపుగా నిలిచింది. టాప్ ఫైవ్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 86, మధ్యప్రదేశ్ 84.5, గుజరాత్ 83.5, దాద్రా-నగర్ హవేలీ, డామన్- డయ్యూ 83, తమిళనాడు 82 స్కోర్లు సాధించాయి. రాష్ట్రంలో లక్ష్యంగా ఉన్న 53 ఏరియా ఆస్పత్రులు, 9 జిల్లా ఆస్పత్రులు.. మొత్తం 62 ఆస్పత్రుల్లో 100శాతం రోగి భద్రతా తనిఖీలు పూర్తయ్యాయి. రోగి భద్రతా స్వీయ మదింపు విధానంద్వారా ఈతనిఖీలు నిర్వహించారు. జిల్లా నాణ్యతా బృందాలు, రాష్ట్ర నాణ్యతా విభాగం నివేదికలను సమీక్షించి సమగ్ర నివేదికను ఆగస్టు 10న జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రానికి సమర్పించాయి.

**నాణ్యతా ప్రమాణాల్లోనూ పురోగతి:** >>2



గురువారం విజయవాడలో సెర్ప్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ

# మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**విజయవాడ, సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో గురువారం సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఇప్పటివరకు 1,02,009ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.15,054కోట్ల బ్యాంకురుణాలు అందించి నట్లు అధికారులు మంత్రికి సూచించగా... నిర్దేశించుకున్న >>2

18-9pg2exHMNWJQE:18-9pg2exHMNWJQE.qxd 9/17/2026 11:27 PM Page 1





ఉత్తరాఖండ్‌లో ఉన్న కేదార్‌నాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు

# ముత్యపుపందిరిపై మలయప్ప

>> సుబ్బ రాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**తిరుమలలో రాష్ట్ర గవర్నర్ నజీర్**

శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవల వీక్షణతోబాటు స్వామి వారి దర్శనార్థం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం మధ్యాహ్నం తిరుమల విచ్చేశారు. ఆయనకు బాగీ అతిథిగృహం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. గవర్నర్ సాయంత్రం శ్రీవారి వాహనసేవలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.

# జెఇఇ మెయిన్స్


>> యుజిసి నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 20-21 తేదీలను బఫర్ తేదీలుగా నిర్ణయించారు. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సిఎంఏటి) పరీక్ష 2027 ఫిబ్రవరి 7న జరుగుతుంది. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్-2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

## నిందితుడికి యావజ్జీవ శిక్ష

>> చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల పరిహారాన్ని అందివ్వాలని జిల్లా కలెక్టర్‌ను న్యాయమూర్తి ఆదేశించారు.

## అగ్ని ప్రమాదాల నివారణ శాఖ పరిధిలో 147 డ్రైవింగ్ ఆపరేటర్లు భర్తీ కోసం నోటిఫికేషన్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాల నివారణ శాఖ పరిధిలో 147 డ్రైవింగ్ ఆపరేటర్లు భర్తీ కోసం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ నోటిఫికేషన్ జారీ చేసింది.పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ పేరిట విడుదలైన ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థుల అర్హతలు, దరఖాస్తుల దాఖలు ఇతరంశాల కోసం వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.ఈ వివరాలు సాధ్యమైనంత త్వరలో వెబ్‌సైట్‌లో పెడతామని, ఇందుకు సంబంధించిన సైట్‌ను అనుసరించాలని నోటిఫికేషన్‌లో వివరించారు.



ప్రమాదంలో మరణించిన నెహా బొమ్మలి, రమాదేవి (ఫైల్)

# ఆస్ట్రేలియాలో కారు ప్రమాదం

## ఇద్దరు విశాఖవాసులు మృతి

**విశాఖపట్నం, సెప్టెంబరు 17ప్రభాత వార్త :** ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం కు చెందిన ఇద్దరు తెలుగు మహిళలు దుర్మరణం పాలయ్యారు.ఈ ప్రమాదంలో మరణించిన వారిని నెహా బొమ్మలి (33) ఆమె అత్తగారు రమాదేవి (67)గా గుర్తించారు. విడిసిఎలో గతంలో జాయింట్ సెక్రటరీగా పనిచేసిన జిటి ప్రసాద్ ఇటీవల శుభకార్యంలో భాగంగా భార్యతో పాటు జీటి ప్రసాద్ ఆస్ట్రేలియా వెళ్లారు.తన కళ్ల ఎదుటే కారు ప్రమాదంలో భార్య, కోడలు నేహా మృతి చెందడంతో ప్రసాద్ తీవ్రంగా కలత చెందారు. కోడలు నెహా బొమ్మలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.మెల్‌బోర్న్ నైరుతి శివారు ప్రాంతమైన పాయింట్ కుక్‌లోని 'బోర్డ్‌వాక్ బౌలేవార్డ్', 'ఇన్నిస్‌ఫైల్ డ్రైవ్' కూడలి వద్ద రాత్రి 9:40 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న టయోటా కొరోలా కారును ఒక లగ్జరీ పోర్షే కారు బలంగా ఢీకొట్టింది.ఢీకొన్న తీవ్రతకు ఇద్దరు మహిళలు ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. పోర్షే కారు నడుపుతున్న 53 యేళ్ల వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి, ప్రస్తుతం అతను పోలీసుల విచారణలో ఉన్నాడు.మృతుల దేహాలను హిందూ సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడానికి భారతదేశానికి తరలించేందుకు మరియు ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు అక్కడి తెలుగు కమ్యూనిటీ గోఫండ్మే ద్వారా విరాళాలు సేకరిస్తోంది.

# మోడీకి అండగా నిలవాలి

>> అంకెలు వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి - సంక్షేమం ఉంది. పిఎంకిసాన్ కింద 11కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారు... ఇందులో ఎలాంటిమధ్యవర్తులు లేరు. నేరుగా రైతులఖాతాలకే నగదును జమచేస్తున్నారు" అని వివరించారు.

**కోవిడ్ వ్యాక్సిన్‌తో 140 కోట్ల ప్రజలను కాపాడారు:**

"ప్రపంచంలోని వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న సందర్భంలో నరేంద్ర మోడీ దేశానికి మంచి నాయకత్వం అందించారు. 140 కోట్ల మంది భారతీయులను కాపాడారు... వారికి ఇబ్బందులు కలగకుండా చేశారు. 200 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసేలా ప్రొత్సహించిన ప్రధాని నరేంద్ర మోడీ కరోనా బారి నుంచి ప్రజలను కాపాడారు. 101 దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. విశ్వ మానవాళి సంక్షేమం కోసం డబ్బులు గురించి ఎలాంటి ఆలోచన చేయకుండా కోవిడ్ వ్యాక్సిన్లను నరేంద్ర మోడీ ఉచితంగా వివిధ దేశాలకు అందించారు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ ఇలాంటి విధానాలతో మేకిన్ ఇండియా కాన్సెప్ట్ బలోపేతం అయ్యేలా చేశారు. గతంలో డిఫెన్స్ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమే. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండెక్టర్ టెక్నాలజీస్ వంటి వాటితో పాటు రోబోటిక్స్ వంటి వాటిని ప్రధాని మోదీ అర్థం చేసుకోగలరు.. వాటి వల్ల యువతకు లబ్ది చేకూర్చగలరు. గతంలోయువత ఉద్యోగాల మీద ఆధారపడే వాళ్లు. కానీ ప్రధాని దూరదృష్టితో 2.20 లక్షల స్టార్టప్‌ల ద్వారా యువతే ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకున్నారు. ఉద్యోగాలు చేసే స్థాయినుంచి ఉద్యోగాలు కల్పించేస్థాయికి యువత చేరారంటే దానికి ప్రధాని నరేంద్రమోడీనే కారణం. అద్భుతమైన స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రధాని చేస్తున్న కృషి అపూర్వం.. భేటీ బచావోభేటీ పడావో, లక్పతీ దీదీ వంటి పథకాలే దీనికి నిదర్శనం. ఉజ్వల పథకం క్లీన్ ఫ్యూయల్ అందిస్తుంది.. ముద్ర పథకం పెట్టుబడిసమకూరుస్తుంది.. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీశక్తి అధినియం ద్వారా చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు.. ఇది గేమ్ ఛేంజర్ కాబోతోంది" అని సిఎం చంద్రబాబు చెప్పారు.

**తిరుగులేని శక్తిగా భారత్:**

"ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెడడానికి కారణం ప్రధాని మోడీ. ఇటీవలే బ్రిక్స్ సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహించారు. వివిధ దేశాల అధినేతలు మన ప్రధాని నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారు... ఆపరేషన్ సింధూర్ ద్వారా ధీటైన జవాబుతో భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌ను నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అభినందిస్తున్నా. నేను కూడా వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు... వారికి నేనూ బాధితుణ్ణే. కానీ ఇప్పుడు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపారు... దటీజ్ నరేంద్ర మోడీ. దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీదే. దేశంలో కనెక్టివిటీ పెంచారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలు దేశంలో ఉన్నాయి.. కానీ దేశాభివృద్ధి, ఆత్మనిర్భరత అనేదే మన లక్ష్యం. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుంది. సుస్థిరత వల్ల నమ్మకం పెరుగుతుంది.. నమ్మకంవల్ల పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులువల్ల ఉద్యోగాలు సమకూరుతాయి.. అభివృద్ధి జరుగుతుంది. ఉద్యోగాలవల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రమే ఇంకా పెండింగులో ఉంది... ఈనదుల అనుసంధానం ప్రధాని మోడీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంసంధానం చేస్తే భారత్ అన్ స్టాపబుల్. 25 ఏళ్ల పాటు కంటిన్యూగా పాలనలో ఉండడం మామూలు విషయం కాదు. దేశంలో.. ప్రపంచంలో కూడా ఈ విధంగా రాజ్యాంగ పదవిలో ఉండడం సాధ్యంకాదు. ప్రధాని నరేంద్ర మోడీ సమాజాన్ని చదివారు... చాలా నేర్చుకున్నారు... దానికి అనుగుణంగా పాలన చేపట్టారు. 2003లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోడీ వైబ్రంట్‌గుజరాత్ అనే కార్యక్రమం నిర్వహించారు.. ఇప్పుడది గ్లోబల్‌బ్రాండ్‌గా మారింది. నరేంద్ర మోడీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు... గ్రామీణ ప్రాంతాలకు చేరింది. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ ఇదే ప్రధాని మోడీ లక్ష్యం" అని సిఎం అన్నారు.

**త్రేతాయుగం.... కలియుగం:**

"కోట్లాది భక్తులు మహా కుంభమేళాకు వారణాసి వచ్చారు. మహా కుంభమేళాను యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ అద్భుతంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పూర్తి చేశారు. కలగా ఉండే రామ మందిర నిర్మాణాన్ని నరేంద్ర మోడీ నిజం చేశారు. త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. వెంకన్న ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించాలి" అని సిఎం చంద్రబాబు యుపి ముఖ్యమంత్రిని కోరారు.

**సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగిన చంద్రబాబు ప్రసంగం:**

సిఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించడంతో సభికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రసంగం మొత్తం సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగడంతో పలుమార్లు పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వినిపించాయి. రామజన్మభూమి నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన వివరించారు. ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ... యే మేరేలియే గర్వ్ కారణ్ హై అంటూ సిఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక ప్రసంగం మధ్య మధ్యన దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై, నయా భారత్ హై.... ఆత్మ నిర్భర్ భారత్ హై అంటూ వ్యాఖ్యానించారు. చివరిలో ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్, వికసిత్ భారత్... యహీ హమారా సంకల్ప్ హై అంటూ సిఎం తన ప్రసంగాన్నిముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి అతిథుల నుంచి ప్రశంసలు లభించాయి.

తన ప్రసంగం ప్రారంభానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు... వెరీ వెల్.. వెరీ వెల్ అంటూ ప్రశంసించారు. చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లతో అభినందనలు తెలపాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ హర్షధ్వానాలతో మార్మోగింది. ఈకార్యక్రమంలో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగానిలిచారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన కుటుంబానికున్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తనతండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు చంద్రబాబు అత్యంత సన్నిహితుడని, తన తండ్రి కష్టసుఖాల్లో ఆయనకు అండగా నిలిచారని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

## ప్రత్యేక పూజలు

వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాశీ విశ్వనాథుడిని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాలతో కాశీ విశ్వేశ్వరుణ్ణి అభిషేకించారు. కాశీ విశ్వనాధుని ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ యాత్ర చేపడుతున్న వారికి కేంద్ర మంత్రులు, యుపి సిఎంతో కలిసి ప్రసాదాన్ని పంచి పెట్టారు. సభ అనంతరం సేవా సంకల్ప్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

# చకచకా పోలవరం!

>> కొనసాగుతున్నాయని తెలిపారు. 2024 జూన్ తర్వాత 10,491 ఎకరాల భూమిని సేకరించి నిర్వాసితులకు రూ.2,250 కోట్ల పరిహారం అందించామని పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. హంద్రీ-నీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తి చేసి నీటిని విడుదల చేశామని చెప్పారు. రానున్న మూడేళ్లు సాగునీటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల పండుగగా నిలుస్తాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు ప్రశ్నార్థకంగా మారాయని, ప్రస్తుత ప్రభుత్వం పోలవరం పూర్తవుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించిందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రధాని మోడీ సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పోలవరం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2027 నాటికి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు.

**పోలవరం ప్రాజెక్ట్ వద్ద ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు:**

పోలవరం ప్రాజెక్టు వద్ద టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో పాటు ఇంజనీర్లతో కలిసి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పోలవరం ప్రాజెక్ట్ వద్ద జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "ప్రధాని మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలనిప్రార్థిస్తున్నాం. భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దుతున్న ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలనే ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలకు అనుగుణంగా దేశం ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాం" అని మంత్రి నిమ్మల

## అత్యంత ప్రాధాన్యత

>> రూ.36,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా బ్యాంకర్లతో సమన్వయం పెంచాలని మంత్రి ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ.4,800 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు మంజూరు చేసే క్యాష్ క్రెడిట్ రుణాలపై ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇన్‌స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించాలని, గ్రామీణ సభలు, సమాఖ్యల నెలవారీ సమావేశాల అజెండాలో ఈ అంశాన్ని చేర్చాలని మంత్రి అధికారులనుఆదేశించారు. ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళకు 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', 'ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' పథకాల కింద బీమా రక్షణ కల్పించాలని.. జిల్లా సమాఖ్యల ఇన్సూరెన్స్ కాల్ సెంటర్ల ద్వారా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే 65 రకాల ఉత్పత్తులను విక్రయించడానికి 4 స్వయం బ్రాండ్ సిగ్నేచర్ స్టోర్ల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి, ఆధునిక లాండ్రీ, బ్యూటీ పార్లర్, హెయిర్ కటింగ్ వంటి వృత్తి నైపుణ్యాలలో మహిళలకు, చేతివృత్తిదారులకు శిక్షణ ఇస్తామని మంత్రితెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వారికుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా అధికారులు నిరంతరం శ్రమించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

18-09-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.సప్తమి మ.1.02, న.జ్యేష్ఠ రా.10.45
వ.లేదు
దు.ఉ.8.21 - ఉ.9.10
2) మ.12.25 - మ.1.14
రాహు.ఉ.10.30 - మ.12.00
శుభ స. ఉ.10.00 - ఉ.11.00

## వార్తాఫలం

**మేషం :** ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకుంటారు. సభలు, సమావేశాలకు హాజరవుతారు.

**వృషభం :** మీ శక్తి సామర్థ్యాలు గుర్తింపదగినవిగా ఉంటాయి. మీకు తోచిందే చేస్తారు. లీజులు, లైసెన్సులు పొడిగింపబడతాయి.

**మిథునం :** ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది. ఏ విధంగా సాగుతాయో అనుకున్న పనులు లాభించే విధంగా సానుకూల పడతాయి.

**కర్కాటకం :** ఇచ్చిపుచ్చుకోవడంలో జాగ్రత్తలు అవసరం. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. స్వల్ప ధనలాభ సూచన.

**సింహం :** ఊహించుకున్న విధంగా కాకపోయినా ఆర్థిక వ్యవహారాలు ఊరటను కలిగించే విధంగానే ఉంటాయి.

**కన్య :** స్వయం కృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. ఆత్మీయ వర్గ సహాయ సహకారాలు లభిస్తాయి.

**తుల :** అన్యభాషలు నేర్చుకోవాలనుకునే మీ కోరిక నెరవేరే సూచనలు గోచరిస్తున్నాయి. మీ ప్రతిభాపాటవాలు వెలుగుచూస్తాయి.

**వృశ్చికం :** అసహనాన్ని ఏమాత్రం దరి చేరనీయరు. విదేశీయాన వ్యవహారాలలో ఏర్పడిన సాంకేతిక లోపాలు సర్దుమణుగుతాయి.

**ధనుస్సు :** మీ శక్తికి మించిన కార్యక్రమాలు నిర్వహించ వలసి వస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు సానుకూల పడతాయి.

**మకరం :** జీవితాశయం నెరవేర్చుకునే విధంగా కొన్నిఅంశాలు మీకు అనుకూలిస్తాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలనుకుంటారు.

**కుంభం :** నిజమైన శ్రేయోభిలాషులు ఎవరన్నది తెలుసుకొన గలుగుతారు. ఇతరుల నుండి వాగ్దానాలను తీసుకుంటారు.

**మీనం :** వ్యాపారస్తులకు మధ్యస్థంగా ఉంటుంది. అసత్యమైన ఆరోపణలను త్రిప్పి కొట్టగలుగుతారు. అధికంగా శ్రమిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం వారణాసిలో కాశీ విశ్వానాధుడికి అభిషేకం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులు

# అంతర్జాతీయ విశ్వాసం

>> ఏజెంటిక్ ఎఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించామని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి అన్నది వాస్తవరూపం దాలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ సెమీకాన్ 2.0 కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలుముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్‌డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85వేల మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70వేలమందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# రోగి భద్రతలో ఏపి నం.1

>> గణనీయమైన పురోగతి సాధించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, రోగి భద్రత, పరిశుభ్రత, రోగి కేంద్రిత సేవలు తదితరఅంశాల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న తీరును ఎన్‌క్యూఏఎస్ ద్వారా అంచనా వేస్తారు. రాష్ట్రంలో ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ 65 శాతానికి చేరింది. రోగి భద్రత, నాణ్యమైన వైద్యం, రోగి కేంద్రిత సేవలను మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయి.

**జాతీయ వేదికపై ఏపి పురోగతి:**

ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో, జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రం (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సి), న్యూఢిల్లీ సహకారంతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 'అసాంక్రమిక వ్యాధులకు సురక్షితమైన వైద్య సంరక్షణ' అనే అంశంపై గురువారం న్యూఢిల్లీలోని ఎన్ఐహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరిగింది. అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు, చికిత్స, మందుల వినియోగం, తదుపరి పరీక్షలు, పర్యవేక్షణలో రోగి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ మిషన్ డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సిబిన్ సి. గౌరవ అతిథిగా, ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) ప్రగ్యా శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ ఎండి కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌క్యూఏఎస్ అమలు, నాణ్యతా ప్రమాణాల పురోగతిని వర్చువల్‌గా వివరించారు. రాష్ట్రంలో ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ 65 శాతానికి చేరిన విషయాన్ని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర సమన్వయకర్త నాగలక్ష్మి కార్యక్రమానికి నేరుగా హాజరయ్యారు. రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలు, అసాంక్రమిక వ్యాధుల నియంత్రణలో భద్రతా ప్రమాణాలపై జరిగిన చర్చల్లో ఆమె పాల్గొన్నారు.

**సమష్టి కృషితో జాతీయ గుర్తింపు:**

రాష్ట్ర నాణ్యతా విభాగం, జిల్లా నాణ్యతా బృందాలు, ఆస్పత్రులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయడంవల్ల ఈ పురోగతి సాధ్యమైంది. రోగిభద్రతను ప్రభుత్వ వైద్య సంస్థల్లో నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రావడంపై అధికారులు, వైద్య సిబ్బందిని అభినందించారు. రోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యం

# డా. టి. సుబ్బిరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

## జిపిఎల్ ఆంధ్రప్రదేశ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.హాకీమ్



గురువారం విశాఖలో సుబ్బిరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్.ఎ.హాకీమ్ తదితరులు

**విశాఖపట్నం, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** కళాబంధు డా. టి. సుబ్బిరామిరెడ్డికి జిపిఎల్ ఆంధ్రప్రదేశ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.హాకీమ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి. వెంకటేశ్వరరావు, సిఎఫ్ఒ ఎన్. శేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ బి వెంకటరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎ.హాకీమ్ డా టి. సుబ్బిరామిరెడ్డికి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ44 సం.ల నుండి విశాఖ, విజయనగరం ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు మరువలేని అన్నారు. 5 కోట్ల రూ.ల సొంత నిధులతో కె.జి.హెచ్, ఆసుపత్రి రోగుల సహాయకుల సౌకర్యార్థం ధర్మసత్రం ఉచిత భోజన సదుపాయంతో పాటు విశాఖలో 40 లక్షల మొక్కల పెంపకానికి విశేష కృషి అని తెలిపారు. వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ, కుట్టు మిషన్లు, ఐరన్ బాక్సులు, యువతకు క్రికెట్ కిట్లుఉచిత మంచి నీటి సరఫరాపేదల కొరకు ఉచిత వైద్య శిబిరాలు ఉచిత మందుల పంపిణీ తోపాటుసుమారు 25 వేల మందికి ఉచిత కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు చేయించారన్నారు. అప్పట్లోనే ఉచిత అంబులెన్సు సర్వీసులువిశాఖలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి విశేషకృషి చేశారని చెప్పారు. విశాఖ ప్రజల కొరకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు 500 దేవాలయాలు, 150 చర్చిలకు, 50 మసీదులకు తన వంతు సహాయ సహకారాలు అందించారన్నారు. విశాఖ ప్రజలకు ఎన్నో పదాలు అందించిన మానవతామూర్తి, పేదల పాలిట నిత్య పెన్నిది కొన్ని కోట్ల రూపాయల సొంత నిధులు వెచ్చించి మానవసేవయే మాధవసేవగా భావించి నిగర్వి, స్నేహశీలి. ఎదిగిన కొద్ది ఒదిగే మనిషి, ఒక చేతితో చేసిన సాయం మరో చేతికి తెలియనివ్వని నిత్య సేవకుడు, చిరకాలం సేద ప్రజల హృదయాల్లో విడిచే మహోన్నతమైన వ్యక్తులు మా సిద్ధాయిన రాజ్యసభ మాజీ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రివర్యులు, మాజీ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్, మాజీ టిటిడి మాజీ చైర్మన్ తిక్కవరపు సుబ్బిరామిరెడ్డి విశాఖ ప్రజలే ఎన్నటికీ మరువలేరు అని తెలిపారు.

18-9pg3exHMNWJQEBPGOL:18-9pg3exHMNWJQEBPGOL.qxd 9/17/2026 11:11 PM Page 1



# ప్రధాని మోడీకి సిఎం, డి.సిఎం జన్మదిన శుభాకాంక్షలు

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సోషల్ మీడియా వేదికగా వారు తమ సందేశాలను పంచుకున్నారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానిగా మీ నాయకత్వం చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా సుమారు 25 ఏళ్ల మీ ఆదర్శప్రాయమైన ప్రజాసేవ భారత ప్రగతి ప్రస్థానానికి నూతనోత్తేజాన్ని అందించింది. సేవ, సంకల్ప్, సుశాసన్ అనే మీ దార్శనికత 140 కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తోంది' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశసేవలో ప్రధాని మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని, ఆయనకు శ్రీవేంకటేశ్వరస్వామి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ సైతం ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ "సాధారణ సేవకుడు నుంచి ఎదిగి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న మీ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. మీలోని అపారమైన శక్తి, క్రమశిక్షణ, దేశాభివృద్ధి పట్ల మీకున్న అచంచలమైన నిబద్ధత ప్రజాక్షేత్రంలో ఉన్న మా వంటి లక్షలాది మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని కొనియాడారు.

## శ్రీకాళహస్తిలో ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరంలో రక్తం ఇస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం భారత ప్రదాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకలను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి పట్టణంలో సామాజిక కార్యక్రమాలను వాడవాడల్లో నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 'మెగా రక్తదాన శిబిరాన్ని' నిర్వహించి 200 మంది యువకులు రక్తదానాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ 'నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 13, ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు వెరసి 25 ఏళ్ల ప్రజాపరిపాలన సేవాలో ఒక్క రోజు కూడా సెలవు లేకుండా దేశానికీ ఒక సేవకుడుగా శ్రామిస్తున్నారు. 2047 నాటికీ భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలిపేందుకు దేశ సేవకుడుకుగా మోడీ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాల్లి అని పిలుపు నిచ్చారు. 76 సంవత్సరాల్లో యువకుని వలె భారత దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పటానికి కృషిచేయటం గర్వించదగ్గ విషయం అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో కొనసాగాలని ప్రధానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూటమి నేతలతో కలిసి విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమా, జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కునాటి నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షులు ప్రజ్ఞాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆహార భద్రత అందించిన గొప్ప నాయకుడు ప్రధాని మోడీ

● 'ఆశీర్వాద్ కా దియ్యా కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల



'ఆశీర్వాద కా దియ్యా కార్యక్రమంలో దీపాలు వెలిగించి ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** 140 కోట్ల భారతీయులకు ఆహార భద్రతను అందించిన గొప్ప దార్శనిక నేత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గతంలో రాయితీపై అందించే ఆహార ధాన్యాలను పూర్తిగా ఉచితంగా దేశ ప్రజలకు అందించిన ఘనత మోడీ దక్కుతుందని చెప్పారు. ప్రధానమంత్రి మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని 'ఆశీర్వాద్ కా దియ్యా కార్యక్రమంలో భాగంగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావుతో కలిసి విజయవాడలోని లక్ష్మీపతి నగర్‌లో ఉన్న రోజువారి కూలి నూకరాజు ఇంటి ఆవరణలో దీపాలు వెలిగించి ప్రధాని మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మీడియాతో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ 'రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మోడీ జన్మదిన కార్యక్రమాలను పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహిస్తు న్నాం. మోడీ లాంటి గొప్ప నాయకుడు భారతదేశానికి అవసరం. భారత దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తున్న మోడీ లాంటి నాయకుడికి దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రజలంతా ఐక్యంగా దీపాలు వెలిగించి శుభాకాంక్షలు తెలియజేయడం గొప్ప విషయ్యం అని పేర్కొన్నారు.

**ఈ వారంలోనే రాయితీ ఉల్లి:** నిత్యావసరాల ధరలు పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ఈ వారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా రాయితీ ఉల్లి అందించే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వీటితోపాటు త్వరలోనే పామాయిల్, కందిపప్పు కూడా రాయితీ ధరలపై ప్రజలకు అందించేలా చూస్తామన్నారు. కీలక సమయంలో తక్కువ ధరలకే ప్రజలకు నిత్యవసరాలు అందించే విషయంలో కేంద్ర సహకారం ఎనలేనిదని పేర్కొన్నారు. ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీకి రాష్ట్ర ప్రజల తరఫున మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, వీర మహిళ విభాగం రీజినల్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూప్రసాదంలో పీచు

## తప్పుడు వార్తలు నమ్మొద్దని టిటిడి విజ్ఞప్తి

**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రహ్మోత్సవాల వేళ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కొబ్బరి పీచు ఉన్నట్లు కొంతమంది సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టడం బాధ్యతా రాహిత్యమని టిటిడి పేర్కొంది. ఆ ఫోటోలో ఉన్నది శ్రీవారి లడ్డూ ప్రసాదం కాదని, లడ్డూ తయారీ విషయంలో టిటిడి ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ఎంతో భక్తి శ్రద్ధలతో వైష్ణవ బ్రాహ్మణులతో. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయడం జరుగుతుందని, అయితే కొందరు అవాస్తవాలను ప్రచారం చేయడం మంచిది కాదని పేర్కొంది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి తెలియ జేసింది.



ఆశీర్వాద దీపం కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, సోము వీర్రాజు

# నమో జయీభవ.. విజయీభవ

● ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా ఆశీర్వాద దీపం వెలిగించిన మంత్రి లోకేష్

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచమంతా వికసిత్ భారత్ వైపు చూసేలా అభివృద్ధి, సంక్షేమం, సాధికారత, సుస్థిరతతో పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు వేడుకలను ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహించారు. మన దేశాన్ని అభివృద్ధిలో ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా నిలిపే శక్తియుక్తులని మోడీకి దేవుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ.. "ఆశీర్వాద్ కా దియ్యా (ఆశీర్వాద దీపం) వెలిగించారు. అందరి ఆశీస్సులతో ప్రధాని మోడీ వందేళ్లు వర్థిల్లాలని ఆకాంక్షించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో మౌలిక సదుపాయాల కల్పన ఒక యజ్ఞంలా సాగుతోందని మంత్రి ప్రశంసించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ (అందరి భాగస్వామ్యంతో అందరి అభివృద్ధి) అనే నినాదంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదరికాన్ని రూపు మాపేందుకు కృషి చేస్తున్నారని లోకేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి - సంక్షేమమే లక్ష్యం

● డిఎస్సీపై వైసిపివన్నీ అసత్య ఆరోపణలు: మంత్రి అనిత ● మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి అద్దంకిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**అద్దంకి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సంతోషంతో వుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ళుగా పనిచేస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ కేంద్రంలో రూ.10కోట్లకు పైగా అభివృద్ధి పనులను రాష్ట్ర విద్యుత శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలువాలని, ఎల్‌నినో పరిస్థితులలో రాష్ట్రంలో త్రాగునీరు, సాగునీరు, విద్యుత్‌కి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకొని, పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థికంగా నిధులను, సమకూరుస్తూ, మౌలిక వసతులు, అత్యవసర సేవలు, అన్నింటిని కొనసాగిస్తున్నారని, వీటిలో రోడ్లు, డ్రైన్లు, వైద్యసేవలు, అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని కూడ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారని, అదే స్థాయిలో పరిశ్రమలు, ఉపాధి కల్పన, కార్యక్రమాలను కూడ ముఖ్యమంత్రి కొనసాగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. డిఎస్సీని పారదర్శకంగా నిర్వహిస్తే యేడాది తరువాత జగన్‌మోహన్‌రెడ్డి బయటకు వచ్చి, నెలకు ఒకసారి ప్రెస్‌మీట్ పెట్టి, ప్రజలను రెచ్చగొట్టి కొటుకునేలా ప్రోత్స హిస్తున్నాడని ఆమె ధ్వజమెత్తారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల సంక్షేమంకు, కట్టుబడి వుందని, పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా కూటమికి ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని, జరుగుతున్న అభివృద్ధి కొనసాగేలా చూడాలని అన్నారు.

**పలు అభివృద్ధి పనులు ప్రారంభం:** అద్దంకి పట్టణంలో గురువారం స్థానిక శాసనసభ్యులు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత రూ.10.72కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఎన్ఎస్‌పి కాలనీ ఆవరణలో రూ.7.72కోట్లతో నిర్మించిన 33/11కెవి సెమీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాన్ని హోం మంత్రి ప్రారంభించారు. సింగరకొండలోని రూ.2.25కోట్లతో నిర్మించిన అగ్నిమాపక కేంద్ర నూతన భవనాన్ని అమె ప్రారంభించారు. రూ.75లక్షలతో అగ్నిమాపక కేంద్రానికి సమకూర్చిన నూతన అగ్ని మాపక వాహనాన్ని హోం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిజి వెంకటరమణ, జెసి కల్పనాకుమారి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సుందరం, విద్యుత్ ఎస్.ఇ. కట్టా వెంకటేశ్వర్లు, డిఎఫ్ఒ కె.శ్రీకాంత్‌రెడ్డి, హౌసింగ్ ఇఇ మురళీకృష్ణ, ట్రాన్స్‌కో ఇఇ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్సీపై చర్చకు జగన్ రావాలి: మంత్రి లోకేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** డిఎస్సీ అంశంపై వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బహిరంగ చర్చకు తాను సిద్ధమని విద్య శాఖ మంత్రి లోకేష్ మరోసారి సవాల్ విసిరారు. కొవ్వూరులో టిడిపి నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం లో మాట్లాడుతూ డిఎస్సీపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, చర్చ జరిగే ప్రదేశాన్ని జగన్ నిర్ణయిస్తారా? లేక తానే నిర్ణయించాలా? అని ప్రశ్నించారు. డిఎస్సీ, ఎపిపిఎస్సీకి తేడా తెలియకుండా జగన్ విమర్శలు చేస్తున్నారని లోకేష్ మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగలేదని, కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీ ద్వారా 16,000కు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. డిఎస్సీపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు చర్చ ద్వారానే సమాధానం ఇస్తానని పేర్కొన్నారు.

# అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

● దశలవారీగా 60 ఆస్పత్రుల ఉన్నతీకరణ: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



ఆర్యోగ శిబిరం ప్రారంభసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదినం, 25 యేళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా ప్రాథమికంగా రాష్ట్రంలో 2,600 వైద్య శిబిరాలను ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, అవసరమైన వారికి వైద్య సలహా, చికిత్స అందించడం, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించి తదుపరి వైద్యం అందేలా చూడటమే ఈ శిబిరాల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. క్రమంగా ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, చికిత్స అవసరమైన వారిని గుర్తించి నిరంతర వైద్య సంరక్షణ అందేలా చూడటానికి ఈ శిబిరాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. మోడీ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు సేవ చేయడం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలో తొలి వైద్య శిబిరాన్ని గురువారం కృష్ణా జిల్లా గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

**దశలవారీగా 60 ఆసుపత్రుల ఉన్నతీకరణ:** గ్రామస్థాయి నుంచే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద కుటుంబాలకు వైద్య రక్షణ కల్పించడంతో పాటు వృద్ధులకు కూడా ఆరోగ్య భద్రతను విస్తరించారని చెప్పారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, అవసరమైన వారికి చికిత్స అందించడం, తదుపరి వైద్య సేవలను కొనసాగించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. రాష్ట్రంలో 60 ఆసుపత్రుల ఉన్నతీకరణకు ప్రతిపాదనలు అందాయని మంత్రి చెప్పారు. గన్నవరం ఏరియా ఆసుపత్రిలో వచ్చే బడ్జెట్‌లో ట్రామా కేర్, డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కూటమి ప్రభుత్వాల సమన్వయంతో..:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**'స్త్రీ శక్తి పథకంతో ఆస్పత్రుల్లో పెరిగిన ఓపిలు:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కుటుంబాలను బలోపేతం చేయడానికి మార్గమని భావించి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, రుణ సదుపాయాల ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి కనీస మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) ద్వారా మహిళలకు అందుతున్న ప్రయోజనాలతో ఆస్పత్రుల్లో ఓపి కూడా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి ్మ, వైద్య శిబిరాల నిర్వహణ రాష్ట్ర పర్యవేక్షకుడు డాక్టర్ సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

● పది రెట్లు ఎక్కువ పనిచేస్తా

● వైసిపి నేతలపై మంత్రి నారాయణ ఫైర్



**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** నెల్లూరులో ఏ అభివృద్ధి పనిచేసినా ఓర్వలేక వైసిపి నేతలు ఉద్దేశపూర్వకంగా కామెంట్లు చేస్తున్నారని మంత్రి నారాయణ మండిపడ్డారు. గురువారం నెల్లూరులో వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమర్శలు చేయడం కాదు, చేతనైతే అభివృద్ధి చేసి చూపించండి అని సవాల్ విసిరారు. నెల్లూరులో పేద పిల్లల కోసం 17 ప్రభుత్వ పాఠశాలలను ఇంటర్నేషనల్ స్థాయిలో ఆధునీకరిస్తున్నామని, జూన్ 12 నాటికి అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ అందుబాటులోకి వస్తుంద న్నారు. నెల్లూరు నగరంలో విపక్ష వైసిపి నాయకులు తమపై ఎంతగా అనవసర విమర్శలు చేసినా, అభివృద్ధి పనులను అడ్డుకుంటూ తమను డీమోరల్ చేయడానికి ఎంత ప్రయత్నించినా భయపడేది లేదని, వారి విమర్శలకు పది రెట్లు ఎక్కువ పనిచేసి ప్రజలకు మరింత సేవ చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఘాటుగా హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా నగరంలో గతంలో అనుకున్న 15 పాఠశాలలతో పాటు మరో 2 ప్రైమరీ స్కూళ్లను చేర్చి మొత్తం 17 ప్రభుత్వ పాఠశాలలను ఇంటర్నేషనల్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నాయకులు ఇంతియాజ్, మైనుద్దీన్, కాలేష, హాజీ, జమీర్ స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**విఆర్‌సి గ్రౌండ్‌కు మహర్దశ:** నెల్లూరు సిటీ లోని వీఆర్సీ హైస్కూల్ గ్రౌండ్‌ను క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. గురువారం వీఆర్సీ గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మంత్రి మాటామంతి నిర్వహించారు. గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్‌డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని వాకర్స్ మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి నారాయణ అక్కడికక్కడే స్పందించి, అవసరమైన పనులను ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ నందన్‌ను ఆదేశించారు. ఆరు నెలల్లో వాకర్స్ కోరుతున్న సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేసి రాత్రి వేళల్లోనూ క్రీడలు, వాకింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మంత్రికి వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని

● ఆయనతో సాన్నిహిత్యం మరువలేనిది ● ఆళ్ల నానికి మంత్రి లోకేష్ నివాళి



**ఏలూరు, సెప్టెంబరు 17 ప్రభాత వార్త:** తెలుగు నేల ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహాన్ని గురువారం ఏలూరులోని ఆయన నివాసంలో సందర్శించిన లోకేష్ పూలమాల వేసి నివాళి అర్పిం చారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఆళ్ల నాని మృతి తీవ్రంగా బాధించింద న్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో నాని మంత్రిగా ఉన్నారని, సభలో అనేక అంశాలపై ఆయన తో చర్చించేవాడినని గుర్తుచేశారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉంటూ హుందాతనంతో వ్యవహరించేవారని పేర్కొన్నారు. రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన నాని వ్యక్తిగత దూషణలకు ఎప్పుడూ దూరంగా ఉండేవారని లోకేష్ అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వారి సమస్యలపై మాట్లాడేందుకు, సేవ చేసేందుకు ఉపయోగించాలనే భావనతో ఆయన పనిచేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా నాని చేసిన సేవలు చిరస్మరణీయంవన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్యశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసు కోవాల్సిన అవసరంఉందన్నారు.

**లక్ష్మణ రేఖ దాటని వ్యక్తి:** టిడిపిలో నాని చేరిన సమయంలో ఆయనతో చెప్పిన విషయాలను లోకేష్ గుర్తుచేశారు. ఐదేళ్లుగా దగ్గరుండి చూసిన వ్యక్తిగా, నాని ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటే వ్యక్తి కాదని చెప్పా నన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నాని రాజకీయాల్లో నడుచుకున్న తీరు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. అలాంటి మంచి వ్యక్తి తమ మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, ఎంపి పుట్టా మహేష్ కుమార్, శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, నాని కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ రాజీనామా



**స్టాక్‌హోమ్, సెప్టెంబరు 17:** స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్సన్ తన పదవికి రాజీనామా చేశారు. దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని రైట్‌వింగ్ కూటమి. మధ్యేవామపక్ష ప్రతిపక్ష కూటమిపై స్వల్ప తేడాతో ఓటమి పాలైన నేపథ్యంలో రాజీనామా చేసారు. గురువారం మధ్యాహ్నం ఎక్స్‌లో పోస్టు ద్వారా క్రిస్టెర్సన్ స్వయంగా తన రాజీ నామా విషయాన్ని ప్రక టించారు. ఆదివారం జరిగిన ఎన్నికల ప్రాథ మిక ఫలితాల్లో రెండు రాజకీయ కూటముల మధ్య తేడా సుమారు 50 వేల ఓట్లుగా ఉంది. దాదాపు కోటి జనాభా ఉన్న స్వీడన్‌లో ఇది అత్యంత స్వల్ప తేడాగా నిలిచింది. స్వీడన్ ఎన్నికల అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం సోషల్ డెమోక్రాట్ల నేత మాగ్దలీనా ఆండర్సన్ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమికి 349 స్థానాలున్న రిక్స్‌డాగ్‌లో సుమారు 176 సీట్లు లభించే అవకాశం ఉంది. క్రిస్టెర్సన్ నేతృత్వంలోని రైట్‌వింగ్‌కూటమి 173 స్థానాలతో వెనుకబడింది. ఈ ఫలితాలకు ఇంకా అధికారిక ధ్రువీకరణ జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈ వారాంతంలో పూర్తవుతుంది. కన్జర్వేటివ్ నేత అయిన ఉల్ఫ్ క్రిస్టెర్సన్ స్వీడన్ డెమోక్రాట్ల మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపారు. వలసలకు వ్యతిరేక వైఖరికి పేరుగాంచిన ఈ రైట్‌వింగ్ పార్టీకితన కూటమి తిరిగి అధికారంలోకి వస్తే కేబినెట్‌లో పదవులు ఇస్తామని క్రిస్టెర్సన్ హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎన్నికల ఫలితాలతో ఆ ప్రణాళిక ముందుకు సాగలేదు. స్వీడన్ రాజకీయ వ్యవస్థలో సాధారణంగా రెండు ప్రధాన కూటములు ఉంటాయి. ఒక్కో కూటమిలో నాలుగు పార్టీలు ఉంటాయి. దీంతో కూటమి ప్రభుత్వాలు, మైనారిటీ ప్రభుత్వాలు స్వీడన్ రాజకీయాల్లో సాధారణంగా మారాయి. క్రిస్టెర్సన్ రాజీనామాతో స్వీడన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది. దేశ వ్యవస్థ ప్రకారం ప్రధాని రాజీనామా చేసిన తర్వాత రిక్స్‌డాగ్ స్పీకర్ తదుపరి దశను పర్యవేక్షిస్తారు. అన్ని పార్టీలతో చర్చలు జరిపిన అనంతరం కొత్త ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రతిపాదిస్తారు. ఆ అభ్యర్థిపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరుగుతుంది. తన రాజీనామా ప్రకటనలో ఈ ప్రక్రియను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని క్రిస్టెర్సన్ స్పష్టం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే బిజెపి ఆశయం

## తిమ్మాపూర్‌లో గ్రామస్థులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖాముఖి



గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖిగా మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**కందుకూరు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశాభివృద్ధితోపాటు ప్రజా సంక్షే మానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు ఆర్థి కంగా స్వావలంబన సాధించినప్పుడే దేశం సమ గ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుక లను పురస్కరిం చుకుని గురువారం రంగారెడ్డి జిల్లా కందు కూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖాముఖి నిర్వహిం చారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. రైతులు, మహిళలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అనుభవాలను కేంద్ర మంత్రి తెలుసుకున్నారు.

శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లా డుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, మహిళల ఆర్థిక సాధికారతకు అనేక కార్యక్ర మాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేత మవుతుందని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లా డుతూ ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశంలో అనేక రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. రైతులు, మహిళలు, యువత ఆర్థి కంగా అభివృద్ధి చెందితే దేశం మరింత పురోగతి సాధిస్తుందని పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించి, అర్హులైన వారికి అవి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బిజెపి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

18-9pg4:18-9pg4.qxd 9/17/2026 10:59 PM Page 1



వార్త

తమ గుర్రాలు, కుక్కల సంతతిని గురించి అతి జాగ్రత్త వహించే మానవులు తమ సంతతిపై అంతగా శ్రద్ధ వహించరు.

న- విలియం పెన్

# ప్రకృతితో చెలగాటాలొద్దు!

ప్రపంచవ్యాప్తంగా మానవతప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. మొన్న నేపాల్ అతలాకుతలం చేసిన వరద భీభత్సం నుండి ఆ దేశం ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కన్పించడం లేదు. నేటికీ ఎంత మంది అసువులు బాశారో, గల్లంతైనవారి పరిస్థితి ఏమిటో అర్థంకాదు. ఇక ఆస్తి నష్టం గూర్చి పూర్తి అంచనాలు అందలేదనే చెప్పొచ్చు. ఈ బీభత్సానికి కారణం మానవుని విధ్వంస చర్య లేననేది పర్యావరణ శాస్త్రవేత్తలే స్పష్టం చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఎంతో కాలంగా పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులను, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతలో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. విశ్వవ్యాప్తంగా పెను విధ్వంసాలు విరుచుకుపడుతున్నాయి. గత అర్థశతాబ్దంలో సంభవించిన దాదాపు పన్నెండువేలకుపైగా భారీ ఉత్పాతాల్లో దాదాపు ఇరవైఐదు లక్షల మందికిపైగా అసువులు బాసినట్లు అంచనా. అందులో అధికశాతం అభివృద్ధి చెందిన దేశాల్లోనే చోటు చేసుకుంటున్నాయనేది గమనించదగినది. మొన్నటి నేపాల్ వరదల విలయం నుంచి తేరుకోవాలంటే తమకు కనీసం ఐదువందల కోట్ల డాలర్లకుపైగా అవసరం అవుతాయని ఆదేశ ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో ఏడెనిమిదేళ్లలో ఇండియా జనాభా నూటయాభై కోట్ల సమీపానికి చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని, ముఖ్యంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో దాదాపు ప్రతిరోజూ మూడువందల యాభై ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడయింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయల ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రశాంతంగా ఉన్న హిమాలయ మంచుకొండల్లో కూడా ఈ ప్లాస్టిక్ భూతం విస్తరిస్తున్నది. పర్యాటకులు పెరిగే కొద్దీ ఈ ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులు నిషేధించినా ఆ చట్టం తేవడం కాగితాలకే పరిమితమవుతున్నది. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ఎంత నష్టం కలుగుతున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. ఇక పెట్రోలు, డీజిల్ ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. కల్తీ కూడా కాలుష్యాన్ని విపరీతంగా పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు తదితర అన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని మరింతగా పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరిగి తీరప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచో పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. అంతేకాదు వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలతోపాటు ఎల్‌నినో లాంటివి కూడా మానవ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం విస్తరిస్తున్న సూపర్ ఎల్‌నినోతో వ్యవసాయరంగం కుదేలైపోతున్నది. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఉపద్రవాల్లో వేలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటే లక్షలాది మంది రోగపీడితులుఅవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, న్యూజిలాండ్, నేపాల్ జపాన్, లాంటి ఎన్నో దేశాలు తరచూ భూకంపాలను ఎదుర్కొంటున్నాయి. ఆ మధ్య సిరియాలో వచ్చిన భూకంపంతో తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాశారు. పశ్చిమ ఆఫ్ఘనిస్థాన్‌లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఆయా దేశాల్లోని బాధితులు కోలుకోలేకపోతున్నారు. మనదేశానికి సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూప్రకంపనాలు కన్పిస్తూనే ఉన్నాయి. పాలకులు తీసుకుంటున్న ముందుజాగ్రత్తల వల్ల కొంతమేరకు ప్రాణ, ఆస్తుల నష్టాన్ని నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్న కారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విజృంభణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. ఏది ఏమైనా ఈ ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు.

మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.



అంబేద్కర్

మనిషి మనసులో ఉత్సాహం అణగారితే, ప్రపంచంలో దాన్ని మించిన పేదరికం లేదు.



హెచ్.డబ్ల్యు ఆర్నాల్డ్

# చిన్నారుల భద్రతపై రాజీకి తావులేదు

**భవిష్యత్తులో ఎఐ మరింత శక్తివంతమవుతుంది. వర్చువల్ ప్రపంచాలు, మెటావర్స్, జనరేటివ్ ఎఐ కొత్తతరహా సోషల్ ప్లాట్‌ఫామ్‌లు మరింత విస్తరిస్తాయి. వాటితోపాటు కొత్తరకాల నేరాలు కూడా పుట్టుకొచ్చే అవకాశం ఉంది. కాబట్టి నేటి సమస్యకు మాత్రమే పరిష్కారం వెతకడం సరిపోదు. రేపటి డిజిటల్ ప్రమాదాలను ముందుగానే అంచనా వేసే విధానాలు అవసరం. సోషల్ మీడియా సంస్థలు సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. దర్యాప్తుసంస్థలు వేగంగా స్పందించాలి. తల్లిదండ్రులు,విద్యా సంస్థలు పిల్లలకు డిజిటల్ అవగాహన కల్పించాలి. సమాజం నేరస్థులను ప్రోత్సహించే లేదా బాధితులను నిందించే ధోరణిని విడిచిపెట్టాలి. చిన్నారిచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ కేవలం వినోద సాధనంకాదు. అది ప్రపంచానికి ఒక ద్వారం. ఆ ద్వారం వెనుకవిద్య, అవకాశాలు ఉన్నట్లే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఆ ద్వారం గుండా ప్రమాదం చిన్నారి జీవితంలోకి చొరబడకుండా చూడటం మనందరి బాధ్యత.**

నండూరి రవిశంకర్

సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలను సులభతరం చేసింది. ప్రపంచాన్ని మన చేతిలోకి తెచ్చింది. సమాచారం, విద్య, వినోదం, ఉపాధి, సామాజిక సంబంధాలు ఇలా మనిషి జీవితంలోని దాదాపు ప్రతి అంశాన్నీ డిజిటల్ వేదికలు ప్రభావితం చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతిక విప్లవానికి మరో చీకటికోణం కూడా ఉంది. ముఖ్యంగా చిన్నారులు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వారి భద్రత తీవ్రమైన సవాలుగా మారుతోంది. పిల్లలను లక్ష్యంగా చేసుకుని రూపొందించే లైంగిక వేధింపుల కంటెంట్, వారి చిత్రాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, ఆన్‌లైన్ గ్రూమింగ్, డీప్‌ఫేక్‌ల ద్వారా వేధింపులు ఇవన్నీ సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన డిజిటల్ నేరాల్లో భాగంగా మారాయి. ఈ నేపథ్యంలో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌పై నేరుగా భారత దర్యాప్తు సంస్థలకు నివేదికలు అందించేందుకు మెటా అంగీ కరించిందన్న తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగించే వేదికలకు మాతృసంస్థ అయిన మెటా తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఒక సంస్థకు సంబంధించిన పరిపాలనా నిర్ణయంగా చూడలేం. డిజిటల్ ప్రపంచంలో పిల్లల హక్కులు, వారి గోప్యత, భద్రత, గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైన బాధ్యతపై జరుగుతున్న పెద్ద చర్చలో ఇది ఒక ముఖ్యమైన మలుపు. ఇప్పటివరకు చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌పై మెటా అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్‌కు సమాచారం అందించేది.అక్కడి నుంచి ప్రపంచంలోని వివిధ దర్యాప్తు సంస్థలకు సమాచారం చేరేది. ఈ విధానంలో భారత్‌కు కూడా వివరాలు అందేవి. ఇకపై భారత దర్యాప్తు సంస్థలకు మెటానే నేరుగా సమాచారం అందించేందుకు సిద్ధపడటం దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా డిజిటల్ నేరాల్లో సమయం అత్యంత కీలకం. ఒక నేరానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు తొలగిపోవడానికి, మార్పులకు గురికావడానికి లేదా ఇతర ఖాతాలకు బదిలీ కావడానికి ఎక్కువ సమయం పట్టదు. కాబట్టి సంబంధిత సమాచారాన్ని వేగంగా దర్యాప్తు సంస్థలకు అందించడం నేర నిరోధక చర్యల్లో కీలకమైన అంశం. అయితే, ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. మెటా నేరుగా సమాచారం అందించేందుకు అంగీ కరించడం సరిపోతుందా? ఖచ్చితంగా కాదు. ఇది స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం చేయాల్సిన పని ఇంకా ఎంతో ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఒకసారి హానికరమైన కంటెంట్‌కి అవకాశం లభిస్తే దాని వ్యాప్తిని ఆపడం అంత సులభం కాదు. ఒక ఖాతా నుంచి తొలగించిన కంటెంట్ మరో ఖాతాలోకి, అక్కడి నుంచి మరో ప్లాట్‌ఫామ్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ సాంకేతికతలు అందు బాటులోకి వచ్చిన తరువాత ఈ సమస్య మరింత సంక్లిష్ట మైంది. నిజమైన ఫొటోలు, వీడియోలను మార్చడం మాత్రమే కాదు అసలు లేని దృశ్యాలను కూడా అత్యంత వాస్తవికంగా సృష్టించే స్థాయికి సాంకేతికత చేరింది. ఈ పరిణామం చిన్నారుల విషయంలో మరింత తీవ్రమైన ప్రమాదాన్ని సృష్టిస్తోంది. ఒక పిల్లవాడి లేదా పిల్లవాడి కుటుంబ సభ్యుడి ఫొటోను తీసుకుని దాన్ని దుర్వినియోగం చేయడం నిమిషాల్లో జరిగిపోవచ్చు. బాధిత కుటుంబానికి అది కలిగించే మానసిక వేదన మాత్రం సంవత్సరాల పాటు కొనసాగవచ్చు. అందుకే ఈ సమస్యను కేవలం కంటెంట్ మోడ



రేషన్ సమస్యగా చూడటం సరైంది కాదు. ఇది పిల్లల హక్కులు, మానసిక ఆరోగ్యం, గోప్యత, వ్యక్తిగత గౌరవం, న్యాయ పరిరక్షణకు సంబంధించిన అంశం. ఇక్కడ ప్రభుత్వ బాధ్యత కూడా అత్యంత కీలకం.సామాజిక మాధ్యమ సంస్థలను బాధ్యత వహించేలా చేయడం మాత్రమే కాకుండా, భారత చట్టాలకు అనుగుణంగా స్పష్టమైన విధానాలు, వేగవంతమైన రిపోర్టింగ్ వ్యవస్థలు, సమర్థవంతమైన దర్యాప్తు యంత్రాంగం, శిక్షణ పొందిన సైబర్ నేరవిభాగాలను బలోపేతం చేయాలి. ఒక పిల్లవాడికి సంబంధించిన అభ్యంతరకరమైన కంటెంట్ బయటపడినప్పుడు ఫిర్యాదు ఎక్కడ చేయాలి? దాన్ని ఎంత సమయంలో తొలగించాలి? దర్యాప్తు సంస్థలకు సమాచారం ఎప్పుడు అందాలి? బాధితుడి గుర్తింపు ఎలా రక్షించాలి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన, వేగ వంతమైన వ్యవస్థ ఉండాలి. అదే సమయంలో, సోషల్ మీడియా సంస్థలు కూడా చట్టం అడిగినప్పుడు స్పందిస్తాం అనే కనీస బాధ్యతతో సరిపెట్టుకోకూడదు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా నిరోధించ డం ముఖ్యం. అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించే అల్గా రిథమ్స్,పిల్లల ఖాతాలకు అదనపు భద్రతా చర్యలు, వయ సు నిర్ధారణ వ్యవస్థలు, ప్రమాదకరమైన పరిచయాలను గుర్తించే సాంకేతికత, వేగవంతమైన మానవ పర్యవేక్షణ వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన సమతుల్యతను మర్చిపోకూడదు. పిల్లల భద్రత పేరుతో ప్రతి ఒక్కరి వ్యక్తిగత గోప్యతను దెబ్బతీయకూడదు. వినియోగదారుల డేటాను నిర్బంధంగా సేకరించడం, అనవసరమైన పర్యవేక్షణ, పారదర్శకత లేని అల్గారిథమిక్ నిర్ణయాలు కూడా ప్రమాదకరమే. కాబట్టి భద్రతతో పాటు గోప్యత, పారదర్శకత, చట్టబద్ధత కూడా సమానంగా పరిరక్షించాలి. చిన్నారుల రక్షణ కోసం తీసుకునే చర్యలు స్పష్ట మైన న్యాయపరమైన చట్రంలోనే ఉండాలి. మరోవైపు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు,పాఠశాలలు కూడా తమ బాధ్య తను గుర్తించాలి. పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వడం లేదా సోషల్ మీడియా ఖాతా తెరవడం మాత్రమే కాకుండా డిజి టల్ ప్రపంచంలో ఎలా ప్రవర్తించాలి, ఎవరితో మాట్లాడాలి, ఏ సమాచారాన్ని పంచుకోకూడదు, అనుమానాస్పదమైన మెసేజ్ వచ్చినప్పుడు ఏంచేయాలి వంటివిషయాలను నేర్పిం చాలి. పిల్లలు భయపడకుండా తల్లిదండ్రులతో మాట్లాడగల వాతావరణం ఏర్పడటం చాలా ముఖ్యం. ఏదైనా వేధింపు ఎదురైనప్పుడు నువ్వే తప్పు చేశావు అనే భావన కలిగిస్తే పిల్లలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం ఉంది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను చూడటం, డౌన్‌లోడ్ చేయడం, ఫార్వర్డ్ చేయడం, నిల్వ చేయడం లేదా ఇతరులకు పంపడం సరదాగాభావించే సంస్కృతికి పూర్తిగా ముగింపు పలకాలి. ఇలాంటి కంటెంట్ ఎదురైతే దాన్ని మరింత వ్యాప్తి చేయకుండా సంబంధిత వేదికలో రిపోర్ట్ చేయడం, చట్టబద్ధమైన మార్గాల్లో అధికా రులకు సమాచారం ఇవ్వడం బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యం. మెటా తాజా నిర్ణయం ఈ దిశగా ఒక సానుకూలసంకేతం. అయితే దీనిని విజయంగా ప్రకటించి ఆగిపోతే ప్రయోజనం ఉండదు. ఇది ఒక ప్రారంభం మాత్రమే. కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్లుగా పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత సోషల్ మీడియా సంస్థలపై ఉంది. ఆ బాధ్యతను గుర్తుచేసేందుకు కఠినమైన నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ, పారదర్శకమైనరిపోర్టింగ్ వ్యవస్థలు అవసరం. భవిష్యత్తులో ఎఐ మరింత శక్తివంత మవుతుంది. వర్చువల్ ప్రపంచాలు, మెటావర్స్, జనరేటివ్ ఎఐ కొత్తతరహా సోషల్ ప్లాట్‌ఫామ్‌లు మరింతవిస్తరిస్తాయి. వాటితోపాటు కొత్తరకాల నేరాలు కూడా పుట్టుకొచ్చేఅవకాశం ఉంది. కాబట్టి నేటి సమస్యకు మాత్రమే పరిష్కారం వెతక డం సరిపోదు. రేపటి డిజిటల్ ప్రమాదాలను ముందుగానే అంచనా వేసేవిధానాలు అవసరం. సోషల్ మీడియా సంస్థ లు సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. దర్యాప్తుసంస్థలు వేగంగా స్పందించాలి. తల్లిదండ్రులు,విద్యా సంస్థలు పిల్లలకు డిజిటల్ అవగాహన కల్పించాలి.సమాజం నేరస్థులను ప్రోత్సహించే లేదా బాధితులను నిందించే ధోరణిని విడిచిపెట్టాలి. చిన్నారిచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ కేవలం

# రోబోల యుగంలో సృజనాత్మకతకు ప్రాధాన్యత

సి.హెచ్.ప్రతాప్

తమ పిల్లలు చదువులో రాణించాలని కోరుకోని తల్లి దండ్రులు ఉండరు. మంచి మార్కులు, మంచిర్యాంకు, మంచి కళాశాలఇవే విజయానికి మెట్లని భావించడం సహజం. కానీ కాలం మారుతోంది. నేటి ప్రపంచంలో విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించేది కేవలం పరీక్షల్లో సాధించిన మార్కులు కాదు.కొత్తగా ఆలోచించే సామర్థ్యం, సమస్యను విశ్లేషించే నైపుణ్యం, పరిష్కారాలను అన్వేషించే ధోరణి, బృందంగా పనిచేయగలగడం, నాయకత్వం,సమయ నిర్వహణ, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలకు కూడా సమాన ప్రాధాన్యం పెరుగుతోంది. ఇక్కడ మార్కులు అవసరం లేదు అనేది ఉద్దేశం కాదు. మార్కులు విద్యార్థి నేర్చుకున్న విషయాన్ని అంచనా వేయడానికి ఒక ప్రమాణంమాత్రమే. కానీ అవే విద్యార్థి మేధస్సుకు, ప్రతిభకు, భవిష్యత్తుకు తుది కొలమానంగా మారకూడదు. పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి ఒక కొత్త సమస్యకు పరిష్కారం ఆలోచించలేకపోతే, అతని విద్య అసంపూర్ణంగానే ఉంటుంది. అదే సమయంలో కొంత తక్కువ మార్కులు సాధించినా, ప్రశ్నించగలిగే, ప్రయోగించగలిగే, కొత్త ఆలోచనలను సృష్టించగలిగే విద్యార్థి భవిష్యత్తులో ఎంతో దూరం వెళ్లగలడు. అందుకే మార్కుల ఆధారిత విజయ భావన నుంచి సృజనాత్మకత ఆధారిత అభ్యాసం వైపు విద్యను మళ్లించాల్సిన సమయం వచ్చింది. సృజనాత్మకత అంటే కేవలం చిత్రాలు గీయడం, కథలు రాయడం, సంగీతం నేర్చుకోవడం కాదు. ఒక విషయాన్ని అనేక కోణాల్లో చూడటం, సాధారణ విషయంపై అసాధారణ ప్రశ్న అడగటం, ఒక సమస్యకు ఒకటి కంటే ఎక్కువ పరిష్కారాలను వెతకటం,తప్పు జరిగినప్పుడు కారణాన్ని తెలుసుకుని మళ్లీ ప్రయత్నించడం సృజనాత్మక ఆలోచన. ఇందులో ఊహాశక్తితో పాటు పరిశీలన,ఆసక్తి,విమర్శనాత్మక ఆలోచన,ప్రయోగించే ధైర్యం ఉంటాయి. సృజనాత్మకత వల్ల విద్యార్థిలో కేవలం కొత్త ఆలోచనలు మాత్రమే పుట్టవు. వైఫల్యాన్ని ఎదుర్కొనే పట్టుదల పెరుగుతుంది.భవిష్యత్తులో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తనను తానుమార్చుకునే సామర్థ్యం కూడాబలపడుతుంది. ఈ అవసరాన్ని జాతీయ విద్యావిధానం 2020కూడా స్పష్టంగా గుర్తించింది. కేవలం కంఠస్థ విద్యకు బదులుగా భావనాత్మక అవగాహన, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, అనుభవాత్మక అభ్యాసం, బహుళశాఖల విద్యకుప్రాధాన్యం ఇవ్వాలని విధానం సూచించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ప్రయోగా త్మక అభ్యాసం, కళల సమన్వయం, క్రీడల సమన్వయం, కథా ఆధారిత బోధన వంటి పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర మాధ్యమిక విద్యామండలి కూడాసృజనాత్మకత, స్వయంచింతన, విమర్శనాత్మక ఆలోచనను పెంచే అనుభవాత్మక అభ్యాసాన్ని అమలు చేస్తోంది. చాలా పాఠశాలల్లో ఇప్పటికీ విద్యార్థి ప్రతిభకు ప్రధాన కొలమానం మార్కులే. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే ఒత్తిడితో పిల్లలు పాఠ్యాంశాన్ని అర్థంచేసుకోవడం కంటే కంఠస్థం చేయడం, అడిగిన ప్రశ్నకు సిద్ధంగా ఉన్న సమాధానాన్ని తిరిగిరాయడం వైపు మళ్లుతున్నారు. ఈ కంఠస్థ విద్యా విధానం తాత్కాలికంగా పరీక్షా ఫలితాలను మెరుగుపరచవచ్చు కానీ ప్రశ్నించేస్వభావం, స్వతంత్ర ఆలోచన,సమస్యను అనేక కోణాల్లో చూసే సామర్థ్య క్రమంగా తగ్గేప్రమాదం ఉంది. నిరంతర పరీక్షల ఒత్తిడి పిల్లల్లో ఆందోళనను పెంచడమే కాకుండా, తప్పు చేయడానికి, కొత్తగా ప్రయత్నించడానికి కూడా భయపడే పరిస్థితిని సృష్టిస్తుంది. దీనికి భిన్నంగా అనేక అభివృద్ధి చెందిన విద్యా వ్యవస్థలు విద్యార్థులకు తమ ఆలోచనలను వ్యక్తం చేసే అవకాశం,ఒక సమస్యకు అనేక పరిష్కారాలను అన్వేషించే అవకాశం, ప్రాజెక్టులు, పరిశోధన, బృందపని, అనుభవాత్మక అభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.మార్కులను తగ్గించడం కాదు మార్కులకు ఉన్న ఏకైక ఆధిపత్యాన్ని తగ్గించాలి.రేపటి ప్రపంచాన్నియంత్రాలుఎంత మార్చినా, దానికి కొత్తదిశ చూపించేది మనిషి ఆలోచనే.ఆ ఆలోచనకు విత్తనం పడేది పాఠశాల తరగతి గదిలోనే. ●

# ప్రజావాక్కు

## రోడ్ల విస్తరణ జరపాలి

ఇఇ కరకట్ట రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడ ఉన్న ఆశ్రమాన్ని తొలగించాలి.అడ్డుగా ఉన్నఅన్ని ఆశ్రమాలను, గుళ్లను కూడా తొలగించాలి.రోడ్ల విస్తీర్ణం చేస్తేనే నగరం అందంగా ఉంటుంది.అమరావతిలోని రోడ్ల విస్తీర్ణం చేస్తున్న సందర్భంగా కరకట్టను కూడా వెడల్పు చెయ్యాలని సంబంధిత అధికారులు నిర్ణయించడం అభినందనీయం. ఇక్కడ రికమండేషన్లు, మొహమాటాలు లేకుండా అడ్డమొచ్చిన అన్ని నిర్మాణాలను కూల్చి వెయ్యాలి.గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసిన మొదట్లోనే, వేదికను కూల్చివేశారు.అప్పుడే కరకట్టమీద ఉన్నఆశ్రమాన్ని, ఇస్కాన్ కేంద్రాన్ని, గణపతి ఆశ్రమాన్ని, ఇంకొక స్వామి ఆశ్రమాన్ని కూల్చి వెయ్యకుండా, వేదికను కూల్చిన జేసీబీలు వెనక్కు వెళ్ళాయి. సుప్రీం కోర్టు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాలను రోడ్లకుఅడ్డంగా ఉన్న మందిరాలను, చెరువు కట్టలమీద ఉన్న మందిరాలను,పబ్లిక్ పార్కులలో ఉన్న మందిరాలను కూల్చి వెయ్యాలని హెచ్చరించింది.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడు ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది.ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు,ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్స హించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## నోటీసులకు వేగంగా స్పందించాలి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తగిన గుర్తింపు పత్రాలతో వేగంగా స్పందించి ఓటు హక్కు కాపాడుకోవాలి. ఓటర్లు నోటీసులకు సంబంధించిన పత్రాలు బీఎల్వోలు దాదాపు నాలుగైదు రకాల పత్రాలు అడుగుతున్నారు. ఏ పత్రం ఐతే అవసరమో ఆ పత్రాన్ని వివరాలు తీసుకుని వెంబడే ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## అందరూ సమానమే

గణపతి మండపాలలో ఒకరిని ఎక్కువగాను, ఒకరిని తక్కువగాను చూడటం మంచిదికాదు. ఆ వ్యత్యాసాలు దేవుడ్ని ప్రతిష్ఠించిన పవిత్ర మండపాలలో అసలు చేయకూడదు.అక్కడ అందరూ సమానమే! బంధు ప్రీతి, ప్రాంతం, కులమతాలు అక్కడ చూపకూడదు. వినాయకుని మండపాల దగ్గర ఎదుటివారిని చిన్నచూపు చూస్తే వాళ్ళ మనోభావాలు దెబ్బ తింటాయి. ఇలాచేయడం వల్ల కొన్నిచోట్ల ఘర్షణ జరగడానికి అవకాశం ఇచ్చిన వారమవుతాం. గణేష్ మండపాలలో అతిగా ప్రవర్తిస్తూ, ఏ ఎండకా గొడుగు పట్టేవారిని,నీతి,నిజాయితీ తప్పే వారిని వినాయకుడు గమనిస్తూ ఉంటాడని మాత్రం మరచిపోవద్దు. విఘ్నేశ్వరుడు మనకే కాదు, అందరికీ పూజ్యుడు . ఆయనను పూజించి నిశ్చలహృదయంతో ధ్యానిస్తే, మంచి బుద్ధి కలుగుతుంది. కార్య సిద్ధి సిద్ధిస్తుంది. లేకపోతే ఆకార్యం నిర్విఘ్నంగా కొనసాగదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## సబ్జెక్టు అటెండెన్స్ ఉండాలి

విద్యార్థులు కొన్ని సబ్జెక్టులలో హాజరు కావడం లేదు. నోట్స్ రాసుకోవడం లేదు. వాటర్, భోజన విరామ సమయం పేరుతో బయట తిరుగుతున్నారు. స్మోకింగ్, గంజాయి, మత్తు పదార్థాలను సేవించడం వంటివి చేస్తున్నారు.అలాంటివారు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా పేరెంట్స్ విద్యార్థులు ప్రతి తరగతిలో ప్రతి సబ్జెక్టు వినే విధంగా ప్రణాళిక రూపొందించాలి. కొన్ని సబ్జెక్టులకు మాత్రమే హాజరు అయ్యి మిగతా సబ్జెక్టులను వారికి వారుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టుకు హాజరు కావడం విద్యార్థుల డ్యూటీ. హాజరు కాకా పోవడానికి విద్యార్థులే బాధ్యులు. ఫెయిల్ అయినా కూడా లెక్చరర్స్, టీచర్స్‌లను తప్పు పట్టకూడదు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## అన్నదాతకు భరోసా కల్పించాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలు వర్ణనాతీతం. అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి,అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికి ఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈ యేడాది వర్షాభావంవల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ.దేశానికి వెన్నెముఖ శ్రామికుడు కళ్లలో మెరుపులు చూసినప్పుడే ప్రజలు సుభిక్షం. ప్రభుత్వాలు అన్నదాత పట్ల చొరవ చూపాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చేనేత కులాలు ఏకమవుతున్న వేళ

శిరందాసు నాగార్జున

చేనేత వర్గాల వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్న దృఢసంకల్పంతో చేనేత కులాల వారు అందరూ ఏకమవుతున్నారు. చేనేత వర్గంవారు విద్య, వ్యాపారపరంగా ఎదుగుతూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నప్పటికీ, రాజకీయంగా తగిన ప్రాధాన్యత లేదన్న భావన వారిలో నెలకొంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది చేనేత, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంతేకాకుండా, ఈ రెండురాష్ట్రాలకు చెందిన చేనేత కులాల వారు విద్య, వైద్యం, వ్యాపార రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్నారు. మన దేశంలో తరతరాలుగా చేనేత వృత్తిపైనే జీవించే కులాలు అనేకం ఉన్నాయి. అనేక చేనేత కులాల వారు ఉన్నారు. ఇందులో దాదాపు18 చేనేత కులాల వారు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నారు.ఇందులో కొన్ని కులాలు జాతీయస్థాయిలో అంత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) జాబితాలో ఉన్నాయి. చేనేత కులాల వారు అన్ని రంగాలలో పరస్పరం సహకరించుకుంటూ, రాజకీయంగా కూడా ఎదగడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే, ఈ కులాల మధ్య ఐక్యత కోసం వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, అఖిల భారత పద్మశాలి సంఘం, ఇతర చేనేత కుల సంఘాల వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. చేనేత కులాల వారు రాజకీయంగా బలపడటంతోపాటు, చట్టసభల్లో తమ వాటా స్థానాలకోసం ప్రయత్నించాలని నిర్ణయించుకున్నారు. చేనేత ఉత్పత్తులు, ఆప్కోప్రక్షాళన, చేనేత సహకార సంఘాల సమస్యలపై ఒవైపు చేనేత కార్మిక సంఘాలవారు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, చేనేత ఉద్యమ శంఖారావం పూరించారు. ఒకే మగ్గంఒకే గమ్యం, చేనేత వర్గాలను ఏకం చేద్దాం అన్న పిలుపుతో న్యూజెర్సీలో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ యూఎస్‌ఏ ప్రాంతీయ సదస్సును నిర్వహించింది. కులం, ప్రాంతం, భాషలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చేనేత కుటుంబాలను అంతర్జాతీయ వేదికపై ఏకం చేయాలన్నది ఈ సదస్సు లక్ష్యం. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మంది జీవిం చే చేనేత కులాల నుంచి ఏపీ శాసనసభలో ఒక్కరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత శాసనసభలో ఆ ఒక్కరు కూడాలేరు. అత్యంత దయనీయమైన పరిస్థితి ఏమి టంటే, రెండ తెలుగు రాష్ట్రాలలో చేనేత శాఖలకు మంత్రు లుగా చేనేత రంగానికి చెందని ఇతర కులాల వారు ఉన్నా రు. చేనేత కులాల మధ్య ఐక్యత లేకపోవడం, నాయకత్వం లోపమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు పదిశాతం చేనేత కులాల జనా భా ఉన్నట్లు ఓ అంచనా.ఆ ప్రాతిపదికన జనాభా దామాషా



ప్రకారం ఎన్నికలలో రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలన్నది చేనేత వర్గాల డిమాండ్. రాజకీయ పార్టీలు తమను గుర్తించేవిధంగా ఐక్యత చాటే ప్రయత్నంలో చేనేత కులాల వారు ఏకం కానున్నారు.ఏపీలో 175 మంది శాసనసభ్యుల్లో చేనేతకులాల నుంచి ఒక్కరంటే ఒక్కరే ఉన్నారు.శాసన మండలిలో ఒకరు ఉన్నారు. అయినా, వారికి ఆశాఖమంత్రి పదవి కూడా ఇవ్వలేదు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి చేనేత కులాల వారు ఒక్కరు కూడా లేరు. టీఆర్‌ఎస్ నుంచి శాసనసభలోఇద్దరు మాత్రమే ఉన్నారు. అందువల్ల, తెలంగాణలో అత్యధికంగా ఉన్న చేనేత కులం పద్మశాలీయుల్లో ఒకరిని శాసన మండలికి తీసుకుని,మంత్రి పదవి ఇవ్వవలసిన అవసరం ఉంది. దీర్ఘకాలంగా చేనేత కులాలకు చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల వారి సమస్యలను ఇతర కులాలు, వృత్తులకు చెందిన మంత్రులకు చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వారికి ఈ రంగం పట్ల తగినంత అవగాహన లేకపోవడ వల్ల వీరి సమస్యల పరిష్కారం పట్లవారు ఆసక్తి చూపించే అవకాశాలు తక్కువ. చేనేత వృత్తికి సంబంధించిన నూలు, సిల్క్, రంగులు, రసాయనాలు ముడిసరుకులు వంటి వాటిధరలు, చేనేత ఉత్పత్తులు, అమ్మకాలు,ఎగుమతులు,పన్నులు, సబ్సిడీలు, ఇతర సౌకర్యాలు వంటి సమస్యలు సమగ్రంగా తెలుసుకోవడానికి వారికి సమయం ఉండదు. ఈ కారణంగా కూడా చేనేత సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం దిశగా కూడా అడుగులు పడటం లేదు. అవగాహనా లోపం వల్ల నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు అందడంలేదు.ప్రభుత్వానికి, మంత్రులకు,అధికారులకు చేనేత కార్మికుని బతుకు చిత్రంపై అవగాహన లేకపోవడం వల్లఇలా జరుగుతోంది. రాష్ట్రంలోని చేనేత కార్మికుల స్థితిగతులను, వృత్తిపరంగా వారు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి అర్థమయ్యేరీతిలో వివరించవలసి ఉంది. అందుకు చేనేత వర్గాలనుంచి, చేనేత రంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులు రాజకీయ నేతలుగా ఎదగవలసిన అవసరం ఉంది. చేనేత కులాల నుంచికొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రగడ కోటయ్యవంటి నేతలు లేకపోవడం వల్ల ఈ రంగం నుంచి రాజకీయంగా నాయకత్వం లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. వారు చేనేత కార్మికులకు సన్నిహితంగా ఉండేవారు. వారికి చేనేత సమస్యలపై పూర్తి అవగాహన ఉండేది. జాతీయ స్థాయిలో చేనేత గళం విని పించగల దమ్ముండేది. అందువల్ల వారి హయాంలో ఈ రంగానికి ఎంతో మేలు జరిగింది. ఆ తరువాత ఈ కులాల విద్యా, వ్యాపార,పారిశ్రామిక పరంగా ఎదిగినా,రాజకీయం గా బలహీనమవడం వల్ల చేనేత రంగానికి తీవ్ర నష్టం జరుగుతూ వస్తోంది. నేరుగా చేనేత రంగంతో సంబంధం ఉన్న, చేనేత వృత్తి, ఆ రంగంలోని సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నవారు శాసనసభలో, మంత్రి మండలిలో ఉండవలసిన అవసరం ఉంది. ఆ దిశగా, రాజకీయం లక్ష్యంతో ఉద్యమించాలని చేనేత కులాల వారు నిర్ణయించు కున్నారు. అందరూ ఐక్యంగా ఉండి ఒక్కతాటిపై నిలబడి, శాసనసభ్యులను గెలిపించుకోకపోతే

18-9Pg5:18-9Pg5.qxd 9/17/2026 11:03 PM Page 1



# 76వ వసంతంలోకి ప్రధాని మోడీ

## సుదీర్ఘ పనిగంటలు, అలుపెరుగని ఉత్సాహం 'మోడీ స్పెషల్'

## కఠినమైన ఆహారపు అలవాట్లే ఆరోగ్య రహస్యం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేడు 76వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన సుదీర్ఘ పని గంటలతో, అలుపెరగని ఉత్సాహంతో ఉండటం వెనుక ఉన్న రహస్యం ఏంటని చాలామంది ఆసక్తి చూపుతుంటారు. యోగా, వ్యాయామం ఆయన దినచర్యలో భాగమని అందరికీ తెలిసిందే. అయితే, ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఖరీదైన డైట్ చార్టులలో కాకుండా, నిరాడంబరమైన భారతీయ సంప్రదాయ ఆహారం, కఠినమైన ఉపవాస దీక్షలలో దాగి ఉంది. ఆయన ఆహార నియమాల్లో ఫ్యాషన్ డైట్‌లకు చోటు లేదు, కేవలం ఇంట్లో వండిన భోజనం, స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యం ఉంటుంది. ప్రధాని మోడీ ఆహారంలో మునగాకు పరాఠాకు ప్రత్యేక స్థానం ఉంది. 2020లో జరిగిన ఫిట్ ఇండియా డైలాగ్ కార్యక్రమంలో పోషకాహార నిపుణురాలు రుజుతా దివేకర్‌తో మాట్లాడుతూ, తాను వారానికి ఒకటి లేదా రెండు సార్లు మునగాకుతో చేసిన పరాఠాలు తింటానని స్వయంగా వెల్లడించారు. పోషకాలు పుష్కలంగా ఉండే మునగాకును ఆహారంలో చేర్చుకోవడానికి ఇదొక సులువైన మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సంభాషణలో పసుపు తీసుకుంటున్నావా అని తన తల్లి ఎప్పుడూ అడిగేవారని గుర్తుచేసుకున్నారు. ఇది సంప్రదాయ భారతీయ పదార్థాలపై ఆయనకున్న నమ్మకాన్ని తెలుపు తుంది. ఆయన ఆహారపు అలవాట్లన్నీ రోటీ, కూర, పప్పు, అన్నం, పోహా, ఉప్మా వంటి సాధా రణ భారతీయ కుటుంబాల్లో కనిపించేవే. ఆహారం విషయంలో ఎంత సాదాసీదాగా ఉంటారో, ఉపవాసాల విషయంలో మాత్రం ప్రధాని మోడీ అంతే కఠినంగా ఉంటారు. ఈ నియమాలను ఆయన దశాబ్దాలుగా పాటిస్తు న్నారు. 2025లో లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో మాట్లా డుతూ తన ఉపవాస దీక్షల గురించి వివరంగా తెలిపారు. చాతుర్మాస దీక్ష సమయంలో (సుమారు జూన్ మధ్య నుంచి దీపావళి వరకు) 24 గంటల్లో ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తానని ఆయన తెలిపారు. ఇక సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో వచ్చే శరన్నవరాత్రుల సమయంలో 9 రోజుల పాటు ఎలాంటి ఆహారం తీసుకోకుండా కేవలం వేడినీళ్లు మాత్రమే తాగుతానని వెల్ల డించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. చైత్ర నవరాత్రుల్లో మరో విభిన్నమైన నియమం పాటిస్తారు. ఈ 9 రోజుల పాటు రోజుకు ఒక్కసారి ఒకే రకమైన పండును తింటారు. బొప్పాయిని ఎంచుకుంటే, ఆ 9 రోజులు కేవలం బొప్పాయినే స్వీకరిస్తారు. దాదాపు 50-55 ఏళ్లుగా ఈ ఉపవాస దీక్షలను ఆచరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద చూస్తే, ప్రధాని మోడీ ఫిట్‌నెస్ రహస్యం ఫ్యాషన్ డైట్‌లలోనో, విదేశీ ఆహార పద్ధతుల్లోనో లేదు. మన వంటిళ్లలో వండుకునే పప్పుఅన్నం, నెయ్యి, రోటీ వంటి సంప్రదాయ భోజనాన్ని గౌరవి ంచడంలో, స్థానిక ఉత్పత్తులను ప్రోత్స హిం చడంలో, ఆధ్యాత్మిక విశ్వాసాలతో కూడిన కఠిన ఉపవాస దీక్షలను ఆచరించడంలోనే ఆయన ఆరోగ్య రహస్యం ఇమిడి ఉంది. ప్యాకేజ్డ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉంటూ, తాజాగా వండిన భోజనానికే ఆయన ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తారు.

## ప్రధానిమోడీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

ప్రధాని నరేంద్ర మోడీ గురువారం 76వ పుట్టిన రోజు జరుపుకున్న నేపథ్యంలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ జనతా పార్టీ మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్ ప్రచారాన్ని చేపట్టింది. మోడీ ప్రజాజీవితానికి 25 ఏళ్లు నిండిన నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 17వ తేదీ ఆయన పుట్టిన రోజు కాగా, ఇక అక్టోబర్‌లో ఆయన ప్రజాజీవితానికి 25 ఏళ్లు నిండనున్నాయి. మోడీ జన్మదినం సందర్భంగా ఇవాళ దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. టీడీపీ చీఫ్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, శివసేనా ప్రెసిడెంట్ ఏకనాథ్ షిండే, ఎల్‌జేపీ ప్రెసిడెంట్ చిరాగ్ పాశ్వాన్‌తో పాటు మూడు చోట్ల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వారాణాసిలో చంద్రబాబు, పాశ్వాన్ పాల్గొంటారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మోడీ ఆరోగ్యాన్ని కోరుకుంటూ పూజలు చేయనున్నారు. వారాణాసిలో సుమారు 51 మంది బైకర్లు గంగా నదిలో నీటిని తీసుకుని కాశీ విశ్వనాథ్ ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. వాద్‌నగర్‌లోనే మోడీ జన్మించారు. సిటీలో ఉన్న జగన్నాథ్ టెంపుల్‌లో షా పూజలు చేయనున్నారు. షిండేతో పాటు అనుప్రియా పాటిల్ ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక ఉజ్జయినిలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రత్యక పూజలు చేయనున్నారు. ఢిల్లీలో రక్తదాన శిబిరాన్ని కూడా ప్రారంభించనున్నారు. 1950, సెప్టెంబర్ 17వ తేదీన వాద్‌నగర్‌లో మోడీ జన్మించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధాని ఆయనే కావడం విశేషం. ఇక గుజరాత్ సీఎం ఆయన 2001, అక్టోబర్ 7వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆయన ప్రజాజీవితానికి 25 ఏళ్లు పూర్తి కానున్నాయి. మోడీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విశ్వాసంతో ముందుకు వెళ్తున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సడలని పట్టుదలతో మోదీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అస్సాం సీఎం హిమంత శర్మ అన్నారు. మోడీ రాజకీయ జర్నీ త్యాగానికి, జాతీయ సేవకు, మొక్కవోని దీక్షకు నిదర్శనమని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధానికి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పిన రాష్ట్రపతి ముర్ము తన ఎక్స్‌లో రియాక్ట్ అయ్యారు.సుపరిపాలనలో కొత్త ప్రమాణాలను మోడీ నెలకొల్పినట్లు ఆమె అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి ఆయన కొత్త మార్గదర్శనం చేస్తున్నట్లు చెప్పారు.

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

## సోషల్ మీడియాలో హల్‌చల్

**బీజింగ్, సెప్టెంబరు 17:** న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోగ్యంపై సోషల్ మీడియాలో తీవ్రమైన ప్రచారం జరుగుతోంది. సదస్సు మధ్యలో ఆయన సొమ్మసిల్లి పడిపోయారని, ఆ తర్వాత తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారని వదంతులు వ్యాపించాయి. ఈ ఆరోపణలకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. చైనాలో ప్రవాస జీవితం గడుపుతున్న విపక్ష నేత వాన్‌జున్ క్సీ ఈ ప్రచారానికి తెరలేపడంతో ఇది అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. తన సోషల్ మీడియా పోస్టులో వాన్‌జున్ క్సీ పలు ఆరోపణలు చేశారు. సదస్సులో అస్వస్థతకు గురైన జిన్‌పింగ్‌కు ఆయన వ్యక్తిగత వైద్య బృందం అత్యవసర చికిత్స అందించిందని, భారత్‌లోని ఆసుపత్రిలో చేరితే విషయం బయటకు పొక్కుతుందని భయపడి పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని ప్రత్యేక విమానంలో చైనాకు తిరిగి వెళ్లారని పేర్కొన్నారు. బీజింగ్‌లో దిగిన వెంటనే ఆయనను హెలికాప్టర్‌లో నేరుగా మిలిటరీ ఆసుపత్రికి తరలించారని, అక్కడ ఇస్కీమిక్ స్ట్రోక్‌కు శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం ఆయన ఐసీయూలో ఉన్నారని క్సీ ఆరోపించారు. ఈ ప్రచారానికి, అధికారిక రికార్డులకు ఏమాత్రం పొంతన లేదు. చైనా విదేశాంగ శాఖ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే, ఈనెల 12, 13 తేదీల్లో జిన్‌పింగ్ సదస్సులో పాల్గొన్నారు. 12న న్యూఢిల్లీకి చేరుకుని, తొలి సెషన్‌లో ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 13న రెండో సెషన్‌లోనూ పాల్గొని, మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరారు. భారత ఉన్నతాధికారులు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. సెప్టెంబర్ 12న ప్రధాని మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ గైర్హాజరైనప్పటికీ, సుదీర్ఘ ప్రయాణం, వరుస సమావేశాల కారణంగా ఆయన విశ్రాంతి తీసుకున్నారని, ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి వాంగ్ యీ హాజరయ్యారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, సదస్సులో మోడీ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి జిన్‌పింగ్ వైపు చూసి అంతా ఓకేనా అని అడగటం కూడా చర్చనీయాంశమైంది. అయితే అది ట్రాన్స్‌లేషన్ హెడ్‌ఫోన్లలో సాంకేతిక సమస్య వల్లే జరిగిందని, ఆరోగ్య సమస్య కాదని నివేదికలు చెబుతున్నాయి.

# అక్టోబర్ 1 నుంచి అమల్లోకి జనన, మరణాల నమోదు సవరణ చట్టం

### కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** జనన, మరణాల ఆలస్య నమోదుపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జిఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటంతో ఈ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం పుట్టుకలు, మరణాల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం, అవకతవకలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను నిర్దేశించింది. సెక్షన్ 1 లోని ఉపసెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2026 అక్టోబర్ 1ని ఈ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా ఖరారు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నూతన సవరణ చట్టం ద్వారా డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పాఠశాల ప్రవేశాలు, పాస్‌పోర్ట్, ఆధార్, ఓటర్ కార్డు, వివాహ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జనన ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకమైన ప్రాథమిక పత్రంగా మారనుంది.

## మెడికల్ షాపుల్లో సిసిటివి కెమెరాలు తప్పనిసరి

- ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై నిఘాకు కేంద్రం ప్రతిపాదన
- రికార్డులు కనీసం మూడు నెలలు భద్రపరచాలని సూచన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** వైద్యుల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సిసి కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది. సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం, రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సిసిటివి వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి.

# రష్యా చమురు దిగుమతులపై చైనా, భారత్‌కు ట్రంప్ వార్నింగ్!



**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్ మీరు ఒంటరి కాదని ఆయన అన్నారు. లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026 పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న షాడో ఫ్లీట్ (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది. అమెరికా ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

### 100 శాతం సుంకాలపై భారత్ సీరియస్ రియాక్షన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేలా అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై భారత్ స్పందించింది. దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన విషయాన్ని గమనిస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ పరిణామంపై తదుపరి చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. రష్యా నుంచి అత్యధికంగా ముడిచమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఈ నేపథ్యంలో కొత్త చట్టం భారత్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే అమెరికా ప్రభుత్వం భారత్ నుంచి దిగుమతయ్యే ఏ వస్తువులపై ఎంత సుంకం విధిస్తుంది ఏ ఉత్పత్తులకు వర్తిస్తుంది ఎప్పటి నుంచి అమలు చేస్తుంది అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 140 కోట్ల మంది భారతీయుల ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని విదేశాంగ శాఖ తెలిపింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తామని పేర్కొంది. ఇటీవల అమెరికా అధికారులతో జరిగిన పలు ఉన్నతస్థాయి చర్చల్లో రష్యా చమురు కొనుగోళ్ల అంశాన్ని భారత్ ప్రస్తావించినట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం భారత్‌అమెరికా సంబంధాలతో పాటు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై చూపే ప్రభావాన్ని కూడా అమెరికా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనేట్ గత నెల ఆమోదించింది. బుధవారం ప్రతినిధుల సభలో 262159 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. ఇక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే చట్టంగా మారుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చైనా, భారత్ సహా పలు దేశాలపై 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారం ఈ చట్టం ద్వారా అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. అమెరికా నుంచి వచ్చే తుది సుంకాల రేటు, ఏయే ఉత్పత్తులకు వర్తిస్తుందన్న వివరాలు వెల్లడైన తర్వాతే భారత్‌పై అసలు ప్రభావం ఎంత ఉంటుందో స్పష్టమవుతుంది.


## పెట్టుబడుల మోసం..

### భారత్ సంతతి సిద్ధార్థ్ జవహార్‌కు 11 యేళ్ల జైలు

**న్యూయార్కు, సెప్టెంబరు 17:** అమెరికాలో భారీ పెట్టుబడి మోసానికి పాల్పడిన కేసులో భారత సంతతికి చెందిన సిద్ధార్థ్ జవహర్‌కు అక్కడి న్యాయస్థానం 11 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సుమారు 31 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ. 335 కోట్లు మేర ఆర్థిక మోసానికి పాల్పడినట్లు రుజువు కావడంతో కోర్టు ఈ తీర్పునిచ్చింది. ఈ కేసులో బాధితుల్లో ప్రముఖ పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్ భర్త ట్రావిస్ కెల్సీ (అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్) కూడా ఉండటం గమనార్హం. టెక్సాస్‌కు చెందిన స్విఫ్టార్క్ క్యాపిటల్ ఎల్ఎల్‌సీ అనే సంస్థకు సిద్ధార్థ్ జవహర్ సహ వ్యవస్థాపకుడు. ఇతనిపై 2023లో అభియోగాలు నమోదుకాగా, సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తీర్పు వెలువరించింది. 11 ఏళ్ల జైలు శిక్షతో పాటు, బాధితులైన 64 మందికి 31.35 మిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాలని జవహర్‌ను న్యాయస్థానం ఆదేశించింది. పెట్టుబడిదారుల నుంచి సేకరించిన నిధులను జవహర్ ఫిలిప్ మోరిస్ పాకిస్థాన్ (పీఎంపీ) అనే కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. ఆ పెట్టుబడి విలువ భారీగా పడిపోయినప్పటికీ, ఆ నష్టాలను కప్పిపుచ్చి లాభాలు వస్తున్నాయని ఇన్వెస్టర్లను నమ్మించాడు. 2016 నుంచి 2023 మధ్య కాలంలో సుమారు 35 మిలియన్ డాలర్లు సేకరించిన ఆయన, అందులో కేవలం 10 మిలియన్ డాలర్లను మాత్రమే పెట్టుబడిగా పెట్టాడు. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బును పాతవారికి చెల్లిస్తూ తరహాలో ఈ మోసానికి పాల్పడ్డాడు. మిగిలిన నిధులను తన జల్సాల కోసం ప్రైవేట్ జెట్లు, లగ్జరీ హోటళ్లు, ఖరీదైన దుస్తులు, రెస్టారెంట్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేశాడు. పెట్టుబడిదారుల నమ్మ కాన్ని జవహర్ దుర్వినియోగం చేశారు.

# గాఢనిద్ర పోతే రూ.13.76 లక్షలు బహుమతి

### జపాన్ మాట్రెస్ కంపెనీ విచిత్ర పోటీ



**టోక్యో,సెప్టెంబరు 17:** నిద్రపోవడమంటే విశ్రాంతి తీసుకోవడమే అనుకుంటాం. కానీ జపాన్‌లో మాత్రం నిద్రపోతే ఏకంగా లక్షలు గెలుచుకునే అవకాశం వచ్చింది. ఒక జపాన్ మ్యాట్రెస్ కంపెనీ నిద్రపై ప్రత్యేక పోటీ నిర్వహించనుంది. ఇందులో ఎవరు అత్యుత్తమంగా నిద్రపోతారో తేల్చి విజేతకు 22.2 లక్షల యెన్‌లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.13.76 లక్షలు బహుమతిగా ఇవ్వ నున్నారు. అక్టోబర్ 5న టోక్యోలోని షేర్ గ్రీన్ మినామి అయోమాలో ఈ పోటీ జరగనుంది. పోటీలో పాల్గొనేవారికి 90 నిమిషాల సమయం ఇస్తారు. ఆ సమయంలో వారు ఎంత త్వరగా నిద్రలోకి జారుకున్నారు ఎంత గాఢంగా నిద్రపోయారునిద్ర ఎంత స్థిరంగా కొనసాగింది వంటి అంశాలను ప్రత్యేక పరికరాలతో నిర్వాహకులు పరిశీలిస్తారు. అయితే పోటీకి ముందు కంటెస్టెంట్లకు కొన్ని వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ దిండు, దుప్పటి, కంటి ముసుగు లాంటి ఏదో ఒక నిద్ర వస్తువు కేటాయిస్తారు. పోటీ కోసం ముందుగానే రాత్రంతా మేల్కొని ఉండటం, కావాలనే నిద్రకు దూరంగా ఉండటం వంటి వాటికి అనుమతి లేదు. సహజంగా వచ్చే నిద్రనే పరీక్షించాలన్నది నిర్వాహకుల ఉద్దేశం. నిద్ర పట్టేందుకు నిద్రమాత్రలు లేదా ఇతర మందులు వాడటంపైనా నిషేధం ఉంది. పోటీ సమయంలో నిర్వాహకులు కావాలనే కొన్ని అనూహ్యమైన అంతరాయాలు కలిగించే అవకాశం కూడా ఉంది. వాటి మధ్య కూడా నిద్రను ఎంత స్థిరంగా కొనసాగిస్తారన్నది పరిశీలించనున్నారు. ప్రధాన విజేతతో పాటు ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారికి కూడా బహుమతులు అందించనున్నారు. గాఢ నిద్రలోకి జారుకున్న వారికి డీప్ స్లీప్ డైవ్ అ వార్డు, చిత్రమైన భంగిమలో నిద్రపోయిన వారికి మరో ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పోటీకి దరఖాస్తు చేసుకోవడం ఉచితం 16 వరకు దర ఖాస్తులు స్వీకరించారు. మూడు విడతల్లో పోటీ నిర్వహించి, ఒక్కో విడతలో సుమారు 20 మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. జపాన్‌లో పెరుగుతున్న నిద్రలేమి సమస్యపై అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విశ్రాంతి ప్రాధా న్యాన్ని చాటడమే ఉద్దేశమని తెలిపారు.

# హిందీ అమలుపై టివికె సర్కార్‌కు సుప్రీం షాక్




**చెన్నై, సెప్టెంబరు 17:** ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలంటూ ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను వెనక్కి తీసుకోవాలన్న తమిళనాడు ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని సూచించిన ధర్మా సనం. తమిళ నాడులో హిందీని పూర్తిగా దూరంగా ఉంచలేం అని వ్యాఖ్యానించింది. జస్టిస్ బీవీ నాగ రత్న నేతృత్వంలోని ధర్మాసనం నవోదయ విద్యాలయాల కోసం ప్రతి జిల్లాలో అనువైన భూమిని మూడు నెలల్లోగా గుర్తించాలని తమిళ నాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే సమ యంలో భాషా విధానానికి సంబంధించిన అం శంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు కొనసాగించాలని సూచించింది. సంభాషణ, సహకార సమాఖ్య విధానం అవసరమని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నవోదయ విద్యా లయాలను ఏర్పాటు చేయాలంటూ మద్రాస్ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో జవహర్ నవోదయ విద్యాలయం లేని ఏకైక రాష్ట్రం తమిళనాడు.తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదిస్తూ.. నవోదయ విద్యాలయాల పథకం మూ డు భాషల సూత్రంతో ముడిపడి ఉంది.

# సంక్షిప్త వార్తలు

## వివాహితపై మాజీ ఎమ్మెల్యే అత్యాచారం!




**ముంబయి,సెప్టెంబరు 17:** వివాహితకు బలవంతంగా మద్యం తాగించి ఆపై తుపాకీ చూపించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలో కలకలం రేపుతోంది కళ్యాణ్‌భివండి ప్రాంతంలో 22 ఏళ్ల వివాహిత చేసిన ఫిర్యాదు ఆధారంగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే నరేంద్ర పవార్, బర్తరఫ్ అయిన పోలీస్ ఉద్యోగి శైలేష్ పాటిల్‌పై పద్ఘా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తన భర్తతో ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు సాయం చేస్తామని నమ్మించి తనను ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారని అక్కడ లైంగిక దాడికి పాల్పడ్డారని మహిళ ఆరోపించింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం



**శ్రీనగర్, సెప్టెంబరు 17:** జమ్మూకశ్మీర్‌లోని ఉదం పూర్ జిల్లాలో గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం అయ్యారు. ఉదంపూర్ జిల్లాలోని మజాల్తాలో అనుమానాస్పద కదలికలు ఉన్నట్లు బుధవారం సాయంత్రం అధికారులకు సమాచారం అందింది. దీంతో సంయుక్త బలగాలు ఆ ప్రదేశంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. గన్‌ఫైట్ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు చెప్పారు.

## ఆదిత్య థాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు



**ముంబై, సెప్టెంబరు 17:** దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా శాలియన్ మృతి కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి శివసేన (యుబిటి) నేత ఆదిత్య థాక్రేకు రూ. 500 కోట్ల లీగల్ నోటీసు జారీ అయింది. ఆయనతోపాటు ఎన్‌సిపి (ఎస్పీ), మహారాష్ట్ర మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌కు కూడా ఈ నోటీసులు అందాయి. దిశా మృతి కేసులో న్యాయం కోసం చేస్తోన్న పోరాటాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రీకరించేందుకు వారు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీశ్ ఈ నష్టపరిహారం కోరారు.

## లిండే గ్రాహం బిల్లుకు యుఎస్ చట్టసభల్లో ఆమోదం

**న్యూయార్క్,సెప్టెంబరు 17:** అమెరికా కీలక బిల్లును పాస్ చేసింది. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు చట్టసభ ప్రతినిధుల సభలో ఆమోదం దక్కింది. బుధవారం జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా 262, వ్యతిరేకంగా 159 మంది ఓటేశారు. పాసైన బిల్లు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ ముందుకు వెళ్తుంది. ఇప్పటికే ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రంప్‌కు ఇప్పుడు మరింత శక్తి తోడైనట్లు అయ్యింది. దక్షిణ కరోలినా దివంగత సేనేటర్ లిండ్సే గ్రహం గౌరవార్థం ఈ బిల్లును రూపొందించారు. సుమారు ఏడాది పాటు ఆ బిల్లుపై చర్చలు జరిగాయి.

## పంజాబ్‌లో రైతుల రైల్‌రోకో: నిలిచిన రైళ్లు



**చండీగఢ్, సెప్టెంబరు 17:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం పంజాబ్ రైతులు రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకో చేపట్టారు. పలు రైల్వే స్టేషన్ల వద్ద నిరసనలు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు రైళ్లు నిలిచిపోగా, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో పంజాబ్ రైతులు రాష్ట్రవ్యాప్తంగా 'రైల్ రోకో' ఆందోళన చేపట్టారు. దీంతో పలుచోట్ల రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, అమృత్‌సర్‌లోని దేవిదాస్‌పురా వద్ద రైతులు ధర్నా చేశారు.

18-9Pg6exHMNWJQE:18-9Pg6exHMNWJQE.qxd 9/17/2026 11:23 PM Page 1



# ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- 9 జిల్లాల్లో 2,249లో 1,898 ఫిర్యాదుల పరిష్కారం



**తిరుపతి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి' కార్యక్రమం వినియోగదారుల నుండి సత్ఫలితాలునిస్తోంది. ఎస్పిడిసిఎల్ అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమంలో అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కార స్థితి, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సమీక్షి ంచారు. ఈసందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా తెలు సుకుని, సత్వర పరిష్కారం అందించేందుకు నిర్వ హిస్తున్న 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమానికి వినియోగదారుల నుండి మంచి స్పందన లభి స్తోందని తెలియజేశారు. 2025 నవంబర్ 3వ తేదీ నుండి 2026 సెప్టెంబర్ 14 వరకు తొమ్మి దిజిల్లాల పరిధిలో ఈ కార్యక్రమం ద్వారా మొ త్తం 2,249 ఫిర్యాదులు అందాయని, వాటిలో 1,898 ఫిర్యాదులను ఇప్పటికే పరిష్కరించామ న్నారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన 351 ఫిర్యా దులు పరిష్కరించాల్సి ఉందని వివరించారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిరక్ష ్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షి ంచాలని, అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిరక్ష ్యం వహించే అధికారు లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని ఈ సందర్భంగా సిఎండి హెచ్చ రించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (టెక్ని కల్) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎన్, శోభా వాలెం టీనా, ఎం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్.రమణ, కె.సంపత్ కుమార్, ఎం.శ్రీ కాంత్, ఎ.శ్రీనివాస బాబు, జనరల్ మేనేజర్లు జగదీష్, హేమలత, భాస్కర్ రెడ్డి, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు చంద్రశేఖర రావు, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్,

# మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎపి శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్



**అనంతపురం, సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త బ్యూరో):** మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని, మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టబడి ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలోని సెనెట్ హాల్‌లో మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్, కమిటీ సభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాంట్రాక్టర్ ఇసాక్ బాషా, సుందరపు విజయ్ కుమార్, వక్ఫ్ బోర్డ్ సిఈఓ ఖాజీ యాకుబ్ భాష, తదితరులు ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలో, రాష్ట్రంలో మరియు దేశంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని, విద్యా ప్రమాణాలను పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టేందుకు వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన, మైనారిటీ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా మరియు ఉపాధి రంగాలు సాధికారత వైపు నడిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని స్వర్ణాంధ్ర 2047కి సాధనలో విద్యార్థులందరూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. ఏ పిల్లవాడు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తల్లికి వందనంవంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. కేవలం మార్కుల ఆధా రంగా ఉద్యోగాలు రావు అని, మా ర్కు లు, డిగ్రీలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు, నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆలోచన మేరకు యువత కేవలం ఉద్యోగా లు వెతుక్కునే వారిగా కాకుండా, పదిమంది కి, ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే వ్యవస్థాపకు లుగా, వ్యాపారవేత్తలుగా యువత ఎదగాల ని, వన్ హౌస్ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినా దంతో ముందుకు వెళ్లాలన్నారు. మైనారిటీ యువతకు చదువు, ఉద్యోగాలలో 4 బిసి ఇ కేటగిరీ రిజర్వేషన్లు మరియు ఇతర అవకాశాలు అందుతున్న తీరును పరిశీలించి, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఈ సమావేశం ద్వారా విద్యార్థులు నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, స్వర్ణాంధ్ర 2047సాధన దిశగా మైనారిటీల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందిస్తామన్నారు...

## విరాట్ విశ్వకర్మ భగవాన్‌కి సిఎం నివాళి



**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. విరాట్ విశ్వకర్మ సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగిన వారికిగా కీర్తించారు. విశ్వ సృష్టికి మూలకారకులు, సాంకేతికతకు మార్గదర్శకులు దేవశిల్పి విరాట్ విశ్వక ర్మ భగవాన్ అని పేర్కొన్నారు. సృష్టి నిర్మాణంలోనూ, భారతీ య సంస్కృతి సంప్రదాయాలలోనూ విశ్వకర్మల పాత్ర అత్యం త ప్రాధాన్యమైనదన్నారు. భారతదేశ మూల సంతతికి ఆదిపురుషులు విశ్వకర్మలే అని వాస్తు, శిల్పకళలకు శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి నాగరికతకు ప్రాణం పోసిన ఘనత వీరిదన్నారు. శతాబ్దాల క్రితమే కాలజ్ఞానంలో ఆకాశంలో ఇనుప పక్షులు ఎగురుతాయని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మాటలునేటి విమానాలు, ఆధునిక డ్రోన్ టెక్నాలజీల రూపంలో నిజమయ్యాయన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వబ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం త్వరలోనే 'ఆదరణ-3 పథకాన్ని పునఃప్రారంభించి ఆధునిక పనిముట్లను అందించనుందన్నారు. సంప్రదాయ వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి వృత్తి సామర్థ్యం, ఆదాయ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

## 22న రాప్తాడులో లోకేష్ పర్యటన

- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



**అనంతపురం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 22వ తేదీన రాప్తా డు శాసనసభ నియోజకవర్గంలో పర్యటి స్తున్నారు. మంత్రి పర్యటన విజయవం తం చేసేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ గురువారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా రాప్తాడు టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలో కూడా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ ఈనెల 22వ తేదీన రాప్తాడుకు రానున్నారని.. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, అలాగే మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చెప్పారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ, కార్యకర్తల సమావేశం జరగనుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ కార్యక్రమం మనకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉంటుందన్నారు. రాప్తాడులో లోకేష్ పర్యటనకు ముందు ర్యాలీ ఉంటుందన్నారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన సమావేశంలో కూడా లోకేష్ పర్యటనగురించి చర్చించారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా పాఠశాల అదనపు భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ నెల 22వ తేదీన నారా లోకేష్ గారు ఈ భవనాలను ప్రారంభిస్తారన్నారు. మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా నిర్వహించబోయే ర్యాలీ రూట్ మ్యాప్, సభాస్థలి, భోజన, విగ్రహాల ఏర్పాటు ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా చూశారు. సభకు వచ్చే వేలాది మంది ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు.

## మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి క్వారీల్లో విజిలెన్స్ దాడులు

- రాయల్టీ చెల్లించకుండా తవ్వకాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు
- నాలుగు టిప్పర్లు, మూడు కంప్రెషర్లు వాహనాలు సీజ్

**రాయదుర్గం(బొమ్మనహాళ్) సెప్టెంబరు 17 ప్రభాత వార్త :** మండలంలోని నేమకల్లు గ్రామ శివా రులో ఉన్న రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రా మచంద్రారెడ్డికి సంబంధించిన క్వారీల్లో క్వారీల్లో గురువారం మైనింగ్ అధికారుల దాడులు దుమా రం రేగిం ది. రాయల్టీ చెల్లించకుండా తెల్లరాయి తవ్వకాలు సాగుతున్నాయన్న ఫిర్యాదులపై మైనింగ్ అండ్ జియాలజీ విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మి కంగా దాడులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రరెడ్డికి సంబంధించిన క్వారీ ప్రాంతా ల్లోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. కర్నూల్ రీజినల్ మైన్స్ అండ్ జియాలజీ విజిలెన్స్ అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా మైనింగ్ అధికారులు బృందంగా వెళ్లి క్వారీలను పరి శీలించా రు. తనిఖీల్లో రాయల్టీ చెల్లించకుండా తవ్వ కాలు జరుపుతున్నట్లు గుర్తించిన నాలుగు టిప్పర్లు, మూ డు కంప్రెసర్లను అధికారులు సీజ్ చేశారు. అనంత రం వాటిని బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్కు తరలిం చారు. క్వారీల్లో అనుమతులు, మైనింగ్ పరిమాణం, రాయల్టీ చెల్లింపులపై అధికారులు రికార్డులను పరిశీలించారు. స్థానిక విలేకరులతో కర్నూల్, రీజనల్ మైన్స్ అండ్ జియాలజీ విజిలెన్స్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ రాయల్టీ చెల్లించకుండా తెల్లరాయి తవ్వకాలు చేస్తున్నారన్న ఫిర్యాదుల మేరకే తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీలో వాస్తవాలు బయటపడ్డాయి అని తెలిపారు. అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాట్లు నిర్ధారణం అయిందని చెప్పా రు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలు, యంత్రాలను సీజ్ చేసినట్లు చెప్పారు. పిహెచ్, భారతి, శివరాజ్, మోహన్దాస్ గురుప్రసాద్లకు సం బంధించిన క్వారీలకు అనుమతు లు ఉన్నట్లు తెలి పారు. మరోవైపు కేటీ లాలుస్వా మి. జ్వలిత అలేఖ్య, తిమ్మనగౌడ్డకు సంబంధించిన క్వారీలకు అను మతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్పటికి అనుమతులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయా ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్న ట్లు ఫిర్యాదులు అందాయని ఆయన చె ప్పారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్స్పెక్టర్ పురుషో త్తం, టెక్నికల్ అసిస్టెంట్ దిలిప్ కుమార్, అనంతపురం రాయల్టీ ఇన్స్పెక్టర్ సుప్రజ, సర్వేయర్ నిర్మల్ ఉన్నారు.

## రేషన్ డీలర్లుకు గౌరవ వేతనం చెల్లించాలి

- విజయవాడలో రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సమాఖ్య సమావేశం డిమాండ్

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** బియ్యం బస్తాలపై కోడ్‌స్కానింగ్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని రేషన్ డీలర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ విధానం అమలుకు అవస రమైన పరికరాలు అందుబాటులోకి వచ్చిన తరువాత తనే అమలు చేయాలని సంఘం కోరింది. విజయ వాడలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర స్థాయి సమా వేశం సంఘం అధ్యక్షుడు లీల మాధవరావు అధ్యక్ష తన జరిగింది. తగిన పరికరాలు లేకుండా కోడ్ స్కానింగ్ సరికాదన్నారు. అవి వచ్చిన తర్వాతే అమ లు చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశా రు. అలాగే సరుకుల ఇంటింటి పంపిణీ (డోర్‌డెలివరీ) కోసం డీలర్లకు నెలకు రూ.5,000 చెల్లిం చాలటన్నారు. ఇంటి నంబర్ల ఆధారంగా దుకాణాల మ్యాపింగ్ చేపట్టాలని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కమిషన్‌ను యూనిట్‌కు రూ.2కు పెంచాలనివారు కోరారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని డీలర్లకు రూ.5,000, పట్టణ ప్రాంతాల్లోని వారికి రూ.7,500 గౌరవ వేతనం ఇవ్వాలని, అలాగే ఇఎస్ఐ పరిధిలోకి వచ్చే ఆరోగ్య కార్డులను డీలర్లకు కల్పించేందుకు వీలుగా జిఒ 5ను పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విరాట్ విశ్వకర్మకి మంత్రి సవిత నివాళి



**అనంతపురం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త బ్యూరో:** రాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా రాష్ట్ర చేనేత, బీసీ సంక్షేమ శాఖల మం త్రి సవిత గురువారం రోజు విశ్వకర్మ భగవానుడికి ఘన నివాళు లు అర్పించారు. శిల్పులు, వృత్తి నిపుణులు, చేతివృత్తిదారులు, కార్మికులకు విశ్వకర్మ భగవానుడు ఆరాధ్య దైవమని ఆమె పేర్కొన్నారు. విశ్వకర్మ భగవానుడి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం అభినందనీయమన్నారువిజయవాడలో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ భగవానుడి స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతివృత్తిదారులు, కార్మికుల సంక్షేమానికి ప్రత్యే క ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గీత, వడ్డెర, చేనేత తదితర సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన వారికి ఆర్థికంగా మేలు జరిగేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. లంకానగరం, ద్వారక, ఇంద్రప్రస్థం వంటి అద్భుత నగరాల నిర్మాణంతో విశ్వకర్మ భగవానుడు నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆధునిక నగరాల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కృషి చేశారని, సైబరాబాద్‌తో పాటు అమరావతి నిర్మాణా నికి ఆయన కృషి చేస్తున్నారని మంత్రి సవిత పేర్కొన్నారు. వృత్తిదారులు, కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం


## సింహావాహనంపై 'యోగ' నరసింహుడు



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** "యోగనరసింహస్వామి" రూపంలో అనంతతేజోమూర్తి మలయప్పస్వామి గురువారం ఉదయం సింహవాహనాన్ని అధి రోహించి భక్తులకు అభయమిచ్చాడు. శేషాచలంకొండల్లో తిరుమలగిరులపై వేడుకగా జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు గురువారం ఉదయం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత శ్రీమలయప్పస్వామి యోగనరసింహుడు అలంకారంలో భక్తులను బ్రోవడానికి వాహనంపై వేంచేపుచేశారు. ఆలయం నుండి వాహనమండపం వద్దకు చేరుకున్న మలయప్పను ఉదయం 8గంటలకు అర్చకులు కర్పూర హారతులిచ్చి ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఊరేగించారు. తనకోసం వేచివుచి ఉన్న భక్తుల నుండి పూజలందుకున్నారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహావాహనంపై కూర్చుని ఊరేగారు. తిరుమల ఆలయంలో యోగ నరసింహుడు యోగముద్రలో వున్నాడు. తిరుమలదారిలో లక్ష్మీనరసింహుడై కొలువు దీరాడు. ఉదయం వాహనసేవలో జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. సింహా వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఒ మురళీకృష్ణ జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల్లో భక్తుడిగా టిటిడి ఇఒ రవిచంద్ర

- మాడవీధుల గ్యాలరీల్లో పలకరింపు



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** సప్తగిరుల్లో అశేషంగా జరుగుతున్న శ్రీవారి వాహనసేవల ఊరేగింపు వీక్షణకు విచ్చేసిన భక్తులతో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తోటిభక్తుడిగా కలివిడిగా తిరిగారు. వారిని గ్యాలరీల్లో ఆప్యాయంగా పలకరించి కల్పించిన సౌకర్యాలు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయం జరిగిన సింహ వాహనసేవ వీక్షణకు తిరుమలలోని మాఢవీధుల గ్యాలరీల్లో ఉన్న భక్తులతో ఇఒ శీ ముద్దాడ రవిచంద్ర ముచ్చటించారు. వాహనసేవను వీక్షి స్తున్న భక్తుల గ్యాలరీలోకి వెళ్ళి వారితో నేరుగా మాట్లాడారు. కల్పిస్తున్న సౌకర్యాలు, ఏర్పా ట్లపై వారిని అడిగి తెలుసుకున్నారు. తమిళనాడు, హైదరాబాద్, నెల్లూరు, మహా రాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఇఒ ఆత్మీయంగా మాట్లాడారు.

భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. టిటిడి అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించాలని శ్రీవారి సేవకులకు సూచించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడికి ఆత్మీయతతో సేవలందిస్తూ, శ్రీవారి దర్శన అనుభూతిని మరింత ఆనందదాయకంగా తీర్చిదిద్దాలని అన్నారు. భక్తి, సేవ, ఆతిథ్యంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భద్రతకు ప్రత్యేక చర్యలు

- చిన్నారులు, వృద్ధులు తప్పిపోకుండా జియో ట్యాగింగ్



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో జరుగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో అనూహ్యరద్దీతో చిన్నపిల్లలు, వృద్దులు తప్పిపోకుండా పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. శనివారం జరిగే గరుడ సేవకు అనూహ్యంగా దేశంనలుమూలల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే చిన్నపిల్లల భద్రతకు జియోట్యాగింగ్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన పోలీసు శాఖ గరుడసేవకు ఈసేవలను మరింత విస్తృతం చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు నేతృత్వంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పటిష్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ము ఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుటుంబ సభ్యుల నుంచి విడిపోకుండా తప్పిపోకుండా ప్రత్యేక ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే నడక మార్గాలు, నాలుగు మాడవీధులు, గ్యాలరీలు, బస్టాండ్లు, చౌల్ట్రీలు, విశ్రాంతి భవనాలు, ప్రధాన రద్దీ ప్రాంతాల వద్ద పోలీసులు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉంటున్నారు. చిన్నారులు, వృద్ధుల కు జియో ట్యాగ్‌లు వేసి వారు కుటుంబ సభ్యుల నుండి విడిపో యిన సందర్భంలో త్వరగా గుర్తించి, వారి కుటుంబ సభ్యుల వద్దకు సురక్షి తంగాచేర్చేలా చర్యలు చేపడుతు న్నారు. ట్యాగ్ కట్టుకోండి... మీ భద్రత మా బాధ్యత సందేశంతో భక్తులకు అవగాహన కల్పిస్తూ చి న్నారులు, వృద్ధులకు ట్యాగ్‌లు ధరింపజేస్తున్నారు. తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు రద్దీ ప్రాంతాల్లో తమ వెంట వచ్చే చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిని ఒంటరిగా వదిలివే యకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. సిసి కెమెరాలు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా రద్దీ ప్రాం తాలను నిరంతరం పర్యవేక్షి స్తూ, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు సి బ్బందిని మోహరించారు. భక్తుల రాకపోకలు, రద్దీ, వాహనాల కదలికలు తదితర అంశా లను నిరంతరం పర్యవేక్షి స్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బంది సమ న్వయంతో విధులు నిర్వహిస్తున్నారు. చిన్నా రి గానీ వృద్ధుడు కుటుంబ సభ్యుల నుండి విడిపోయినట్లయితే భయపడకుండా వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందినిగానీ భద్రతా సిబ్బందిని సంప్రదించాలని

## తిరుమాడ వీధుల్లో వెల్లివిరిసిన భారతీయ సంస్కృతి



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తి వైభవంతో, సాంస్కృతిక శోభ వెల్లివిరుస్తోంది. ఈ వాహనసేవల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు 8 రాష్ట్రాలకు చెందిన 19 కళా బృందాల నుండి 504 మంది కళాకారులు పాల్గొని విభిన్న జానపద, సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శిస్తూ భక్తులను అలరించారు. అశ్వ, వృషభ, గజరాజుల విన్యాసాలు తిరుమాడ వీధుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జార్ఖండ్‌కు చెందిన శ్రేష్ఠిధర్ మహాతో బృందం ప్రదర్శించిన చౌ నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ముసుగులు ధరించి శరీర కదలికలు, ప్రత్యేక అడుగులు, యుద్ధ విన్యాసాలతో ప్రదర్శించే ఈ కళారూపంలో రామాయణం, మహాభారతం, పురాణ గాథలను అభినయిస్తారు. ఎగరడం, గిర్రున తిరగడం, యుద్ధ విన్యాసాలు చేయడం చౌ నృత్యంలోని ప్రత్యేకతలు. జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వివిధ శైలుల్లో ప్రదర్శించే చౌ నృత్యం నృత్యం, నాటకం, యుద్ధకళల సమ్మేళనంగా ప్రసిద్ధి చెందింది. గుజరాత్‌కు చెందిన గర్బా నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

సంప్రదాయబద్ధంగా దీపంతో కూడిన మ ట్టి కుండ చుట్టూ స్త్రీ, పురుషులు కలిసి చేసే ఈ నృత్యం ఉత్సాహభరితంగా సా గింది. ఇక ఉత్తరాఖండ్‌కు చెందిన చోలి యా నృత్యం కళాకారుల యుద్ధ విన్యా సా లతో ఆకట్టుకుంది. పంజాబ్‌కు చెంది న కళాకారుల భాంగ్రా నృత్యం ఉత్సాహభరితమైన అడుగులతో తిరుమాడ వీధుల్లో సందడి చేసింది. పంటల పండుగలతో అనుబంధం ఉన్న భాంగ్రా నృత్యం భక్తుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## శ్రీవారి దర్శనంతో ఆనందం



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్రమైన తిరుమలలో ఆద్యాత్మిక అనుభూతి కలిగిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల వేళ శ్రీవారి దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విశ్వాసం వ్యక్తం చేసింది. గురువారం ఉదయం కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నిశ్చికింత్‌దుబే సభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయిం చారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసి సేవలు

**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం విచ్చేసే లక్షలాది మంది భక్తుల ప్రయాణ రక్షణే పరమావధిగా ఆర్టీసీ యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బ్రహ్మోత్సవాల వేళ శ్రీవారి భక్తుల రక్షణ, సురక్షి త ప్రయాణమే ధ్యేయంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక సమీక్షలతో తిరుపతి అలిపిరి కేంద్రంలో నిత్యం ఘాట్‌లో తిరిగే బస్సుల కండిషన్, ఇతరత్ర మెకాని జంపై తనిఖీలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీని వాసరావు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె బాలాజీ, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎస్.హరిబాబుతో కలిసి అలిపిరి బస్ మెయింటెనెన్స్ ఇన్‌స్పెక్షన్ కార్య క్రమాన్ని సందర్శించారు. శనివారం జరిగే గరుడసేవ రద్దీ సమయంలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ఘాట్ రోడ్డు ప్రయాణానికి బస్సుల ఆపరేషన్ నిర్వహించే తీరును వర్క్‌షాప్ ప్రక్రియను స్వయంగా పరి శీలించారు. ఈ సందర్భంగా చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ (మెకానికల్) ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఉద్దేశించి ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన భాగాలైన స్టీరింగ్, బ్రేకులు, సస్పెన్షన్, ఇంజిన్ వ్యవస్థ టైర్ అనువైన విషయాలలో ఖచ్చితమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ

## రేపు గరుడసేవ

- 3.50లక్షల మందికి వాహన దర్శనభాగ్యం
- హారతులు రద్దు



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న బ్రహ్మోత్సవ వాహనసేవల్లో ఐదవరోజు రాత్రి (శనివారం) గరుడసేవ ప్రాధాన్యత దృష్ట్యా 3.50లక్షల మంది భక్తులకు వాహనసేవ దర్శనం కల్పించేలా టిటిడి ఏర్పాట్లు చేసింది. గరుడసేవ రోజు మాఢవీధుల్లో భక్తుల హారతులిచ్చే కార్యక్రమాన్ని రద్దుచేసింది. ఆ స్థానాల్లో అదనంగా మరో 10వేలమంది భక్తులకు వాహనసేవ వీక్షించేలా ఏర్పాట్లుచేశారు. గ్యాలరీల్లో సరాసరి 2.50లక్షలమంది వరకు భక్తులు వేచివుంటారు. వారందరికీ స్వామివారి వాహనసేవల వీక్షణ భాగ్యం కలుగుతోంది. గరుడసేవ జరిగే శనివారం రోజుమాత్రం తూర్పుమాఢవీధిలో తొలుత స్వామివారి వాహనం కదిలి మిగిలిన మూడు మాఢవీధుల్లో ప్రదక్షణ చేసి వచ్చేలోపు మళ్లీ తూర్పుమాఢవీధిలో భక్తులను అనుమ తించడం జరుగుతుంది. అన్నప్రసాదం, రాంభగీచా వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పా టుచేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. 3.50లక్షల మందికి దర్శనం చేయించిన తరువాతే స్వామివారు వాహనమండపం చేరుకుంటారు. ఈ భక్తుల సంఖ్య ఓ మోస్తరుగా శుక్రవారం పెరిగే అవకాశం ఉంది. గరుడసేవకు భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బందిని అప్రమత్తం చేసి భక్తులకు అసౌకర్యం లేకుండా చూడనున్నారు.

నేటి రాత్రి నుండి ద్విచక్రవాహనాలు బంద్ కలియుగవైకుంఠం తిరుమలకొండపై సప్తగిరీశునికి అంగరంగవైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శనివారం (రేపు) అత్యంత ప్రధానమైన గరుడసేవ నిర్వహిస్తారు. ఈ గరుడ వాహనసేవకు దేశం నలుమూలల నుండి ముఖ్యంగా తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకోవడం పరిపాటి. ఈ నేపథ్యంలో తిరుమలలో పదివేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉంది. ఆపై వాహనాలను తిరుపతి అలిపిరి సమీపంలోనే నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లో ఆపివేసి ఆర్టీసి బస్సుల ద్వారా తిరుమలకు అనుమతించనున్నారు. ఇక ద్విచక్రవాహనాలను శుక్రవారం రాత్రి నుండి తిరుమలకు నిషేధించారు. ఆదివారం ఉదయం 7గంటల వరకు ఘాట్‌లో ద్విచక్రవాహనాలను నిషేధించారు. శనివారం రాత్రికి గరుడసేవ 6.30గంటలకే మొదలవుతుంది. గరుడసే వను దృష్టిలో వుంచుకుని సామాన్యభక్తుల కు స్వామివారి దర్శనం కల్పించడంతోబాటు గరుడసేవను వీక్షించేలా తిరుమలకొండపై ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. గరుడసేవరోజు తిరుమల ఘాట్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు జరగకుండా చూడటానికి తిరుమల- తిరుపతి మధ్య ద్విచక్రవాహ

18-9Pg7exHMNWJQE:18-9Pg7exHMNWJQE.qxd 9/17/2026 11:26 PM Page 1



# రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

● జలదీక్షలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి... సంఘీభావం తెలిపిన కమ్యూనిస్టు నేతలు



**అనంతపురం సిటీ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** రాప్తాడు నియోజకవర్గంలోని పేరూరు డ్యాంతో పాటు అన్ని చెరువులకు నీళ్లిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలో జలదీక్ష నిర్వహించారు. జిల్లాలోని చెరువులకు నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలనే డిమాండ్‌తో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురంలోని హంద్రీనీవా సీఈ కార్యాలయం ఎదుట దీక్షకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే అనుమతులు లేవని, టెంట్లు ఏర్పాటు చేయవద్దని పోలీసులు అడ్డుకోవడంతో సమీపంలోని ఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి దీక్ష కొనసాగించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువకు చేపట్టిన లైనింగ్ కారణంగా భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆరోపించారు. గతంలో తాము ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. గతేడాది జిల్లాకు 56 టీఎంసీల నీటిని తీసుకొచ్చామని ప్రజాప్రతినిధులు చెబుతున్నారని, అయితే పేరూరు డ్యాంకు ఎందుకు నీటిని విడుదల చేయలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యాంకు రెండు టీఎంసీల నీటిని కేటాయిస్తూ జీవో ఇచ్చారని తెలిపారు. ఆ నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేరూరు డ్యాంకు నీటిని విడుదల చేయడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని పేరూరు డ్యాంతో పాటు అన్ని చెరువులకు నీళ్లు ఇస్తే తాము రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఈ సవాల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేము. మాట తప్పమని మేము వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసులం అని స్పష్టం చేశారు. రైతులపై ప్రేమ ఉంటే పేరూరు డ్యాంను నింపాలన్నారు. అలా చేస్తే రాజకీయంగా తాము ఎక్కడా అడ్డురామని స్పష్టం చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో బోర్లు, చెరువులు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశుగ్రాసం అందుబాటులో లేక పశువులను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలోని రైతులను ఆదుకునేందుకు తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీ ఆర్ డ్యాంకు నీటిని విడుదల చేయాలని, అక్కడి నుంచి కుడికాలువ కింద ఉన్న చెరువులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ద్వారా పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావాలని సూచించారు.

# బిసి రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్

● సమగ్ర కుటుంబ సర్వే గణాంకాలు ఇవ్వండి ● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

● బిసిలకు 34శాతం రిజర్వేషన్లపై వ్యాజ్యాల్లో వాదనలు పూర్తి... తీర్పు వాయిదా



**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బిసిలకు) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒలపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ వ్యాజ్యంలో విచారణ నిర్వహించిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్నది. ఈ వ్యవహారంపై తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రభుత్వ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల 1065, 105 జిఒలను జారీ చేసింది. అయితే, ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల మొత్తం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన 50శాతం పరిమితిని దాటుతున్నాయని, ఈ జిఒలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా జిఒలను సవరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ తీరుపై ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి గల ప్రధాన ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. ఆ కమిషన్ నియామక ఉత్తర్వులను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 34శాతం రిజర్వేషన్లను సిఫారసు చేయడానికి కమిషన్ ఎలాంటి అధ్యయనం చేసింది? అందుకు ఆధారంగా తీసుకున్న గణాంకాలు, ప్రాతిపదిక ఏమిటి? అనే వివరాలను సమగ్రంగా తెలియజేయాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని కోరింది. కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను తామే స్వయంగా పరిశీలిస్తామని స్పష్టం చేసింది. గతంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కూడా కోర్టు ముందు ఉంచాలని, ఆ సర్వే ఉద్దేశంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వం సమర్పించే అన్ని నివేదికలు, గణాంకాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే స్థానిక సంస్థల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్ల అంశంపై తుది నిర్ణయం వెలువరిస్తామని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ క్రమంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించింది.

## ఎంఆర్ అగ్రహారంలో ఫర్నిచర్ షాప్‌లో అగ్ని ప్రమాదం




**సంతకవిటి (విజయనగరం జిల్లా), సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా సంతకవిటి మండలం యమ్.ఆర్ అగ్రహారం గ్రామంలో చందు ఫర్నిచర్స్ ఎలక్ట్రికల్ హోమ్ షాపులో అగ్ని ప్రమాదం వలన మంటలు చెలరేగి అక్కడున్న స్థానికులు వెళ్లి చూడగా అప్పటికే భారీ స్థాయి లో మంటలు ఎగిసిపడుతున్నాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేయగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కాని భారీ నష్టం జరిగిపోయింది. కొంత వరకు స్థానికులు మంటలు ఆర్పడానికి చాలా విధముగా ప్రయత్నించారు. షాప్‌లో ఉన్న ఫర్నిచర్స్, ఎల క్ట్రికల్, యువర్ ప్రింటింగ్ మిషన్, టీవీలు ఫ్రిడ్జ్ లు మొదలైన సామాగ్రి కాలి బూడిద అయ్యాయి. దీని విలువ దాదాపు కోటి 25 లక్షలు. షాపు గల యజమాని సుగంధం చంద్రశేఖర్‌రావు చాలా బాధాకరమైన విషయమని రోధించారు. ఎంతో కష్టపడి గత పది సంవత్సరాలుగా ఈ షాపును సంపాదించానని ఆవేదన వ్యక్తం చేశారు.

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు: ఎ4 సురేష్ సరెండర్

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు సాయికృష్ణ లాకప్ డెత్ ఘటనకు సంబంధించి మరో నిందితుడు సురేశ్ (ఏ4) సిట్ కార్యాలయంలో లొంగిపోయాడు. సాయికృష్ణ అదృశ్యంలో కీలక పాత్ర సురేశ్ పోషించినట్లుగా గతంలో సిట్ వెల్లడించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కృష్ణలంక మాజీ సిఐ నాగరాజుకు సురేశ్ అత్యంత సన్నిహితుడు. ప్రైవేట్ వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అతను అధికారం సాగించేవాడని సిట్ దర్యాప్తులో తేలింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకోవడం నుంచి అతడు మృతి చెందడం, అనంతరం శవాన్ని మాయం చేయడం వరకు అన్ని వ్యవహారాల్లో సిఐ నాగరాజుకు సురేశ్ సహకరించినట్లు తేలింది. సురేశ్‌పై కేసు నమోదు చేయకముందే పలుమార్లు అతడిని పిలిపించి సిట్ కొంత సమాచారం సేకరించింది. పోలీస్‌స్టేషన్ నుంచి సాయికృష్ణను ఎందుకు బయటకు తీసుకెళ్లారు? ఎవరు తీసుకెళ్లారు? ఎక్కడెక్కడ తిప్పారు? ఆ తర్వాత ఎప్పుడు స్టేషన్‌కు తీసుకొచ్చారు? అనే వివరాలను అతని నుంచి రాబట్టారు. అయితే సురేశ్‌పై కేసు నమోదు చేసి ఎ4గా పేర్కొన్న తర్వాత నుంచి కనిపించడం లేదు. అనంతరం సురేశ్ ఆచూకీ కోసం సిట్ గాలించింది. అతడి ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పత్రికా ప్రకటన విడుదల చేసింది. కేసు నమోదైన తర్వాత అతడు పరారీలో ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. సురేశ్ గురించి ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిట్ తెలిపింది. నిందితుడి వివరాలు తెలిసిన వాళ్లు 100/112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొంది. తాజాగా కేసులో సిట్ ఎదుట ఏ4 సురేశ్ లొంగిపోయినట్లు సమాచారం. సాయికృష్ణకు ఈ కేసులో సురేశ్ ప్రమేయం ఉన్నట్లు సిట్ ఆధారాలతో ధృవీకరించింది. సురేష్ లాకప్‌లో సిఐ, ఇతర పోలీసు సిబ్బందితో కలిసి సాయికృష్ణను విచక్షారహితంగా కొట్టిన ఘటనలో సురేష్ ఉన్నాడనే అభియోగం ఉంది. లాకప్ నుంచి సాయికృష్ణ శవాన్ని బయటకు తరలించడంలో సురేష్ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.

# సత్యసాయి తాగునీటి పథకం ట్యాంకుకు గండి





**డి.హిరెహాళ్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తుంగభద్ర ఎగువ కాలువ నుండి తాగునీటి కి మాత్రమే నీటిని సరఫరా చేయడం జరిగింది. ఈ పరిస్థితుల్లో సత్యసాయి తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు గండిపడి తాగునీరు వృథాగ వాగుకు వెళుతున్నాయి. గురువారం అర్ధరాత్రి అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలం గొడిసెలపల్లి వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి పథకం ట్యాంకుకు ప్రమాదవశాత్తు గండి పడటంతో తాగునీరు వృథా అయ్యాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తుంగభద్ర ఎగువ కాలువ నుండి 3.16 మీటర్లు సామర్థం కలిగిన తాగునీరు ట్యాంకుకు వదిలారు. సామర్థం కు మించి వదలడంతో ప్రమాదవశాత్తు ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ప్రస్తుతం 1.16 మీటర్ల సామర్థం గల నీరు మాత్రమే ట్యాంకులో నిలువ ఉన్నాయి. ఈ తాగునీరు మండల పరిధిలోని 12 గ్రామాలకు సరఫరా చేస్తూ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఉన్న ఈ తాగునీరు కాస్త వాగుల పాలు కావడంతో ముమ్ముందు గుక్కెడు తాగునీటి కోసం ఎన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు దిగులు చెందుతున్నారు. అర్ధరాత్రి గండ పడడంతో ఆ గండి ప్రమాదకర స్థాయిలో ఏర్పడడంతో స్థానికులు గండిని పూడ్చేందుకు వీలు లేకపోవడంతో చూస్తుండి పోయారు. తాగునీటి ట్యాంకుకు గండిపడ్డ విషయం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉండాల హనుమంతరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, బిజెపి నాయకుడు రాళ్ల తిమ్మారెడ్డి గండిపడ్డ విషయం సత్య సాయి బోర్డు డి ఈ రామారావు, జేఈ రామకృష్ణారెడ్డి ల దృష్టికి తీసుకెళ్లడంతో ఇంజనీర్లు ఘటన ప్రాంతానికి చేరుకొని గండిపడ్డ ప్రాంతాన్ని పరిశీలించి గండి పూడ్చేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. నిలువ ఉన్న నీరు అంతా వెళ్ళిన అనంతరం తాత్కాలికంగ రింగ్ బండ వేసి తక్కువ సామర్థంతో కలిగిన నీటిని నింపి సరఫరా చేస్తూ తాత్కాలిక ఉపశమనం కలిగిస్తామని ఇంజనీర్లు తెలిపారు. శాశ్వత మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేసి కలెక్టర్‌కు పంపుతామని నిధులు మంజూరు అనంతరం శాశ్వతంగ మరమ్మత్తు పనులు చేపడతామని ఈ సందర్భంగ వారు తెలిపారు. ఇంజనీర్ల తప్పిదాల వల్లే నేడు సమ్మర్ స్టోరేజ్ తాగునీటి ట్యాంకుకు గండిపడి తాగునీరు వృధా అయ్యాయని 2.5 మీటర్ల సామర్థం కలిగిన నీరు మాత్రమే నిలువ ఉంచాల్సి ఉండగ 3.16 మీటర్ల నీటిని నిల్వ ఉంచేందుకు ప్రయత్నించడంతో పటిష్టం లేనిచోట ట్యాంకు గట్టు గండి ఏర్పడిందని పలువురు స్థానికులు వాపోయారు.

# రాజకీయ పార్టీలన్నీ తమ వైఖరి స్పష్టం చేయాలి

● మాజీ ఎంపి విజయసాయిరెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు బిజెపి, టిడిపి, జనసేన, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, తదితర రాజకీయ పార్టీలు తమ వైఖరి (స్టాండ్) స్పష్టం చేయాలని కోరుతున్నట్లు మాజీ ఎంపి విజయసాయిరెడ్డి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఏ పార్టీ తమ సిద్ధాంతంపై కచ్చితంగా నిలబడుతున్నాయో చెప్పాలన్నారు. టిక్కెట్లు కోసం రాజకీయ నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీలో గతంలో ఎంతమంది నాయకులు ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం వైఎస్ జగన్‌ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో, ఇప్పుడు ఆ పార్టీలో నంబర్‌వన్‌గా ఉన్నవారే సమాధానం చెప్పాలని మాజీ ఎంపి విజయసాయి రెడ్డి ఎక్స్ వేదికగానే పెట్టిన పోస్టులో డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలకు మద్దతుగా 2024 ఎన్నికల ముందు వైఎస్సార్సీపీ అప్పటి కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్రైస్తవ సభలో మాట్లాడినట్లుగా ఉన్న వీడియోను కూడా విజయసాయిరెడ్డి ఈ పోస్ట్‌కు ట్యాగ్ చేసారు. రెడ్డి సామాజికవర్గం ఎలా ఆవిర్భవించింది? రెడ్డి రాజులు ఎలా పాలించారనే సమాచారంతో తాను 350 పేజీల పుస్తకాన్ని రచించినట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఇదే సమయంలో వైఎస్సార్సీపీ నాయకత్వానికి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "వైఎస్సార్సీపీ కోటరీ మళ్లీ నన్ను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టాలని చూస్తే నా దగ్గర చాలా నిజాలున్నాయి. వాటన్నింటినీ త్వరలోనే బహిరంగంగా బయటపెడతా" అని హెచ్చరించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.



# శ్రీసిటీకి ఉత్తర అమెరికా పెట్టుబడుల ప్రధాన అనుసంధానకర్త

**సత్యవేడు, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర అమెరికా పెట్టుబడుల ప్రధాన అనుసంధాన కర్త సతీష్ మండున శ్రీసిటీని సందర్శించారు. రాష్ట్రానికి ఉత్తర అమెరికా పెట్టుబడులను ఆకర్షించేందుకు నియమితులైన ఆయన యూఎస్ ఇండియా ఛాంబర్, కామర్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడిగా, ఇంటలిసాఫ్ట్ టెక్నాలజీ సీఈవోగా కొనసాగుతున్నారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధంతో పాటు ఉత్తర అమెరికా వ్యాపార వర్గాల్లో విస్తృత పరిచయాలు, అనుభవం ఉన్నాయి. సతీష్ మండువకు శ్రీసిటీ మేనేజర్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అవకాశాలను ఉత్తర అమెరికా పెట్టుబడి దారులకు పరిచయం చేయడంలో ఆయన చేస్తున్న కృషి అభినందించారు. బహుళజాతి సంస్థల విస్తృత ఉనికితో శ్రీసిటీ ప్రత్యేక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందన్న ఆయన రాష్ట్రఅభివృద్ధి ప్రయాణంలోభాగంగా శ్రీసిటీలోను ఉత్తర అమెరికా సంస్థల భాగస్వామ్యంపెం చేందుకు, శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాలను పరిచయం చేసేందుకు తనతో కలసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

# అనుమతులు లేకుండా తరలిస్తున్న ఎనిమిది బరైటీస్ లారీలు నిలిపివేత



**వింజమూరు (నెల్లూరు), సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** సరైన అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగాబరైటీస్ ఖనిజాన్ని తరలిస్తున్న 8 లారీలను పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెం సమీపంలోని బీటీసీ కంపెనీ నుంచి వింజమూరు వైపు వస్తుండగా పోలీసులు లారీలను ఆపి తనిఖీలు చేశారు. అనంతరం కావలి, ఉదయగిరి, జాతీయ రహదారిలోని ప్రైవేటు కాటా వద్ద లారీలను నిలిపి ఉంచారు. ఈ విషయమై ఎస్సై ఎం. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లారీ లోడుకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపాలని కోరామన్నారు. గురువారం రాత్రి వరకు నిర్వాహకులు ఎలాంటి పత్రాలు చూపలేదని, పత్రాలు చూపితే లారీలను వదిలిపెడతామని, లేకుంటే మైన్స్ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. కలిగిరి సీఐ సుబ్బారావు లారీలను తనిఖీ చేసినట్లు తెలిపారు. వింజమూరు గుండెమడకల రోడ్డులో గతంలో బ్రహ్మక్షి సుదర్శన్ బరైటీస్, బీటీసీ కంపెనీలు మైనింగ్ నిర్వహించాయి. రాయి నాణ్యత లేకపోవడం, ఆర్డర్లు లేకపోవడంతో దీర్ఘకాలంగా మైనింగ్ నిలిచిపోయింది. గతంలో మైనింగ్ చేసి నిల్వ ఉంచిన పాత రాయినే ఇప్పుడు రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయమై మైనింగ్ డీడీ శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రస్తుతం మైనింగ్ కు గానీ, రవాణాకు గానీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. పోలీసులు తమ శాఖకు స్వాధీనం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆదాయం పెంపుదిశగా మార్కెటింగ్ విభాగం బలోపేతం

● ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మ



**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడి నిబంధనలకు అనుగుణంగా ఎస్వీబి సి ఛానెల్‌కు మరిన్ని ప్రకటనలు తీసుకురావడం ద్వారా ఆదాయాన్ని పెంచాలని, ఇందుకోసం మార్కెటింగ్ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ సూచించారు. ఛానెల్ ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యక్ష ప్రసారాలు, ఇతర కార్యక్రమాలు, కొత్తగా చేపట్టబోయే కార్యక్రమాల వివరాలను అధికారులు ఛైర్మన్‌కు వివరించారు. గురు వారం సాయంత్రం ఎస్వీబిసి అధికారులతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ సమావేశమయ్యారు. వేంకటేశ్వర భక్తి ఛానెల్ ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే దిశగా ఉద్యోగులు కృషి చేయాలని ఛైర్మన్ బి.ఆర్. నాయుడు సూచించారు. ఎస్వీబిసి సిఇఒ, జెఇఒ డాక్టర్ ఏ. శరత్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ మొదటి మీటింగ్ నాకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందని, మేము ఏదైతే అనుకున్న కొన్ని మౌలిక సదుపాయాలు, పరికరాల బయట నుండి అద్దెకు తెచ్చుకుంటున్నామో అతి త్వరలో వాటిని కొనుగోలు చేసేందుకు అధికారులతో మాట్లాతున్నామన్నారు.. టిటిడికు వివిధ మార్గాలలో ఆదాయం వచ్చేలా మేము త్వరలో దృష్టి పెడతామని, ఎస్వీబీసీకు నిబంధనల ప్రకారం త్వరలో సభ్యులతో సంభాషించి తగిన చర్యలు తీసుకుని లాభదాయకంగా అన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. సామాజిక మాధ్యమం విభాగాన్ని మరింత పటిష్టం చేసి, శ్రీవారి వైభవం, ఉత్సవాల విశిష్టత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, టిటిడి అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవ విశేషాలను నాణ్యంగా ప్రజలకు అందిస్తామన్నారు. ఎస్వీబిసి ఛైర్మన్ బి. శ్రీధర్ వర్మ సమావేశానికి విచ్చేసిన టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడుకి, బోర్డు మెంబర్లకు, డైరెక్టర్లకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 11కేవీ వైరు తగిలి మహిళా రైతు మృతి

**చేజర్ల (నెల్లూరు), సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** చేజర్ల మండలం నాగులవెల్లటూరు గ్రామంలో గురువారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. నిమ్మతోటలో మోటార్ వేసేందుకు వెళ్లిన మహిళా రైతు ముప్పసాని కామాక్షమ్మ తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. మూడు రోజుల క్రితం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయంలో నాగులవెల్లటూరు పరిధిలోని నిమ్మతోటల వైపు వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైరు తెగిపోయి ఉండవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పటి నుంచి గ్రామంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని వారు పేర్కొన్నారు. అయితే తెగిపోయిన వైరు విషయాన్ని సంబంధిత విద్యుత్ సిబ్బంది గుర్తించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం రోజువారీ వ్యవసాయ పనుల్లో భాగంగా కామాక్షమ్మ తన నిమ్మతోటకు వెళ్లారు. తోటలోని మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్తున్న సమయంలో నేలపై తెగిపడి ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు ఆమెకు కనిపించకపోవడంతో దానిని తాకినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. వైరు తగలడంతో కామాక్షమ్మకు ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ ప్రవాహ తీవ్రతకు ఆమె తీవ్రంగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కామాక్షమ్మ మృతిపై ఆమె కుమారుడు బాబు చేజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా సంఘటనపై పరిశీలన జరిపి బాధ్యతకు సంబంధించిన అంశాలను స్పష్టం చేయాల్సి ఉంది. మహిళా రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో నాగులవెల్లటూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సమస్యలు పరిష్కరించకుంటే పార్లమెంట్ మార్చ్ : పెన్షనర్ల హెచ్చరిక




**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తమ సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ 25న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తామని సామూహిక ధర్నా చేస్తామని ఎఫ్‌సిపిఎ నేతలు ఎన్ రామారావు, ఎన్ నాగేశ్వరరావులు హెచ్చరించారు. పెన్షన్ వెరిఫికేషన్/వాలిడేషన్ చట్టం 2025కు వ్యతిరేకంగా మోది ప్రభుత్వం పెన్షనర్లకు చేసిన అన్యాయంకు వ్యతిరేకంగా ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ నేతలు గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వేలు, బ్యాంకులు, బిఎస్‌ఎన్‌ఎల్/ఎంటిఎన్‌ఎల్, ఇన్‌కంటాక్స్, జిఎస్‌టి, పిడబ్ల్యుడి, వాటర్‌వర్క్స్, స్వయం ప్రతిపత్తి సంస్థలకు చెందిన 69 లక్షలపైగా పెన్షనర్ల సమస్యలపై మోదీ ప్రభ/త్వం తగిన విధంగా స్పందించి పరిష్కరించకుంటే పార్లమెంట్‌మార్చ్, సామూహిక ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్, దూరదర్శన్, తదితర సంస్థలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు.

# గణపయ్యకు దుర్గగుడి తరపున పట్టువస్త్రసాల సమర్పణ



**కాణిపాకం, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సిద్ధి, బుద్ధి సమేత స్వామి, అమ్మవార్లకు విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవ స్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం గత కొన్నేళ్ళుగా ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఇంద్ర కీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ), ఈఓ శీనానాయక్, ప్రధాన అర్చకులు దుర్గా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు గురువారం ఉదయం కాణిపాకం ఆలయం చేరుకుని స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామి వారి కి సమర్పించారు. వారికి ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఛైర్మన్, ఈఓ, అర్చకులకు స్వామివారి దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా దుర్గమ్మ దేవస్థానం తరపున కాణిపాకం ఆలయ పాలకమండలి, అధికారులను సత్కరించారు. ఈకార్యక్రమం లో కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, దుర్గగుడి దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో ఉపాసన

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అపోలో చైర్ పర్సన్ ● మొమెంటోతో ఆశీర్వదించిన పీఠాధిపతి

**మంత్రాలయం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త;** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై అపోలో చైర్ పర్సన్, సినీ హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన గురువారం మంత్రాలయంకు విచ్చేశారు. వీరికి శ్రీ మఠం అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ మఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ మఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి శ్రీ మెమోంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.



ఆట

మహిళల వాలీబాల్‌లో ఫిలిప్పీన్స్‌పై

# చైనా విజయం



**నగోయా (జపాన్):** 2026 ఆసియా క్రీడల మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌లోని గ్రూప్ బి లో చైనా తన ప్రత్యర్థి ఫిలిప్పీన్స్‌ను 3-0 తేడాతో ఓడించి తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. టాంగ్ జిన్ మ్యాచ్‌లో అత్యధికంగా 19 పాయింట్లు సాధించగా, జువాంగ్ యుషాన్ 17, వాంగ్ ఆవోకియాన్ 13 పాయింట్లు సాధించారు. దీంతో 72 నిమిషాల్లో జరిగిన పోరులో చైనా 25-18, 25-22, 25-8 తేడాతో విజయం సాధించింది. ఫిలిప్పీన్స్ మొదటి రెండు సెట్లలో గట్టి పోటీ ఇచ్చింది, కానీ చైనా, తమ బ్లాకింగ్, డిఫెన్స్‌ను మెరుగుపరుచుకుని మూడవ సెట్‌లో ఆధిపత్యం చెలాయించింది. గ్రూప్ ఎ మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్ నేపాల్‌ను 3-0 తేడాతో ఓడించింది. గ్రూప్ సి లో కొత్తగా ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన థాయ్‌లాండ్ మంగోలియాను 3-0 తేడాతో చిత్తుగా ఓడించగా, చైనీస్ తైపీ కిర్గిజ్‌స్థాన్‌ను 3-0 తేడాతో ఓడించింది. గ్రూప్ డి లో దక్షిణ కొరియా హాంకాంగ్, చైనాలను 3-0 తేడాతో ఓడించగా, వియత్నాం ఖతార్‌ను 3-0 తేడాతో ఓడించింది. గత నెల జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో థాయ్‌లాండ్ చేతిలో 3-2 తేడాతో ఓడిపోవడం, ఆ ఫలితం కారణంగా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించలేకపోవడంతో, పుంజుకోవాలనే లక్ష్యంతో చైనా ఆసియా క్రీడలలో అడుగుపెట్టింది. గ్రూప్ బిలో భాగంగా శుక్రవారం జరిగే రెండో మ్యాచ్‌లో చైనా తదుపరి కజకిస్తాన్‌తో తలపడనుంది.

చెస్ ఒలింపియాడ్‌లో

# అర్జున్ ఓటమి

భారత్ జట్టు 3-1 గెలుపు



**ఉజ్బెకిస్థాన్:** సమర్‌ఖండ్‌లో జరుగుతున్న 46వ చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ విజయవంతంగా ప్రారంభించింది. కానీ థాయ్‌లాండ్‌పై 3-1 తేడాతో సాధించిన ఈ విజయంలో, ప్రధాన బోర్డులో అర్జున్ ఎరిగైసి అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. స్విస్ లీగ్ ఈవెంట్‌లో చాలా అగ్రశ్రేణి జట్లు, రేటింగ్ ఫేవరెట్లు బలహీన జట్లపై 4-0 తేడాతో విజయాలు సాధించినప్పటికీ, బోట్స్వానా జట్టు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శన చేసింది. వెనుకబడి మ్యాచ్ ప్రారంభించినప్పటికీ, బోట్స్వానా అద్భుతమైన ఆట ఆడి బలమైన బ్రెజిల్ జట్టును 2-2తో నిలువరించింది. అయితే, ఓపెన్ విభాగంలో 2024 విజేతకు 3-1 విజయాన్ని అందించడానికి ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, నిహాల్ సరిన్, విదిత్ గుజరాతీ తమ తమ గేమ్‌లలో గెలిచినప్పటికీ, థాయ్‌లాండ్‌కు చెందిన ప్రిన్ లావవిరపాప్ చేతిలో ఎరిగైసి ఓడిపోవడం అతిపెద్ద సంచలనమైంది. ఆటలో చాలా వరకు ఎరిగైసి మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, చివరిలో జరిగిన ఒక వ్యూహాత్మక తప్పిదం వల్ల లావవిరపాప్ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని, ఒక చిరస్మరణీయ విజయాన్ని దక్కించుకుంది. సమయం తక్కువగా ఉండటంతో అర్జున్ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవడంలో చేసిన పొరపాటుతో 54 ఎత్తుల వరకు రక్షించుకోవడానికి ప్రయత్నించి చివరికి ఓటమిని అంగీకరించాడు. ఇక మహిళల విభాగంలో, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్, డొమినికన్ రిపబ్లిక్‌ను 4-0 తేడాతో ఓడించింది. కోనేరు హంపి, వైశాలి రమేష్‌బాబు, వందిక అగర్వాల్, సవితశ్రీ తమతమ గేమ్‌లలో విజయం సాధించారు.

# వర్షంతో చైనా మ్యాచ్ రద్దు

## మహిళల సెమీస్‌కు బంగ్లాదేశ్.. 20న భారత్, జపాన్ ఢీ

**నిస్షిన్ (జపాన్):** వర్షం కారణంగా చైనా, బంగ్లాదేశ్ మధ్య గురువారం జరగాల్సిన మహిళల మ్యాచ్ రద్దయింది. తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా చైనాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దు కావడంతో, ఆసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలలో బంగ్లాదేశ్ సెమీఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. మ్యాచ్ కొనసాగించడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని నిర్ణయించడంతో నిబంధనల మేరకు తమకున్న ఉన్నత సీడింగ్ కారణంగా బంగ్లాదేశ్ చివరి నాలుగు జట్లలోకి ప్రవేశించింది. నిగర్ సుల్తానా జోటీ నేతృత్వంలోని జట్టు ఐసీసీ మహిళల టీ20ఐ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉండగా, చైనా 36వ స్థానంలో ఉంది. ఈ నెల 20న జరిగే సెమీఫైనల్‌లో, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఆతిథ్య జపాన్ మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ విజేతతో బంగ్లాదేశ్ తలపడుతుంది. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో మహిళల క్రికెట్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలతో పాటు నేరుగా నాకౌట్ దశలోకి ప్రవేశించింది. ఆతిథ్య దేశమైన జపాన్ కూడా





క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం పొందింది. క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ ద్వారా మలేషియా, థాయ్‌లాండ్ మరియు చైనా చివరి ఎనిమిది జట్లలో తమ స్థానాలను దక్కించుకున్నాయి. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీలంక మలేషియాతో తలపడగా, పాకిస్తాన్ థాయ్‌లాండ్‌తో తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌లలో గెలిచిన జట్లు మరో సెమీఫైనల్‌లో తలపడతాయి. ప్రస్తుతం జరుగుతున్న మహిళల క్రికెట్ పోటీ టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది.

ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 17 నుండి 22 వరకు జరుగుతుండగా, పురుషుల పోటీ సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 1 వరకు జరగనుంది. క్రికెట్ ఆసియా క్రీడలలో నాలుగవసారి పాల్గొంటోంది. ఇది గతంలో గ్వాంగ్‌జౌ 2010, ఇంచియాన్ 2014 మరియు హాంగ్‌జౌ 2023లలో చోటు దక్కించుకుంది. హాంగ్‌జౌలో జరిగిన క్రీడలలో భారత్ పురుషుల, మహిళల విభాగాలలో స్వర్ణ పతకాలు గెలుచుకుంది. 1900 సంవత్సరం తర్వాత క్రికెట్ తొలిసారిగా ఒలింపిక్స్‌లో అడుగుపెట్టనున్న లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్ క్రీడలకు సిద్ధమవుతున్న తరుణంలోనే ఆసియా క్రీడల పోటీలు కూడా జరుగుతున్నాయి.




# నేడు వన్డేకు వర్షం ముప్పు

## ఆస్ట్రేలియాతో భారత్ ఢీ

**రాజ్‌కోట్:** గుజరాత్‌లోని నిరంజన్ షా స్టేడియంలో శుక్రవారం భారత్ అండర్19, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న తొలి యూత్ వన్డేకు భారీ వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ఒకవేళ ఆట సాధ్యమైతే, లక్ష్య రైచందానీ కెప్టెన్‌గా, యశ్‌బర్ధన్ సింగ్ చౌహాన్ డిప్యూటీగా భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ప్రారంభిస్తుంది. ఈ జట్టులో ఇటీవలి శ్రీలంక పర్యటన నుండి తిరిగి వచ్చిన ఆటగాళ్లు, అలాగే తొలిసారి అవకాశం పొందుతున్న వాళ్లు ఉన్నారు. ఈ సిరీస్‌కు నాయకత్వం వహించడానికి ముందు రైచందానీ శ్రీలంకలో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ కూడా ఆడాడు. శ్రీలంకలో భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన చౌహాన్, ఇప్పుడు అతనికి డిప్యూటీగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడైన అన్వే, శ్రీలంకలో ఇండియా అండర్19 తరపున అరంగేట్రం చేసి, మరో అవకాశం కోసం తిరిగి వస్తుండగా, భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడైన ఆర్యవీర్, తొలిసారిగా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ ఢిల్లీ బ్యాటర్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా ఆడాడు. వీరితో పాటు, శ్రీలంక పర్యటన బృందంలోని సభ్యులైన కుశాగ్ర ఓఝా, ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్, అర్జున్ రాజ్‌పుత్ ఆల్‌రౌండర్‌గా తిరిగి జట్టులోకి వచ్చాడు. మరో ఎడమచేతి వాటం బ్యాటర్ మనల్ చౌహాన్. వి.కె. వినీత్, షవిన్ వినోద్ ఆల్‌రౌండర్లుగా, వి. యశ్‌వీర్, మోహిత్ ఉల్వా బౌలింగ్‌ను బలోపేతం చేస్తారు. రోహిత్ యాదవ్ స్థానంలో సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ ఆర్యన్ సవ్సాని జట్టులోకి తాజాగా చేరాడు.

ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో

# సెమీఫైనల్‌కు పాకిస్థాన్

## థాయిలాండ్ ఓటమి

**నిస్షిన్:** కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో వర్షం కారణంగా గురువారం కుదించబడిన క్వార్టర్ ఫైనల్‌లో థాయిలాండ్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్ 2026 ఆసియా క్రీడల మహిళల క్రికెట్ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. మ్యాచ్‌ను ఇరు జట్లకు 11 ఓవర్లకు తగ్గించడంతో మొదట బ్యాటింగ్ చేసిన థాయిలాండ్ 91/4 స్కోరును నమోదు చేసింది. నన్నపత్ కొంచరోంకై (49) టాప్ స్కోరర్‌గా నిలవగా, పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా రెండు వికెట్లు తీసింది. గుల్ ఫిరోజా, షవాల్ జుల్ఫికార్ తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం





నెలకొల్పడంతో పాకిస్థాన్ ఛేజింగ్‌ను సానుకూలంగా ప్రారంభించింది. అయితే, ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైన తర్వాత థాయ్‌లాండ్ పుంజుకుంది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరిగింది. తర్వాత ఫాతిమా (21) ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. పాకిస్థాన్‌కు ఇంకా 17 బంతుల్లో 19 పరుగులు అవసరమైన సమయంలో, ఆమె తొమ్మిదో ఓవర్ మొదటి బంతికే అవుటయ్యింది. ఫాతిమా అవుటైన తర్వాత థాయ్‌లాండ్‌కు ఒక అవకాశం లభించింది. కానీ టుబా హసన్ ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి మ్యాచ్ గమనాన్ని తిరిగి పాకిస్థాన్ వైపు మళ్లించింది. ఆమె (13) 10వ ఓవర్ చివరి బంతికి అవుటయ్యింది. పాకిస్థాన్‌కు చివరి ఓవర్‌లో 3 వికెట్ల తేడాతో నాలుగు పరుగులు అవసరమయ్యాయి. ఉమ్మెహాని తన సంయమనాన్ని కోల్పోకుండా నాలుగో బంతికి విజయపు పరుగులు సాధించి ఛేజింగ్‌ను పూర్తి చేసింది.


# గ్లోబల్ మార్కెట్లకు ఫెడ్ చైర్మన్‌షాక్

## 25 బేసిస్ పాయింట్లు ఫండ్‌రేట్ పెంపు



**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఊహించని నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తొలిసారిగా కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో బెంచ్ మార్క్ వడ్డీ రేట్లు 3.75 శాతం నుంచి 4 శాతానికి చేరాయి. గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన వడ్డీ రేట్లకు ఒక్కసారిగా బ్రేక్‌వేసి, మళ్లీ పెంచే దిశగా అడుగులు వేయడం ఆర్థిక వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమెరికాలో సగటు మనిషిని పిండేస్తున్న ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోవడమే ఈ నిర్ణయానికి ముఖ్య కారణం. ఫెడ్ లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని 2శాతానికి పరిమితం చేయడమే అయినప్పటికీ, జులైలో 3.7 శాతంగా నమోదు కాగా, ఆగస్టులో మళ్లీ పెరిగి రికార్డు స్థాయికి చేరింది. దీనికి తోడు మిడిల్ ఈస్ట్‌లో జరుగుతున్న యుద్ధ మేఘాల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 దాటిపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. కేవలం సరఫరా వ్యవస్థలో లోపాల వల్లే ధరలు పెరుగుతున్నాయనే పాత భావనను పక్కనపెట్టి, ఆర్థిక వ్యవస్థలోనే అంతర్లీనంగా ధరల మంట ఉందనే విషయాన్ని ఫెడ్ గుర్తించింది. సాధారణంగా వడ్డీ రేట్లు పెంచితే ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుందనే భయం ఉంటుంది. కానీ, అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం చాటిచెబుతున్న స్థిరత్వమే ఫెడ్‌కు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. నిరుద్యోగిత రేటు కేవలం 4.1 శాతంగానే ఉండటంతో పాటు, రాబోయే సంవత్సరాల్లో జీడీపీ వృద్ధి రేటు 2.3 నుంచి 2.4 శాతంగా నమోదు కావచ్చని అంచనాలు వేస్తున్నారు. మార్కెట్ ఇంకా బలంగానేఉంది కాబట్టి, వడ్డీరేట్లు పెంచినా తట్టుకోగలదనే నమ్మకంతోనే పాలసీ మేకర్స్ ఈ కఠిన నిర్ణయానికి ఓటేశారు. మే నెల చివరిలో ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కెవిన్ వార్ష్ హయాంలో తీసుకున్న తొలి వడ్డీ రేట్ల నిర్ణయం ఇదే కావడం విశేషం. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వడ్డీ రేట్లు తగ్గించాలని బహిరంగంగానే కోరుతూ, ఆ భావాలున్న వర్ష్‌ను ఈ పదవిలో కూర్చోబెట్టినా అధ్యక్షుడి ఆశయాలకు భిన్నంగా వర్ష్ నేతృత్వంలోని ఫెడ్ బోర్డు ఏకగ్రీవంగా రేట్లను పెంచడానికే మొగ్గుచూపింది. ఆ మధ్య జరిగిన జాక్సన్ హోల్ సమావేశంలోనే వర్ష్ మాట్లాడూ ధరల మంట పూర్తిగా చల్లారే వరకు కఠిన నిర్ణయాల నుంచి

## ఎన్‌ఎస్‌ఇ, హీరోమోటార్స్ ఐపిఒలకు భారీ స్పందన




**ముంబై, సెప్టెంబర్ 17:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ఐపిఒకు తొలిరోజు ఇన్వెస్టర్ల నుంచి స్పందన లభించింది. గురువారం ఎన్‌ఎస్‌ఇ ఐపిఒలో మొత్తం 3,67,69,784 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 8,86,42,911 షేర్లతో పోలిస్తే 0.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ బిడ్డింగ్ గురువారం ప్రారంభమై, సెప్టెంబర్ 21న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,700-రూ.1,785గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 8 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. జిందాల్ సుప్రీమ్ ఇండియా ఐపిఒకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. తొలిరోజు 29,52,88,651 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 93,99,600 షేర్లకు ఇది 31.42 రెట్ల సబ్‌స్క్రిప్షన్. ఈ ఐపిఒ 18న బిడ్డింగ్ ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.88-రూ.93గా ఉంది. కనీసం 161 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయాలి.హీరో మోటార్స్ ఐపిఒకు కూడా భారీ స్పందన వచ్చింది. 29,75,98,378 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఆఫర్‌లో ఉన్న 8,86,07,596 షేర్లతో పోలిస్తే 3.36 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.హీరో మోటార్స్ ఐపిఒ ఈనెల 18న ముగియనుంది. ఐపిఒ ధరల శ్రేణిని రూ.79-రూ.84గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 178 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.ఎస్‌ఎస్ రిటైల్ ఐపిఒకు 5.76 రెట్ల సబ్‌స్క్రిప్షన్ కూడా ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. తొలిరోజు సాయంత్రానికి 5,06,85,075 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 87,93,884 షేర్లకుగాను 5.76 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

ఈ ఐపిఒ 18న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.403-రూ.424గా ఉంది. కనీసం 35 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.సోనాసెలెక్షన్ ఇండియా ఐపిఒకు 46,63,800 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 1,00,10,000 షేర్లతో పోలిస్తే 0.47 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.ఈ ఐపిఒ బిడ్డింగ్ 21న ముగియనుంది. ఐపీఒ ధరల శ్రేణిని రూ.94-రూ.99గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 150 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.

# టాటాసన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్

## మరో ఐదేళ్లు పదవీకాలం పొడిగింపు



**ముంబయి, సెప్టెంబరు 17:** టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడే కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీ కాలం ఇవ్వడంతో పాటు కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు ప్రతిపాదనలను టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు సమాచారం. టాటా ట్రస్ట్స్ తరఫున బోర్డులో నోయెల్ టాటాకు వీటో హక్కు ఉంది. చంద్రశేఖరన్ కొనసాగింపుతో పాటు లిస్టింగ్ ప్రతిపాదనపై ఆయన అసమ్మతి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఇతర బోర్డు సభ్యుల మద్దతుతో ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. టాటా సన్స్ లిస్టింగ్ అంశం కొంతకాలంగా పెండింగ్‌లోఉంది. ఆర్‌బిఐ తాజాగా కంపెనీ లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. 2022లో టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ ఎన్‌బిఎఫ్‌సిగా ఆర్‌బిఐ గుర్తించింది. దీంతో మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సిన నిబంధన ఏర్పడింది. చంద్రశేఖరన్ 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

2022లో ఆయనకు రెండోసారి ఐదేళ్ల పదవీకాలం లభించింది. అది 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే మరోసారి బాధ్యతలు చేపట్టబోనని ఆయన ఈ యేడాది ఆగస్టులో బోర్డుకు తెలియజేశారు. టాటా గ్రూప్‌లో వ్యాపారాల పనితీరు, మూలధన కేటాయింపుపై నోయెల్ టాటా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఎయిరిండియా, టాటా డిజిటల్ అంశాలు చర్చకు వచ్చాయి. దీంతో చంద్రశేఖరన్ వారసుడి ఎంపికపై టాటా ట్రస్ట్స్ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడు బోర్డు నిర్ణయంతో ఆ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఆగస్టులో జరిగిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం కూడా అనూహ్యంగా వాయిదా పడింది. తగినంత కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

టాటా సన్స్ చరిత్రలో ఇలాంటి ఘటన ఇదే తొలిసారి. సర్ రతన్ టాటా ట్రస్ట్‌కు సంబంధించిన పరిమితులు ఈ పరిణామానికి కారణమయ్యాయని సమాచారం. చంద్రశేఖరన్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం లభించిన వెంటనే టాటా గ్రూప్‌కు చెందిన పలు షేర్లు మార్కెట్లో దూసుకెళ్లాయి. ఐదేళ్ల పాటు ఆయన ఛైర్మన్‌గా కొనసాగనున్నారన్న నిర్ణయాన్ని మార్కెట్ వర్గాలు కీలక పరిణామంగా పరిగణిస్తున్నాయి. ఓపక్క ఆర్బీఐతో వివాదాలు నడుస్తున్న తరుణంలో చంద్రశేఖరన్ పదవీకాలాన్ని మరో ఐదేళ్లు పొడిగించడంతో నోయెల్ టాటాకు షాక్ తగిలినట్లయింది. చంద్రశేఖరన్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం లభించడం టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై చర్చను మరింత కీలకంగా మార్చింది.




## చమురు ఉత్పత్తుల ఎగుమతులపై విండ్‌ఫాల్‌ట్యాక్స్ తగ్గింపు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా క్రూడాయిల్ ధర క్రమంగా పెరుగుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. కొత్త పన్ను రేట్లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈ రేట్లు తదుపరి పక్షం రోజుల పాటు కొనసాగనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రతి రెండు వారాలకు ఒకసారి విండ్‌ఫాల్ పన్ను రేట్లను సమీక్షిస్తూ ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వ నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై గతంలో లీటరుకు రూ.25గా ఉన్న విండ్‌ఫాల్ పన్నును రూ.20కి తగ్గించారు. అంటే లీటరుకు రూ.5 మేర పన్ను తగ్గింది. అదే సమయంలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.19 నుంచి రూ.15కు తగ్గించారు. ఎటిఎఫ్‌పై లీటరుకు రూ.4 మేర పన్ను తగ్గింది.

# ఫెడ్ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అప్రమత్తం

## స్వల్పలాభాలకే పరిమితమైన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబై, సెప్టెంబర్ 17:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా వడ్డీ నిర్ణయం, ప్రపంచవ్యాప్తంగా లిక్విడిటీపై దాని ప్రభావాలను ఇన్వెస్టర్లు అంచనా వేస్తుండటంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప మార్పులతో ముగిసాయి. కీలక ఈక్విటీ సూచీలు పరిమిత లాభనష్టాలతో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 3.754 శాతం పరిధికి చేర్చింది. 2023 తర్వాత ఫెడ్ వడ్డీ రేటును పెంచడం ఇదే తొలిసారి. ఈ యేడాది మరోసారి వడ్డీ రేటు పెంపు అవకాశం ఉందని ఫెడ్ అంచనాలు సూచించడంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కొనసాగింది. 2026లో మరో వడ్డీ పెంపు ఉండొచ్చన్న ఫెడ్ సంకేతాలతో ముఖ్యంగా వడ్డీ రేట్ల ప్రభావానికి లోనయ్యే రంగాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై ఆధారపడే విభాగాల్లో జాగ్రత్త ధోరణి కనిపించింది. అమెరికాలో అధిక వడ్డీ రేట్ల వాతావరణం డాలర్‌కు మద్దతునివ్వడంతో విదేశీ కరెన్సీలపై ఒత్తిడి కొనసాగింది.సెన్సెక్స్ 21.86 పాయింట్లు తగ్గి 74,314.59 వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 53 పాయింట్లు లాభపడి 23,270.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్ 2.51 శాతం, టాటా స్టీల్ 2.34 శాతం, ఎటర్నల్ 1.69 శాతం చొప్పున లాభపడి ప్రధాన షేర్లుగా నిలిచాయి. ముడి చమురు ధరలు మార్కెట్లకు కొంత ఉపశమనాన్ని అందించాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 104 డాలర్ల దిగువకు జారింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ రూ.22,561.5 కోట్ల ఐపిఒ గురువారం సబ్‌స్క్రిప్షన్‌కు ప్రారంభమైంది. ఈ ఇష్యూ పూర్తిగా ప్రస్తుత వాటాదారుల ఆఫర్ ఫర్ సేల్ ద్వారా జరుగుతోంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.1,700 1,785గా నిర్ణయించారు. ఐపిఒ సెప్టెంబర్ 21, 2026 వరకు కొనసాగనుంది. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.07 శాతం లాభపడగా, బిఎస్‌ఇ250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.13 శాతం నష్టపోయింది. బిఎస్‌ఇలో మొత్తం 2,686 షేర్లు లాభాల్లో, 1,642 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 217 షేర్లలో ఎలాంటి మార్పు కనిపించలేదు. నవంబర్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్‌ధర 2.34 డాలరు తగ్గి బ్యారెల్‌కు 103.49 డాలర్లకు చేరింది. అమెరికా 10 యేళ్ల ట్రెజరీ బాండ్ యీల్డ్ 0.38 శాతం తగ్గి 4.985 శాతానికి చేరింది.భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ యీల్డ్ గత సెషన్ ముగింపు 7.055 శాతంతో పోలిస్తే 0.13 శాతం పెరిగి 7.064 శాతానికి చేరింది. రూపాయి గత సెషన్ ముగింపు 95.9100తో పోలిస్తే స్వల్ప మార్పుతో 95.9300 వద్ద కొనసాగింది.2026 అక్టోబర్ 5 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.49 శాతం తగ్గి 10గ్రాములకు రూ.1,51,724 వద్ద నమోదైంది. పవర్ ఎలక్ట్రానిక్స్ 10.70 శాతం దూసుకెళ్లింది.ఎమామి 2.33 శాతం పెరిగి రూ.377.90కి చేరింది. టాటా మోటార్స్ 2.88 శాతం లాభపడింది.ప్రెసిషన్ వైర్స్ ఇండియా 2.57 శాతం పెరిగింది. నియోజెన్ కెమికల్స్ 3.37 శాతం దూసుకెళ్లింది. మిడ్‌క్యాప్ విభాగంలో సిర్మా ఎస్‌జిఎస్ టెక్నాలజీ 6.94 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

18 -9Pg9th cheli:18 -9Pg9th cheli.qxd 9/17/2026 11:13 PM Page 1



# నాచుతో అందంగా !



అందంగా కనిపించాలని ఎవరికి ఉండదు. అందుకోసం చాలా ఉత్పత్తులే వాడతా కదా! అయితే, చర్మ సంరక్షణకు వాడే ఔషధాల జాబితాలోకి ఈసారి ఆల్గే చేరడమే కాదు, ట్రెండ్‌గానూ మారింది. ఇంతకీ ఇది మేలు చేసేనా?

నాచు అంటే వర్షాకాలంలో ఇంటి చుట్టు పక్కల చేరేది అనుకునేరు! దీన్ని ప్రత్యేకంగా సముద్రాలు, నదుల నుంచి సేకరిస్తారు. ఇది కొన్ని దేశాల్లో ఆహారం కూడా. దీనిలోని పాలీశాకరైడ్లు చర్మంలో తేమను బంధించి ఉంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్‌నీ దరిచేరనీయవు. వాతావరనంలో మార్పులు, కలుష్యం కారణంగా ఏర్పడే హాని నుంచి రక్షిస్తాయి. అందుకే బ్యూటీ ఉత్పత్తుల్లో నాచుకి చోటిస్తున్నారు. దీనిలోని అమైనో యాసిడ్లు, పాలీశాకరైడ్లు, పాలీఫినాల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్ని త్వరగా దరి చేరనీయవు. ఎన్నో పరిశోధనలూ దీన్ని రుజువు చేస్తున్నాయి. వీగన్.. ఇప్పుడు చాలామంది బ్యూటీ ఉత్పత్తుల్లో చూస్తున్నది ఇదే! ఆల్గేని వృక్షజాతుల కిందే లెక్కేస్తారు కాబట్టి, ధైర్యంగా వాడొచ్చంటారు నిపుణులు. సీరమ్, మాయిశ్చరైజర్లలో దేన్నైనా నాచుతో తయారు చేస్తే ప్రయత్నించచమంటున్నారు. వారానికోసారి దీంతో తయారు చేసిన మాస్క్‌ని వేసుకున్నా ప్రయోజనమేనట. నిజానికి మన వాడే చాలారకాల యాంటీ పిగ్మెంటేషన్, యాంటీ యాక్నే ఉత్పత్తుల్లో చాలావరకూ ఆల్గే ప్యాక్‌ల పేరుతో ఆన్‌లైన్ వేదికల్లో ట్రెండ్ అవుతున్నాయి. నాచులోని విటమిన్లు, మినరల్స్ చర్మానికి మేలు చేస్తాయన్నది వాస్తవమే. టాక్సిన్లు, మలినాలను తొలగించి చర్మకణాల పునుద్ధరణకూ తొడ్పడతాయి. అయితే కొందరిలో ఇవి దురద, దద్దుర్లకు దారితీస్తాయి. కాబట్టి, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదదండీ సంగతి. మీరూ ప్రయత్నిస్తారా ఈ ఆల్గే ట్రెండ్? □

# వంటకు ఏ నూనె మేలు..



ఆరోగ్యంగా ఉండాలని మార్కెట్‌లోకి వచ్చిన అన్ని రకాల నూనెలను వాడేస్తుంటారు. కాని ఏది మేలు చేస్తుంది అనేది తెలియదు. మరి ఏది మంచిదో తెలుసుకుందామా..

**వేరు శెనగ..** దీంట్లో విటమిన్ ఇ, మోనో శాచురేటెడ్, ఒమేగా 6 యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. కంటిచూపునూ రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది.

**నువ్వుల నూనె..** ఇతర వాటితో పోలిస్తే ఇది ఆహారం సులువుగా జీర్ణం కావడానికి సాయపడుతుంది. ఇందులో ఫ్యాటీయాసిడ్లు ఎక్కువ. దీనిలోని యాటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కీళ్ల, వంటి నొప్పులను తగ్గిస్తాయి.

**సన్ ఫ్లవర్ నూనె ..** దీనిలో శాచురేటెడ్ ఫ్యాటీయాసిడ్లు తక్కువ. మోనోశాచ్చురేటెడ్, పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వులు చాలా ఎక్కువ. కాబట్టి ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దీంట్లో ఉండే యాసిడ్లు రక్తంలో కొవ్వు తగ్గేందుకు తోడ్పడతాయి.

**ఆవ నూనె..** ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. దీంట్లో ఒమేగా 3 ఫ్యాటీయాసిడ్లు ఉంటాయి. కాలేయం చుట్టూ కొవ్వు ఏర్పడకుండా చేస్తుంది. ఇది చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. □

# ఏది ముద్దు వద్దు



'ఈ అమ్మాయిలు షాపింగ్ చేస్తూ రోజంతా గడిపేయగలరు' గంటలకొద్దీ నడిచినా నీరసమే రాపమిటో ... మన గురించి ఇలాంటివి చాలాసార్లే వింటాం కదూ! అయినా పట్టించుకుంటామా ఏంటి? స్నేహితులు, కజిన్స్ ఎవరు పిలిచినా సరేననేస్తాం. నిజానికి ఇది అమ్మాయిలకు ఒత్తిడి పోగొట్టుకునే మార్గం.అయితే ఇప్పుడు చాలామంది తీరు మారింది. మనసు బాగాలేకపోతే ఆన్‌లైన్‌లో వెదికేస్తున్నారు. అదే ఆనందం తిరగాల్సిన పని లేకుండా దొరుకుతు న్నప్పుడు తప్పేముంది? పైగా చాలా సమయమూ కలిసొస్తుంది. అనేస్తున్నారు. నిజానికి అది మంచి తీరేనా? మామూలు షాపింగ్ అయితే ప్రయాణం,ట్రాఫిక్ ఇబ్బందులు, ట్రయల్ రూమ్ వద్ద వేచి ఉండటం... ఇలాంటి తిప్పలెన్నో! ఆన్‌లైన్‌లో కొంటే షాపింగ్ తేలిగ్గా పూర్తవుతుంది. ఆనందాన్నిచ్చే డోపమైన్ అదే స్థాయిలో విడుదలవుతుంది. అలాంటప్పుడు ఇదే మేలు అనుకుం టున్నాం కానీ...శరీరాన్ని బద్ధకంగా తయారు చేస్తున్నాం. ముఖ్యంగా షాప్‌ని కనుక్కోవడం, అమ్మేవారితో మాట్లాడటం సహా ఎన్నో సోషల్ స్కిల్స్‌ని మర్చి పోతున్నాం. ఎంత లావుగా ఉందో చూడు... తన రంగుకి ఈ దుస్తులు నప్పలేదు... ఎంత చీప్‌వి ఎంచుకుంటోందో.. పక్కనుంచి ఇలాంటి గుసగుసలు వినిపిస్తోంటే ఎంత ఇబ్బంది? ఆత్మ విశ్వాసం కోల్పోతాం. మన గురించి ఎవరేమనుకుంటున్నారో అన్న ఆందోళన అన్నీ వెరసి కూడా చాలామంది ఆన్‌లైన్‌లో బాట పడుతున్నారు. కానీ ఇది తప్పించుకోవడమే. వాటిని ఎదుర్కొంటేనే బయటపడటం సాధ్యం. నేరుగా కొనేటప్పుడు చూడండి ప్రతిదీ పట్టుకుని చూస్తాం. ఒంటి మీద పెట్టుకుని ప్రయత్నించాం. తోడుగా ఉన్నవాళ్ల సలహాలూ కొత్త పరిజ్ఞానాన్ని ఇస్తాయి. పైగా ఎంత పెడుతున్నామన్న స్పృహ ఉంటుంది. ముఖ్యంగా ఖర్చు అంచనా వేసుకుని బేరాలాడతాం. దీంతో ఖర్చు అదుపులో ఉంటుంది. అదే ఆన్‌లైన్‌లో అయితే చకచకా కార్ట్‌లోకి కొట్టడమే... చేతిలో బరువుండదు కదా మోయడానికి డిస్కౌంట్, రంగు నచ్చాయంటూ కొనేస్తాం. తీరా అకౌంట్ ఖాళీ అయ్యాక అనవసరంగా కొన్నానే అని బాధపడతాం. అదీ ఇబ్బందే! ఆనెలైన్ కొనుగోళ్లు కనిపిస్తున్నాయి. ఎక్కువ శ్రమ అవసరం ఉండదు. కానీ దీనిమీద అతిగా ఆధార పడొద్దు. ఇది ప్రపంచానికీ, మానవ సంబంధాలకీ దూరం చేస్తుంది. తప్పనిసరి అయితే తప్ప బయట అడుగుపెట్టడానికే మొగ్గు చూపండి. పోలికలు, కామెంట్లకు భయపడి ఇంట్లో ఉండటమూ మానసిక సమస్యలకు చిహ్నలే. వాటి బారిన పడొద్దన్నా కొను విషయంలో బ్యాలెన్సింగ్ కావాల్సిందే. ఈసారి నుంచి గమనించుకుంటారా మరి? □

# పార్వతీదేవి శాపం

**పార్వతీదేవి వివాహం** చేసుకున్న తర్వాత శంకరుడు నూరు దివ్య సంవత్సరాలు దాంపత్య సుఖం అనుభవించాడు. అయినా వారికి సంతానం కలగలేదు. ఒకరోజు బ్రహ్మాది దేవతలు శివుని సమీపించి మీ తేజ ప్రభావంతో కలిగే పుత్రుణ్ణి లోకాలు భరించలేవు. అందువల్ల సంతాన యోచన విరమించి మీరిద్దరూ తపస్సు చేస్తేనే ముల్లోకాలు క్షేమంగా ఉంటాయి. ఆ తేజస్సును మీలోనే నిలిపి లోకాలను కాపాడండి అని ప్రార్థిం చారు. మహేశ్వరుడు ఇకపై నిలువరిస్తాం సరే.. కానీ ఇప్పటికే స్వస్థానం నుంచి కదలిన తేజస్సును ఎవరు భరిస్తారు? అనడిగాడు. భూదేవి మాత్రమే భరించగలదన్నారు దేవతలు. పరమేశ్వరుడి తేజస్సు పర్వతాలు. వనులతో నిండిన భూమి మీద వ్యాపించింది. అగ్ని, వాయు దేవుళ్లను కూడా శివ తేజస్సును భరించమని దేవతలు ఆజ్ఞాపించారు. దాంతో అగ్నితో కూడిన శివ తేజస్సు శ్వేత పర్వతమైంది. అక్కడ అగ్ని, సూర్యుల తేజస్సుతో సమానమైన తేజస్సు గల రెల్లు గడ్డి ఏర్పడింది. అక్కడే కుమారస్వామి జన్మించాడు. కృత్తికలు పాలిచ్చి పెంచడం వల్ల కార్తికేయుడిగా, అగ్ని ధరించడం వల్ల అగ్ని సంభవుడుగా ప్రసిద్ధి చెందాడు శివనందనుడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీ దేవి దేవతల మీద కోపించింది. నా భర్తతో పుత్రుని పొందా లన్న కోరిక తీరనివ్వలేదు. కనుక మీకు భార్యలతో సంతానం కలగదు. వాళ్ల సంతానవతులు కాలేరు అంటూ ఆగ్రహం తో శపించింది. భూదేవి నుద్దేశించి నువ్వు చౌడునేల లాంటి రూపాలు పొందుతావు. ఎందరో రాజులకు భార్యవై, వాళ్ల పాలనలో ఉంటావు. నీక్కూడా సంతాన సుఖం ఉండదు అని శపించింది. అది మొదలు దేవతలు, భూదేవి సంతానభాగ్యం కోల్పోయారు. □

# ఓట్స్ వడలు



**ఓట్స్‌తో చేసే మసాలా వడలు పిల్లలు చాలా ఇష్టపడతారు. నేను చేస్తే మెత్తగా వచ్చాయి. కరకలాడుతూ మరింత రుచిగా ఉండేందుకు కొన్ని చిట్కాలు తెలుసుకుందాం.**

మన తెలుగు వారి ఇళ్లల్లో తరచూ చేసే మసాలా వడల్లా ఉత్తరాదివాళ్లు ఓట్స్ మసాలా వడ చేస్తారు. ఇవి తక్కువ నూనె పీలుస్తాయి. కనుక ఆరోగ్యానికి మంచిది. శనగపప్పును ఎక్కువగా నానబెట్టకూడదు. రెండు గంటలు నానితే 80% నాని, మిగిలింది పలుకుగా ఉంటుంది. అలా ఉంటేనే వడలు కరకరలాడ తాయి. పప్పును బరకగా రుబ్బి.. అందులో ఓట్స్, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి తరుగు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఎక్కువ నీళ్ల పోయకుండా.. అవసరం మేరకు చెంచాతో కొద్ది కొద్దిగా పోస్తూ..పిండిని గట్టిగా కలపాలి. వడలు సరిగా రాకుండా.. పొడిపొడిగా అయిపోతుంటే ఇంకొన్ని నీళ్లు పోయండి. ముందు హైఫ్లేమ్ మీద నూనెను కాగనివ్వాలి. సలసలా కాగిన తర్వాత.. వడలు వేసి మంటను కాస్త తగ్గించి..ఎర్రగా వేయించాలి. ఇలా చేసేనత బయట కరకరలాడుతూప లోపల చక్కగా ఉడికి.. ఎంతో రుచిగా ఉంటాయి. □

# ఆధునికతకు దూరంగా..




సాధారణ కాన్పు లేదా సిజేరియన్... ఏ విధానం ద్వారా జన్మనిచ్చిన బిడ్డపై అమ్మ ప్రేమ మారదు. కానీ... మారిన జీవనశైలి, రకరకాల అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు కో కాన్పులు ఎక్కువయ్యాయి. అయితే, ఈ ఆధునిక ప్రసూతి సాంకేతికత విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నాయి మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ తాజా అధ్యయనాలు, సహజకాను శిశువు, తల్లి గర్భాశయ ముఖద్వారం నుండి బయటకు రావటం వల్ల ఈ మైక్రోబ్స్కు ఎక్స్ అవుతుంది. కానీ, ఈ ఆధునిక విధానాల్లో యాంటీబయాటిక్స్ ఉపయోగించటం, సీ సెక్షన్ ప్రసవాలు చేయడం వల్ల తల్లులు, నవజాత శిశువుల్లో మైక్రోబయోమ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ మైక్రోబ్స్ లేదా మైక్రో ఆర్గానిజమ్స్ శిశువుల ఎదుగుదలనూ ప్రభావితం చేయగలవట. ప్రత్యేకించి ఒత్తిడి, సామాజిక ప్రవర్తనతోపాటు ముఖ్యమైన శరీర విధులను నియంత్రించే మెదడు ప్రాంత ఎదుగుదలపై సానుకూల ప్రభావం చూపిస్తాయట. నిజానికి ఈ సూక్ష్మజీవులు శిశువు పుట్టి తర్వాత నుంచే కాదు, గర్భంలో ఉన్నప్పటినుంచే మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయట. కాబట్టి, శిశువు ఆరోగ్యకర ఎదుగుదలకు ఇవి కీలకమనీ, సాధ్యమైనంత మేర ఆధునిక ప్రసవ పద్ధతులకు దూరంగా ఉండాలనీ చెబుతున్నారు. □

తెర

# ఆడియెన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే 'సీక్రెట్ సోల్జర్'

**అక్కి విశ్వనాథ్‌రెడ్డి**



సీక్రెట్ సోల్జర్ కంటెంట్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. కచ్చితంగా సినిమా ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుంది: డైరెక్టర్ అక్కి విశ్వనాథ్ రెడ్డి నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన యూనిక్ స్పై డ్రామా"సీక్రెట్ సోల్జర్". మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

చైనా పీస్.. "సీక్రెట్ సోల్జర్" గా ఎలా మారింది? సినిమాలో ఒక క్యారెక్టర్‌ని ఉద్దేశించి ఆ టైటిల్ పెట్టాను. కాకపోతే అది కాస్త పొలిటికల్ అయింది. చైనాగల్వాన్ యుద్ధం రావడంతో మరింత పొలిటికల్ అయింది. ఇందులో ఎవరినీ తప్పుపట్టడానికి లేదు. అప్పుడు కాస్త ఉద్రిక్త పరిస్థితులు ఉండేవి. నేను చైనాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేశాను.

సెన్సార్ విషయంలో ఎలాంటి అనుభవం ఎదురైంది?

సినిమా సబ్జెక్ట్ మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. అది కూడా సెన్సార్ వల్లే మాకు ఆ కాన్ఫిడెన్స్ వచ్చింది. చాలా డీటెయిల్‌గా ఈ సినిమాని సెన్సార్ చేశారు. ఈ ప్రయాణంలో మానసికంగా చాలా ఒత్తిడి ఉండేది. ఈ సినిమాలో చూపించిన చాలా ఎలిమెంట్స్ చాలా బిలీవబుల్‌గా ఉన్నాయని, అవన్నీ ఎక్స్‌పర్ట్స్‌కి చూపించాలని వాళ్లు చెప్పారు. అంతా క్లియర్ అయిన తర్వాత సెన్సార్ క్లియరెన్స్ ఇచ్చారు.

"సీక్రెట్ సోల్జర్" కథ ఎక్కడ మొదలవుతుంది?

ఈ కథ నెల్లూరు బ్యాక్‌డ్రాప్‌లో మొదలవుతుంది. నేను నెల్లూరులో చదివాను. అక్కడ రిలేటబుల్‌గా ఉండే క్యారెక్టర్స్‌ని డిజైన్ చేశాను. ఇప్పటివరకు నేను చూసిన ఆడియన్స్ చాలా అద్భుతంగా ఫీల్ అయ్యారు. ముఖ్యంగా సెకండ్ హాఫ్ చాలా థ్రిల్లింగ్‌గా అనిపించిందని చెప్పారు.

కథలో ప్రధానంగా ఏ అంశాలు ఉంటాయి?

ఈ కథకి వెన్నెముక ఫ్రెండ్‌షిప్. దాని చుట్టూ ఉంటాయి.

# 'సిగ్మా' మంచి ఫన్‌రైడ్

"సిగ్మా : ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ "సిగ్మా మంచి ఫన్ రైడ్‌లా ఉంటుంది. నాన్నగారు సినిమా కోసం ఎదురుచూస్తున్నారు: డైరెక్టర్ జేసన్ సంజయ్ సందీప్ కిషన్ క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం సిగ్మా. దర్శకుడిగా జేసన్ సంజయ్ డెబ్యూ చేస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని కోస్తాంధ్ర, తెలంగాణలో విడుదల చేయనుండగా, ఎన్‌వీఆర్ సినిమా సీడెడ్‌లో రిలీజ్ చేస్తోంది. సిగ్మా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.



**హీరో సందీప్ కిషన్**

ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాతో సంజయ్‌ని తెలుగు సినిమాలకి పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉంది. తను చాలా మంచి కుర్రాడు. తన విషయంలో నాకు చాలా గర్వంగా ఉంటుంది

దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది నా ఫస్ట్ సినిమా. అక్టోబర్ 2న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమాలో చాలా ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి అడ్వెంచర్ ఉంటుంది. ఒక ట్రెజర్ హంట్ లాంటి సినిమా. 5అలాగే అందరూ ఎంజాయ్ చేసుకునేలా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. సినిమా ఫన్ రైడ్‌లాగా ఉంటుంది. ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. "సిగ్మాతో తమిళ్‌లో డెబ్యూ చేస్తున్నా. లైకా ప్రొడక్షన్స్‌కి థాంక్యూ. చాలా అద్భుతంగా ఈ సినిమాని చేశారు. పక్కా కమర్షియల్ సినిమా లాగా ఉంటుంది. అదే సమయంలో చాలా కొత్తగా ఉంటుంది.

# సెన్సార్ పూర్తిచేసుకున్న 'ప్యారడైజ్'



ప్యారడైజ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన న్యాచురల్ స్టార్, కయాదు లోహార్ బ్రాండ్ న్యూ పోస్టర్ న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్"ది ప్యారడైజ్". శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.

తాజాగా మేకర్స్ నాని, కయాదు లోహార్‌ను ఇంటెన్స్ రొమాంటిక్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో నాని రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, కయదు లోహార్ కూడా ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి.. సిగరెట్స్ ను లైటర్‌తో వెలిగించుకుంటున్న విజువల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ ఉన్న డార్క్, ఇంటెన్స్ వాతావరణం మధ్య ఈ సన్నివేశం వారి మధ్య ఉన్న బాండింగ్‌ను డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉండబోతున్నాయి. జడల్ సుబ్బు..ప్రేమ ఇంతకుముందెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఉండబోతుంది.

"ది ప్యారడైజ్" సెన్సార్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంది.

రేపటి నుంచి మిగతా భాషల్లో ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తున్నారు. రేపు హీరో నాని చెన్నై వెళ్తున్నారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న"ది ప్యారడైజ్" సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.


# 'లీస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్' టీజర్ రిలీజ్



"లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్" హైలీ ఎంటర్టైనింగ్ టీజర్ రిలీజ్ హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం"లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్". బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. సెప్టెంబర్ 30 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక జూలైలో లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ స్ట్రీమింగ్ కానుంది.

తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. హర్ష ఫాదర్ ఎవరినైనా ప్రేమించమని చెప్పే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో ఫన్ అలరించింది. హర్ష టైమింగ్ అదిరిపోయింది. హైపర్ ఆది పంచులు మరో హైలైట్‌గా నిలిచాయి.జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం ఫన్‌ను మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.

# స్పై యాక్షన్ థ్రిల్లర్ 'జి-2' వరల్డ్‌వైడ్ గ్రాండ్ రిలీజ్



జి -2 పాన్ ఇండియా స్పై యాక్షన్ థ్రిల్లర్ జి2 వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సిక్వెల్‌గా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 2 రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. 2027 ఫిబ్రవరి 5న వరల్డ్ వైడ్ థియేటర్లలో రిలీజ్ కానుంది.

వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్ ని రీడిఫైన్ చేయనుంది. ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో ఇమ్రాన్ హాష్మీ పవర్ ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై టి.జి. విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కానుంది.

# 'మాయలేడి' మూవీ టీజర్ రిలీజ్



మాయలేడి

మాయలేడి మూవీ ఇంట్రెస్టింగ్ టీజర్ రిలీజ్ యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా ఖిఖిమాయలేడిఖిఖి. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు ఖిఖిమాయలేడిఖిఖితో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. అక్టోబర్ లో ఖిఖిమాయలేడిఖిఖి సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ రోజు మేకర్స్ ఖిఖిమాయలేడిఖిఖి సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే ప్రేమ, పెళ్లి విషయంలో కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్న అబ్బాయి క్రిష్. ఇంట్లో వాళ్లు పెళ్లి గురించి అడిగితే తనకు కరెక్ట్ అమ్మాయి దొరికేంత వరకు వెయిట్ చేస్తానంటాడు, ఆమెను చూసి కుటుంబ సభ్యులు భయపడినా క్రిష్ ఆశాను లవ్ చేస్తాడు. తప్పు జరిగితే ఆగ్రహంతో ఊగిపోయే ఆశాకు క్రిష్ కు గతంలో రూపా అనే గర్ల్ ఫ్రెండ్ ఉందని తెలుస్తుంది. రూపా గురించి తెలుసుకున్న ఆశా ఏం చేసింది? ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ విషయంలో క్రిష్ తో ఆమె ఎలా డీల్ చేసింది.

ఇటీవల రిలీజ్ చేసిన ఖిఖిమాయలేడిఖిఖి సినిమా గ్లింప్స్, టైటిల్ సాంగ్, ఖిసరిగమలే గుండె అంచుల్లో..ఖి పాటలకు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ను ప్రేక్షకుల్లో తాజాగా రిలీజ్ చేసిన టీజర్ క్రియేట్ చేస్తోంది

## ఉమెన్స్ ఏపీఎల్‌కు మద్దతుగా బైక్స్ అండ్ బ్యాట్స్ ర్యాలీ



**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో జరగనున్న ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) టోర్నమెంట్‌పై నగరంలో సందడి వాతావరణం నెలకొంది. మహిళా క్రికెటర్లను ప్రోత్సహించడం, టోర్నీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా విజయవాడలో ఖిబైక్స్ అండ్ బ్యాట్స్ఖి పేరిట భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఏసీఏ తీసుకున్న నిర్ణయం అభినందనీయం అన్నారు.ఉమెన్స్ ఏపీఎల్‌కు మద్దతుగా నిర్వహించిన ఈ బైక్స్ అండ్ బ్యాట్స్ ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమన్నారు.మోర్ ఉమెన్, స్ట్రాంగ్ ఆంధ్ర నినాదంతో మహిళా సాధికారతకు ఈ టోర్నీ ఉపయోగపడుతుందన్నారు. క్రీడల్లో మహిళలు మరింత ముందుకు రావాలి అన్నారు. నోవోటెల్ సమీపంలోని జెనెక్స్ షోరూమ్ వద్ద ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ, మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 మందికి పైగా మహిళా బైకర్లు ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బుల్లెట్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350, వివిధ రకాల స్పోర్ట్స్ బైక్‌లపై మహిళలు రయ్యిమంటూ దూసుకెళ్లారు. క్రికెట్ అభిమానులు, యువత పెద్దఎత్తున పాల్గొని సందడి చేశారు.

## మాజీ మంత్రి కారుమూరికి రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు నాగేశ్వరరావు తరలింపు

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్సార్సీపీ నేత మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు పిటి వారెంటుపై అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఈడీ అధికారులు ఆయన్ని విచారించి అరెస్ట్ చేసారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ క్రమంలోనే గురువారం సిట్ అధికారులు ఆయన్ను కస్టడీకి తీసుకున్నారు.చంచల్‌గూడ జైలు నుంచి పీటీ వారెంట్ పై కారుమూరి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్న అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కారుమూరి రిమాండ్‌పై విచారణ జరిపిన కోర్టు ఆయనకు ఈనెల 25 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ని తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించింది. లిక్కరు స్కాం విచారణ సందర్భంగా మద్యం రవాణా కాంట్రాక్టుల్లో దోపిడీ జరిగిందని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ప్రాథమికంగా గుర్తించింది. ఈ కుంభకోణంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తోంది. ఈ స్కాంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించిన ఈడీ కొన్ని నెలల కిందట ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఆర్) నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.కోస్తాంధ్రలో రవాణా వాహనాల కోసం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థతో సిగ్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని సిట్ తెలిపింది. ఈ సంస్థను నాటి మంత్రి, వైఎస్సార్సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు రంగంలోకి దించారని తన కుమారుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి ఆ సంస్థతో మరో ఒప్పందం చేసుకున్నట్లు సృష్టించారని గుర్తించింది. పేరుకే సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ తప్ప నిర్వహణ మొత్తం కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీలే చూసుకున్నారని సిట్ దర్యాప్తులో తేలింది. ఈడీ విచారణలోనూ ఈ అంశం వెల్లడైంది. కోర్టు ఆదేశాలను అనుసరించి విజయవాడనుంచి కారుమూరి నాగేశ్వరరావును అధికారులు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

# రైతులను గాలికొదిలేశారు!

- కరవు పరిస్థితులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది: వైఎస్ జగన్ ఆరోపణ



**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందని వైసిపి అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసిపి అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తంచేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిరక్ష్యం వహించిందని ఆరోపించారు.సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసిపి క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## యూట్యూబర్ రావణ్ పోలీసు కస్టడీకి అనుమతించిన కోర్టు

**గన్నవరం(విజయవాడ), సెప్టెంబర్ 17. ప్రభాతవార్తప్రతినిధి:** యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ రావణ్ అంశంలో గన్నవరం కోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. అతడిని వారం రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. దీంతో అతడిని గన్నవరం పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకోనున్నారు. జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో విద్వేషపూరిత వీడియోలు చేశారు. అలాగే ఏలూరులో జరిగిన ఓ సమావేశంలో యువతను రెచ్చగొట్టేలా మాట్లాడడం, నక్సలిజం వైపు వెళ్లేలా మాట్లాడారనే ఆరోపణల నేపథ్యంలో అతడిపై ఉపా (యూఏపీఏ) కేసు నమోదైంది. దాంతో జోసెఫ్ రావణ్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. రావణ్ వీడియోల వెనుక ఉన్న నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లతో సంబంధాలతోపాటు రాజకీయ లబ్ధి ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దాంతో అతడిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు గతంలో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న కోర్టు.. జోసెఫ్ రావణ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది.

## భార్య హత్య కేసులో నిందితుడైన భర్త దారుణ హత్య



**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** భార్య హత్యకేసులో జైలు శిక్షణ అనుభవిస్తున్న భర్త బెయిల్‌పై బయటికి వచ్చి నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో గురువారం దారుణహత్యకు గుర య్యారు. నిజామాబాద్‌లో పట్టపగలు అందరు చూస్తుండగానే భార్య హత్య కేసులో నిందితుడైన హరిబాబును తొమ్మిదిసార్లు పొడిచి చంపారు. కారులో నలుగురు వ్యక్తులు వచ్చారు అందులో ఓ వ్యక్తి కారుదిగి వచ్చి పదునైన ఆయుధంతో హరిబాబు తలపై నరికిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన యూట్యూబర్ వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు (26)కి వివాహం జరిగింది. హరిబాబు వైష్ణవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం వీరిద్దరి మధ్య చోటుచేసుకున్న వివాదాలు తీవ్రరూపం దాల్చడంతో హరిబాబు వైష్ణవిని దారుణంగా కత్తితో పొడిచి హత్యచేశాడని వైష్ణవి హత్యకేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొని అరెస్టు చేశారు. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు మృ తుడు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. హరిబాబు జైలు నుంచి విడుదలైన తర్వాత కోరుట్ల పరిసర ప్రాంతాల్లో కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథ మిక విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు దారుణహ త్యకు గురి కావడంతో సంచలనం కలిగింది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి హత్య కేసులో నిందితుడైన హరిబాబు గత కొన్నిరో జులుగా తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదోఠాణా పరిధిలోని ఇంద్రాపూర్‌లోని నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గురు తెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీకి తరలించారు. వైష్ణవి హత్య ఘటన తర్వాత ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల్లో చిత్తరి హరిబాబుపై తీవ్రఆగ్రహం నెలకొన్నట్లు అప్పట్లో చర్చ జరిగింది. వైష్ణవి కుటుంబానికి చెందిన ఎవరైనా హరిబాబు హత్యలో పాల్గొన్నారా? లేక మరేదైనా వ్యక్తిగత వివాదం ఈ హత్యకు కారణమా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. యూట్యూబర్ వైష్ణవి హత్యకేసు నిజామాబాద్, జగిత్యాల ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఏడుకొండల స్వామిని దర్శించుకుని వస్తూ తిరిగిరాని లోకాలకు

- జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** తిరుమల కొండపై జరుగుతున్న ఏడు కొండలస్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీవారిని దర్శించుకోవడానికి వచ్చిన తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కొప్పేచిపాడు గ్రామంకు చెందిన ఇద్దరు భక్తులు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది తిరిగిరాని లోకాలకు చేరారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద గురువారం ఉదయం ఈ ఘోర ప్రమాదం జరిగింది. మొగలిఘాట్‌లో మరమ్మత్తులకు గురై రహదారి ప్రక్కన నిలిచివున్న లారీని వెనుకవైపు నుండి వేగంగా బొలేరో కారు వచ్చి ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కొప్పేచిపాడు గ్రామంకు చెందిన కాంచన(38), ఉమాపతిరాజు(35)లు మృతి చెందారు. అలాగే ఈ ప్రమాదంలో గణపతి, నిత్య, పాండ్యన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉమాపతి రాజు మృతి చెందాడు. మృతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తిశ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రియుని హతమార్చిన ప్రియురాలు

- వరసకు పిన్ని అయినా ఇరువురు సహజీవనం



**విజయనగరం (గరివిడి), సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** తాళికట్టిన భర్తకు దూరంగా ఉంటూ ప్రియుడుతో సహజీవనం చేస్తూ, అదే ప్రియుడుని ఓ ఇల్లాలు హత్య చేసిన సంఘటన విజయనగరం జిల్లా గరివిడి మండలం కందిపేటలో చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తను కాదని ప్రియుడుతో సహజీవనం చేసి అదే ప్రియుడుని హత్య చేసిన ప్రియురాలు సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. కొడుకు వరసకు చెందిన యువకునితో సహజీవనం చేసి సమాజంలో సంబంధాలు, బంధుత్వాలు, కుటుంబ వ్యవస్థను నాశనం చేసే విధంగా ఆ ఇల్లాలు వివాహేతర సంబంధాన్ని కొనసాగించి మానవత్వానికే మచ్చ మిగిల్చారు. ప్రియుడుని హతమార్చిన ఇల్లాలు సంఘటనకు సంబంధించి పోలీసులు కథనం ప్రకారం కందిపేటకు చెందిన దనాల రాములమ్మ, దనాల రాజు భార్యాభర్తలు. రాములమ్మ తన భర్త రాజుకు దూరంగా ఉందేది. దానాల శ్రీను అనే యువకుడు కూడా తన భార్యకు దూరంగానే ఉన్నాడు. విశాఖపట్నం మల్కాపురం బాబాజీ నగర్‌లో నివాసముంటూ జివిఎంలో స్వీపర్ ఉద్యోగం చేసే శ్రీను కంది పేటలో తన వ్యావసాయ భూమి చూసే ప్రక్రియలో కందిపేటకు వస్తుండే వాడు. ఆ రాకపోకలు సమయంలో శ్రీను, రాములమ్మతో శారీరక సంబంధాలు కొనసాగించే వాడు. వీరిరువురూ 8 నెలలు క్రితం పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే తనకు విశాఖపట్నం తీసుకు వెళ్లాలని రాములమ్మ ఒత్తిడి చేసింది. ఈ నెల12 న కూడా కందిపేట వచ్చిన శ్రీనుతో ఆమె ఘర్షణ పడింది. బుధవారం రాత్రి ఘర్షణకు ముందే రాములమ్మ వ్యూహం ప్రకారం ఏర్పాటు చేసుకున్న సిమెంటు దిమ్మతో శ్రీను తలపై బలంగా కొట్టి హత్యకు పాల్పడింది. తీవ్ర గాయాలకు గురై రక్తం మడుగులో ఉన్న వ్యక్తిపై మరిగిన తైలాన్ని వేసి ఆత్మ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. శ్రీను అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచనామా నిర్వహించారు.మృతుడు తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేయగా, చీపురుపల్లి సి ఐ జి.శంకరరావు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం, వేలిముద్రలు సేకరణ ప్రక్రియ తో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# అనసభద్ర ఏకలవ్య విద్యార్థి ఆత్మహత్య

- అనుమానాస్పద మృతిగా తల్లిదండ్రుల ఆరోపణ

**పార్వతీపురంమ్రుక్కువ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** నా పిల్లాడిని చంపేశారు, ఏం జరిగిందో చెప్పడం లేదు, నాకు అన్యాయం జరిగింది, నా కొడుకుని బతికించి ఇవ్వండి తల్లి సవర చామంతి రోదన. నా కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు, కుటుంబంలో సమస్యలు లేవు ఒక్కగానొక కొడుకు ఏం జరిగిందో చెప్పకుండా ప్రిన్సిపాల్ సిబ్బంది అసలు విషయాన్ని దాస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు నీరసంతో పడిపోయాడు అని ప్రిన్సిపాల్ ఫోన్ చేశాడు అంతలోనే చనిపోవడం ఏంటి? నిజం తేలాల్సిందే మాకు న్యాయం జరగాల్సిందే తండ్రి సవర రాంబాబు కన్నీటి పర్యంతం. తల్లిదండ్రులు కుటుంబీకుల దయనీయరోధన అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం ఎర్రయ్యగూడ గిరి శిఖర గ్రామానికి చెందిన విద్యార్థి సవర హర్షిత్ అనుసభద్ర ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతూ గురువారం ఆత్మహత్య కు పాల్పడ్డాడు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ మరియు సిబ్బంది వివరణ మేరకు ఉదయం 9 గంటల ప్రాంతంలో టిఫిన్ సమయానికి సదరు విద్యార్థి డైనింగ్ హాల్లో కనిపించకపోవడంతో వాకబు చేయగా తోటి విద్యార్థులు తన రూములో కిటికీ కి ఉరి వేసుకున్నట్లు తరగతి ఇన్చార్జ్ ఉపాధ్యాయునికి చెప్పగా వెళ్లి చూడగా హర్షిత్ కిటికీ వద్ద వేల్పడినట్లు ఆయా వర్గాలు తెలిపాయి. అత్యవసర చికిత్స నిమిత్తం పాఠశాల వాహనంలో సమీప దోకిసిల పిహెచ్సి కి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించుతుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపారు. మృతుడు హర్షిత్ తల్లిదండ్రులకు ఇదే విషయమై 10 గంటల సమయంలో ప్రిన్సిపాల్ ఫోన్ చేసి నీరసంతో పడిపోయాడని అర్జెంటుగా రావాలని చెప్పినట్లు విద్యార్థి తల్లిదండ్రులు బోరును విలపిస్తూ తెలపడం గమనార్హం. అప్పుడే నీరసంతో పడిపోయిన నా కొడుకు అంతలోనే ఎలా చనిపోయాడు అంటూ అనుమానాన్ని వ్యక్తం చేస్తూ పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది అసలు విషయాన్నీ దాచి పెడుతూ బయటికి చెప్పడం లేదని కొడుకు మృతి పై అనుమానాలను వ్యక్తం చేయడం జరిగింది. విద్యార్థి అరిషత్ మృతిపై పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ ను వివరణ కోరగా ఎలా జరిగిందో తెలియడం లేదని ఎందుకు ఉరి వేసుకున్నాడో అర్థం కావడం లేదని క్లాసులో మెరిట్ స్టూడెంట్ రూమ్ లోకి వేలాడుతున్నట్లు తన తోటి విద్యార్థులు సమాచారం ఇస్తే వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడని ప్రమాద పరిస్థితి అంచనా వేసి సమీప ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**విద్యార్థి మృతి పై ఏపీఓ విచారణ...**

అలసభద్ర ఈ ఎంఆర్ ఎస్ విద్యార్థి సవర హర్షిత్ మృతిపై ఐటిడిఏ ఉప ప్రాజెక్టు అధికారి మురళి విచారణ చేపట్టారు. జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే క్షేత్రస్థాయిలో విద్యార్థులు పాఠశాలలో ఉన్న సిబ్బంది వివరణ కోసం అసలు సమాచారం రాబెట్టుకునేందుకు అనుసభద్ర వెళ్లి ఆరా తీశారు. మరోవైపు విద్యార్థి మృతి పట్ల గిరిజన సంఘాలు విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటు పూర్తిస్థాయి దర్యాప్తు జరిపితే అసలు నిజాలు బయటికి వచ్చి విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందని బలంగా వాని వినిపించారు. పోస్టుమార్టం అనంతరం వైద్య నివేదిక ఆధారంగా కేసును శోధించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

**ఆత్మహత్యపై అనుమానాలు ఎన్నో...**

ఇదిలా ఉండగా మృతుడు హర్షిత్ ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ఆరడుగుల కిటికీ ఐదు అడుగుల విద్యార్థి ఎలా ఉరితీసుకున్నాడు 14 సంవత్సరాల వయస్సు కలిగిన బాలుడు బాహ్య ప్రపంచం తెలియని విద్యార్థికి ఆత్మహత్య చేసుకునే ఆలోచన అసలు ఎందుకు వస్తుంది అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యార్థుల్లో గొడవలు లేదా ఇతర కారణాలతో హర్షిత్ మృతి చెందినట్లు యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే నిజాన్ని దాస్తున్నారని అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.


## డిజిటల్ ట్రాన్సాక్షన్లపై పన్ను వెంటనే రద్దు చేయాలి

- తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లు రవి

**హైదరాబాద్,సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** ప్రధాని మోడీ డిజిటల్ ట్రాన్సాక్షన్‌లపై విధించిన యుపిఐ పన్ను వెంటనే రద్దుచేయాలని తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి డిమాండ్ చేశారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఇది యుపిఐ టాక్స్ కాదు మోడీ టాక్స్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ ట్రాన్సక్షన్ చేయాలనీ అలవాటు చేసింది మీరే అందరు అలవాటు పడ్డాక ఇప్పుడు టాక్స్ వేయడం తీవ్రంగా ఖండించారు. మోడీ పాలనపై ప్రజలు భయపడుతున్నారనీ ఎప్పుడు ఏ తప్పుడు నిర్ణయం తీసుకొని వీధుల్లోకి నెట్టుతారో అనే అభద్రతతో ఉన్నారని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చాక 10 ఏళ్లు ఒక ఫ్యూడల్, రాజుల కెసిఆర్ పాలన చేశారనీ వారి బిఆర్ఎస్ పార్టీ ఎస్సి ల వ్యతి రేకమనీ ఆ రాజుల పాలనలో ప్రగతి భవన్ కట్టించారనీ,సెక్రెటేరియట్ కట్టారనీ ఎద్దేవా చేశారు. ప్రజలు తాము అడిగింది చేయాలని అధికారం ఇచ్చారని కానీ ప్రజలకు మంచి చేయడానికి కెసిఆర్‌కు చేతులు రాలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి ఫామ్ హౌస్‌పై విచారణ వేశారనీ సిఎం భయపడే వారైతే ఎందుకు చిట్టా మొత్తం చెప్తారనీ ఆయన ప్రశ్నించారు. నిజంగా ఏంత ఉందో తెలడానికే కదా విచారణ వేసిందనీ ఆయన వివరించారు. తెలంగాణ లో అనేక మంది పోరాటం చేశారు,ప్రాణాలు కోల్పోయారు అని విమోచనదినోత్సవం సందర్భంగా అమరులను జ్ఞాపకం చేసుకొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తించి తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను హైదరాబాద్ విముక్తి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారని అన్నారు.సాయుధ పోరాటంలో ఎంతో మంది విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోయారు సాయుధ పోరాటం లో నేను కూడా (మల్లురవి 14జులై1950న జన్మించారు) ఒక విద్యా సంవత్సరం కోల్పోయాను అనిఆవేదన చెందారు. తెలంగాణ సాయుధ పోరాటంతో బిజెపికి సంబంధం లేదనీ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు చేశాయనీ, తెలంగాణ లో రజాకార్ల కు వ్యతిరేకంగా సంవత్సరం సాయుధ పోరాటం జరిగిందనీ చెప్పారు. తెలంగాణకు కూడా స్వాతంత్రం రావాలని ప్రజలు పార్టీలకు అతీతంగా సాయుధ పోరాటం చేశారనీ ఆనాటి రోజులు ఆయన గుర్తుచేసుకొన్నారు.

# బిజెపిది ద్వంద్వ వైఖరి

- రెండేళ్లలో కూటమి ప్రభుత్వం పోతుంది
- వైసిపికి నేటి నుంచి కొత్త శకం ఆరంభం మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



**బొబ్బిలి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ఫీజు రియంబర్స్మెంట్ ఇతర సమస్యలపై జాతీయ బిజెపి తెలంగాణలో ఉద్యమం చేస్తుందని, ఆంధ్రాలో పెదవి విప్పకుండా ద్వంద వైఖరి అవలంబిస్తుందని రాష్ట్ర ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గురువారం స్థానిక సూర్య రెసిడెన్సిలో నియోజకవర్గస్థాయి వైయస్సార్సీపి ఎస్ వెంకట చిన్నప్ప నాయుడు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి తాను పాలించే రాష్ట్రాలను ఏ విధంగా చూస్తుందో ఆంధ్రను ఇంకో విధంగా చూస్తుందని ఆయన అన్నారు. ఇటీవల మజ్జి శ్రీనివాసరావు వైయస్సార్ పార్టీని వీడి టిడిపిలో చేరడంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిన్నటి వరకు ఆ పార్టీ దోపిడీదార్లని అనే వ్యక్తి నేడు వారి చెంతకే చేరారు అని ఆరోపించా రు. ఎవరు ఎటు వెళ్లిపోయిన పార్టీ శాశ్వతం అని తాను నా పిల్లలు శ్రీశభంగి సోదరులు వెంకట చిన్నప్పలనాయుడు. వేణుగోపాల్ నాయుడు. బొబ్బిలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభిమా నులు కార్యకర్తలు ఎప్పుడు శాశ్వతంగా ఉంటారని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విధంగా వెళ్లిపోయారని మీరు విచారించుకుని కూర్చోడం కాదు వెళ్లిపోయిందానికి సరైన గుణపాఠం చెప్పే విధంగా మీ ప్రవర్తన ఉండాలన్నారు. నీకు ఎన్నికల్లో న్యాయానికి అన్యాయానికి పోటీ జరుగుతుందని అన్నారు. ఆ హయాములో బొబ్బిలిలో అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే మేము తల వంచుకొని మీ దగ్గర నిల్చుంటామని అన్నారు. ఆసుపత్రి మా హయాంలోనే 50 పడకల ఆసుపత్రిగా తయారైందని అది గుర్తు లేదా అని అన్నారు. ఈ కార్యాలయం కెళ్ళిన లంచ్ అవతారం అని ప్రజలు గగోల పెడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో మన సత్తా ఏమిటో నిరూపించాలని కార్యకర్తలను కార్యోన్ముఖులుగా చేశారు. మీ సత్తా ఏమిటో స్థానిక ఎన్ని ఎన్నికల్లో తెలియాలన్నారు. లోకేష్ ఏ జైలు కావాలో ఎంచుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. డీఎస్సీలో అక్రమాలకు పాల్పడి కేసును జగన్ ప్రభుత్వం వచ్చినంతనే అరెస్ట్ చేయడం ఖాయమని అన్నారు. జిల్లాలో 8,000 మందికి గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్.వేణుగోపాల్ నాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు మృత్యువాత

- ముగ్గురికి తీవ్రగాయాలు..
- వినాయక నిమజ్జనంలో విషాదం !





**వి.కోట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** వినాయక చవితి ప ండగ సందర్భంగా ఏరా ్పటుచేసిన వినాయక ప్రతిమ నిమజ్జనంకు గ్రామస్తులు తరలిస్తుండగా రోడ్డులో వేగంగా వచ్చిన లారీ రోడ్డుపై నిలుచున్న వారిని ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురికి తీ వ్రగాయాలయ్యాయి. ఈసంఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండలం నాయకనేరి కొత్తూరు టోల్ గేట్ సమీపంలోని గందోడిపాళెం వద్ద బుధవారం అర్థరాత్రి చోటు చేసుకు ంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. చింతమాకుపల్లి పంచాయతీ గందోడిపాళెం గ్రామస్తులు బుధవారం రాత్రి వినాయక ప్రతిమను నిమజ్జనంను తరలిస్తున్నారు. అదే సమయంలో నాయకనేరి వైపు నుంచి వేగంగా వచ్చిన ఈచర్ లారీ రోడ్డుపై నిలుచుకుని ఉన్న వారిపై దూసుకెళ్లింది. దీంతో గ్రామానికి చెందిన దాము భార్య వరలక్ష్మి (35), తిరువలప్ప కుమారుడు శివ (27) మృతి చెందారు. ఇదే సంఘటనలో వరలక్ష్మి (27), వెన్నెల (17), దిలీప్ (15) తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108లో కుప్పం పిఇఎస్‌కు తరలించారు. గ్రామస్తులు ఉత్సాహంగా నిమజ్జనం జరుపుకుంటున్న సమయంలో ఈ ఘోర ప్రమాదం సంభవించడంతో గ్రామంలో విషాయ ఛాయలు అలుముకున్నాయి. వి.కోట సిఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.